RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ | 04 ఏప్రిల్ 2026 శనివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:257

## 2047 నాటికి తెలంగాణను టెక్స్‌టైల్ రాజధాని సీఎం రేవంత్ రెడ్డి

వార్తా 2 లో






## పిప్పిరి సభకు పకడ్బందీ ఏర్పాట్లు

## ఈనెల 6న సీఎం రేవంత్ రెడ్డి పర్యటన

వార్తా 3 లో



## క్యాతనపల్లి ఎమ్ ఎన్ ఆర్ గార్డెన్ లో మంచిర్యాల జిల్లా స్థాయి కాంగ్రెస్ సర్వసభ్య సమావేశం

రామ చంద్రుడు బీజేపీ జాగీరా..మతాల పేరిట రాజకీయాలు చేస్తుంది
బీజేపీ ప్రభుత్వం రెండు కోట్లా ఉద్యోగాలు ఇస్తానని మోసం చేసింది
బిజేపీ ప్రభుత్వం,బీద ప్రజల సంక్షమం కోసం కాంగ్రెస్ పార్టీ పని చేస్తుంది
పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్




ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 03 : మంచిర్యాల జిల్లాలోని క్యాతనపల్లి ఎమ్ ఎన్ ఆర్ గార్డెన్ లో మంచిర్యాల జిల్లా స్థాయి కాంగ్రెస్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శుక్రవారం రోజున ముఖ్యతిథులుగా హాజరైన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కార్మిక మైనింగ్ ఉపాధి శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి,జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు,పాల్గొన్న ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావాద్, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు,ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి తోపాటు నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేపించిన మహేష్ గౌడ్,ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ...

మిగతా 2లో

## ఎస్టీల భూములు లాక్కుంటూ.. కేరళకు వెళ్లి గొప్పలు చెబుతావా రేవంత్ రెడ్డి?

నీ సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఏ ఊర్లో రుణమాఫీ పూర్తయిందో చూద్దాం రా..
పాలమూరు ప్రాజెక్టును పడుకోబెట్టి కమీషన్ల కోసం కొడంగల్ లిఫ్ట్ ప్రాజెక్టు తెస్తున్నావు.
అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ చెప్పిన రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్ అని తేలిపోయింది.
ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని ఈ ప్రభుత్వం నెరవేర్చలేదు, కార్పొరేషన్లకు నిధులివ్వలేదు.
గిరిజనుల ఆత్మగౌరవాన్ని కాపాడి, తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్ దే.
కాంగ్రెస్ ప్రభుత్వంలో నేటి వరకు లంబాడీలకు మంత్రి పదవి లేదు
కొడంగల్‌లో మాజీ మంత్రి హరీశ్ రావు మీడియా సమావేశం



వార్తా 2 లో

## కల్తీ మామిడి పండ్లతో జాగ్రత్త, ఫోన్ చేయండి:

# సీపీ సజ్జనార్



హైదరాబాద్, ఏప్రిల్ 3 కల్తీ మామిడి పండ్లతో జాగ్రత్తగా ఉండాలని.. సీపీ సజ్జనార్ సూచించారు. కొంతమంది వ్యాపారులు.. మామిడి పండ్లను తొందరగా పక్వానికి వచ్చేందుకు ప్రమాదకరమైన రసాయనాలను ఉపయోగిస్తున్నారని తెలిపారు. పచ్చగా ఆకర్షణీయంగా కనిపిస్తున్న ప్రతీ మామిడి పండును మంచిది అని కొనుగోలు చేస్తే.. మన అనారోగ్యాన్ని మనమే తెచ్చుకున్నట్లు అవుతుందని సీపీ సజ్జనార్ తీవ్ర హెచ్చరికలు చేశారు. ప్రస్తుతం వేసవి కాలం రావడంతో మామిడి పండ్ల సీజన్ వచ్చేసింది. పండ్లలో రారాజు అయిన మామిడి పండు పేరు వింటేనే నోట్లో నీళ్లు ఊరుతున్నాయి. మార్కెట్లో బంగారు వర్ణంతో.. చూస్తేనే తినాలనే విధంగా.. నిగనిగలాడే మామిడి పండ్లు.. బండ్లు, దుకాణాల్లో సందడి చేస్తున్నాయి. రకరకాల మామిడి పండ్లు అన్నీ మార్కెట్‌కు రావడంతో మ్యాంగో లవర్స్ ఆనందంలో మునిగిపోతున్నారు. అయితే ఇప్పుడు మామిడి పండ్ల ప్రియుల గుండె గుభేల్ మనే వార్త వచ్చింది. కొందరు కాసుల కక్కుర్తి ఉన్న వ్యాపారులు.. మామిడి పండ్లను రసాయనాలతో మగ్గించి.. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఈ విషయంపై హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ సోషల్ మీడియా వేదికగా.. ప్రజలను అప్రమత్తం చేశారు. కల్తీ మామిడి పండ్లకు సంబంధించిన సమాచారాన్ని ఫోన్ చేసి చెప్పాలని వెల్లడించారు.వేసవి రాకతో పండ్లలో రారాజైన మామిడి పండ్లు మార్కెట్‌లో సందడి చేస్తోందని.. నోరూరించే ఈ ఫలాల మాటున ప్రాణాంతకమైన విషపు కోరలు దాగి ఉన్నాయన్న నిజాన్ని ప్రజలు విస్మరించకూడదని సజ్జనార్ అలర్ట్ చేశారు. కాసుల కక్కుర్తితో కొందరు స్వార్థపరులైన వ్యాపారులు ప్రజల ప్రాణాలను పణంగా పెడుతున్నారని.. సహజ సిద్ధంగా పక్వానికి రావాల్సిన మామిడి పండ్లను కాల్షియం కార్బైడ్, ఇతర రసాయాలను ఉపయోగించి కృత్రిమంగా మగ్గించి విక్రయిస్తున్నారని తెలిపారు. రోడ్డు పక్కన బండ్ల మీద నిగనిగలాడుతూ.. పసిడి వర్ణంతో కంటికి అత్యంత ఆకర్షణీయంగా కనిపిస్తున్న ప్రతి పండునూ నాణ్యమైనదిగా భావించి కొనుగోలు చేయడం అంటే.. అనారోగ్యాన్ని స్వయంగా కొని తెచ్చుకోవడమేనని సజ్జనార్ ట్వీట్ చేశారు.సాధారణంగా సహజంగా పండిన పండు అంతటా ఒకే రంగులో ఉండదు.. కానీ రసాయనాలతో మగ్గించిన పండ్లు మాత్రం పైన పసుపు పచ్చగా ఉండి.. లోపల మాత్రం పచ్చిగా ఉండి విషతుల్యంగా మారుతాయని సీపీ సజ్జనార్ తెలిపారు. ఇలాంటి రసాయనాలతో మగ్గించిన పండ్లను తినడం వల్ల గొంతులో మంట, కడుపులో వికారం, వాంతులు, విరేచనాలు వంటి సమస్యలతో పాటు.. దీర్ఘకాలంలో నాడీ వ్యవస్థ దెబ్బతినడం, శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారని సజ్జనార్ పేర్కొన్నారు.ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే ఇలాంటి కల్తీ వ్యాపారుల పట్ల హైదరాబాద్ పోలీస్ విభాగం ఇప్పటికే ఉక్కుపాదం మోపుతోందని సీపీ సజ్జనార్ వెల్లడించారు.

కల్తీ మామిడి పండ్లపైనా హెచ్-ఫాస్ట్ నిఘా ఉంచుతోందని.. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పండ్ల రూపాన్ని చూసి ప్రజలు మోసపోకుండా.. వాటి సహజత్వాన్ని గుర్తించి కొనుగోలు చేయాలని కోరుతున్నట్లు చెప్పారు.సహజంగా పండిన పండ్ల కంటే అసహజమైన రంగు, రసాయన వాసన, వింత రుచి కలిగిన మామిడి పండ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సీపీ సజ్జనార్ సూచించారు. మామిడి పండ్లపై అసాధారణంగా మచ్చలు ఉన్నా లేదా బేకింగ్ సోడా నీటిలో కడిగినప్పుడు రంగు మారినా అవి ఆరోగ్యానికి హానికరమని గ్రహించాలని తెలిపారు. కల్తీ మామిడి పండ్ల సమాచారం తెలిస్తే డయల్ 100కి గానీ.. హెచ్-ఫాస్ట్ ఫోన్ నంబర్ 8712661212కు సమాచారం ఇవ్వాలని సజ్జనార్ ప్రజలకు వెల్లడించారు.

## రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధి మాధ్యేయం



యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 3 తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హైదరాబాదులోని జూబ్లీహిల్స్ ఆయన నివాసంలో నేషనల్ డైరీ డెవలప్మెంట్ బోర్డు NDDB చైర్మన్ డాక్టర్ మీనేషే షా మదర్ డైరీ ఢిల్లీ చైర్మన్ జయతీర్ధచారి తో కలసి ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధిపై చర్చించి రాష్ట్రంలో మదర్ డైరీ పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం పాలు ఉత్పత్తులు పెంపు రైతులకు ప్రోత్సాహకాలు అందించి మదర్ డైరీ మౌలిక వసతులు కల్పించి సహకార సంఘాల బలోపేతం వంటి అంశాల పైన సమావేశంలో చర్చించారు మదర్ డైరీ రంగంలో పెట్టుబడులు పెంచడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కల్పించడం మా ప్రభుత్వం యొక్క లక్ష్యం పాడి పరిశ్రమ అభివృద్ధి మా ధ్యేయం అని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన అన్నారు ఈ సమావేశంలో పాల్గొన్నవారు భువనగిరి ఎంపీ శ్యామల కిరణ్ కుమార్ రెడ్డి రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి ప్రిన్సిపల్ సెక్రటరీ ఇలంబర్తి మదర్ డైరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జనగాం ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



ప్రజాబలం

04 ఏప్రిల్ 2026 శనివారం

# ఎస్టీల భూములు లాక్కుంటూ.. కేరళకు వెళ్లి గొప్పలు చెబుతావా రేవంత్ రెడ్డి?

## కొడంగల్‌లో మాజీ మంత్రి హరీశ్ రావు మీడియా సమావేశం

మొదటి పేజీ తరువాయి

ఈ కొడంగల్ ప్రాంతంలో గిరిజనులు ఆత్మగౌరవంగా భావించే లోకామసంద్ మహారాజ్ బావోజీ దేవాలయానికి గతంలో కనీసం వాగు దాటి వచ్చే పరిస్థితి ఉండేది కాదు.

గతంలో ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి కృషితో, నాటి సీఎం కేసీఆర్ రూ. 8 కోట్లు ఇచ్చి వాగుపై బ్రిడ్జి నిర్మించారు.

కేసీఆర్ మరో రూ. 80 లక్షలు గుడి కోసం, రూ. 50 లక్షలు బంజారా భవన్ కోసం కేటాయించారు.

లంబాడా పోరాట సమితి దశాబ్దాలుగా కొట్లాడితే.. కిరణ్ కుమార్ రెడ్డి, వైఎస్ రాజశేఖర్ రెడ్డి వంటి వారు ఎందరొచ్చినా ఎవరూ పట్టించుకోలేదు.

3100 గిరిజన గూడెంలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్ దే.

సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా జరిపించిన ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం.

ఎస్టీ రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచాం, ఆరు లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలిచ్చాం, మార్కెట్ కమిటీల్లో, వైన్ షాపుల కేటాయింపుల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించిన ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్.

కొడంగల్ తండాల్లో ఇంటింటికీ మిషన్ భగీరథ నీళ్లు ఇచ్చింది కేసీఆర్ కాదా.. ఆడబిడ్డల కోసం డిగ్రీ కాలేజీలు తెచ్చింది కేసీఆర్ ప్రభుత్వం.

కాంగ్రెస్ ప్రభుత్వంలో నేటి వరకు లంబాడీలకు మంత్రి పదవి లేదు. ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదు.

ఎస్టీ కార్పొరేషన్ కు బడ్జెట్ లో రూ. 2730 కోట్లు చూపించి, ఖర్చు చేసింది కేవలం రూ. 52 కోట్లు మాత్రమే.

రెండున్నరేళ్లలో ఒక్క ఎస్టీకి రూపాయి సాయం అందలేదు.

ఎస్టీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ ఇవ్వడం లేదు.

సేవాలాల్ కార్పొరేషన్ కు రూ. 100 కోట్లు కేటాయించి ఒక్క రూపాయి విడుదల చేయకుండా సేవాలాల్ మహారాజ్ గౌరవాన్ని కాంగ్రెస్ తగ్గించింది.

మనుమడితో ఫుట్ బాల్ ఆడుకోవడానికి రూ. 100 కోట్లు ఖర్చు చేస్తావు, క్యాంప్ ఆఫీసులు కట్టుకోవడానికి, అందాల పోటీలకు పైసలు ఉంటాయి కానీ ఎస్టీ కార్పొరేషన్ కు, ఎస్టీ విద్యార్థులకు ఇవ్వడానికి నీకు పైసలు లేవా రేవంత్ రెడ్డి?

ఓట్లప్పుడు వంగి వంగి దండాలు పెట్టి ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అన్నావు, అధికారంలోకి రాగానే కొడంగల్ లో ఎస్టీల భూములే లాక్కుంటున్నావా? జైళ్లలో పెట్టి థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తావా? ఇదేనా నీకు ఎస్టీల మీద ఉన్న ప్రేమ?

ఇక్కడ చేసిందేమీ లేదు కానీ.. కేరళకు పోయి తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అమలు చేశాం.. ఇక్కడ కూడా చేస్తాం అని వచ్చీరాని ఇంగ్లీషు, హిందీలో పెద్ద డైలాగులు కొడుతున్నావు.

తెలంగాణలో ఏ గ్యారెంటీలు అమలు చేశావు రేవంత్ రెడ్డి..

రైతు రుణమాఫీ చేశావా? మహిళలకు రూ. 2500 ఇచ్చావా? రైతు భరోసా, పెన్షన్ పెంపు, తులం బంగారం, స్కూటీలు.. ఏవి ఇచ్చావు?

తెలంగాణలో గ్రామసభలు పెడితే నీ నాయకుల మీద, అధికారుల మీద అక్కచెల్లెళ్లు తిరగబడ్డారు. అసెంబ్లీలో మీ ప్రభుత్వమే 16 వేల ఉద్యోగాలు ఇచ్చామని ఒప్పుకుంది.. మీరు చెప్పిన 2 లక్షల ఉద్యోగాలు బోగస్ అని తేలిపోయింది కదా..

నీ సొంత నియోజకవర్గం కొడంగల్ నుంచే సవాల్ విసురుతున్నా.. కొడంగల్ లో ఏ ఊరికి పోదాం చెప్పు.

ఏ ఊర్లో వంద శాతం రుణమాఫీ జరిగిందో చూద్దాం రా రేవంత్ రెడ్డి.

మూడుసార్లు రైతుబంధు ఎగ్గొట్టావు. గత యాసంగి బోనస్ ఎగ్గొట్టావు, ఈ యాసంగి కూడా ఎగ్గొడతావు.

ఉన్న కల్యాణ లక్ష్మి రావడం లేదు, కేసీఆర్ కిట్ బంద్, బతుకమ్మ చీరలు బంద్, మోటార్లకు కరెంట్ రావడం లేదు..

ఉన్నవి ఊడగొట్టడం తప్ప కొత్తగా నువ్వు చేసిందేముంది..

కేరళ ప్రజలు నీకంటే తెలివైన వాళ్లు.

గూగుల్ లో వెతికితే తెలంగాణలో ఎన్ని గ్యారెంటీలు అమలయ్యాయో వాళ్లకు తెలుస్తుంది. మహారాష్ట్రకు పోతే అక్కడ కాంగ్రెస్ ను ప్రజలు ఎండగట్టారు, రేపు కేరళలో కూడా కాంగ్రెస్ ఓడిపోతుంది. రేవంత్ రెడ్డి ఒక ఐరన్ లెగ్.

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పడుకోబెట్టావు. 90 శాతం పనులు మేము పూర్తి చేస్తే, మిగిలిన ఆ 5 శాతం పనులు కాలువలు, బండరాళ్లు తొలగించడం పూర్తిచేసి నీళ్లు ఇవ్వడానికి నీకు చేతకావడం లేదు.

మేము నిర్మించిన ఏదుల, వట్టెం ప్రాజెక్టుల ద్వారా మొన్న వచ్చిన నీళ్లను నింపుకుంటే ఈపాటికి ఇక్కడ బంగారు పంటలు పండేవి.

నీళ్లు ఇస్తే ఆ పేరు కేసీఆర్ కు వస్తుందనే కుట్రతోనే పాలమూరు ప్రజల గుండెల మీద తంతూ ప్రాజెక్టును ఆపేశావు.

కడవల కాలువ నుంచి కొడంగల్-నారాయణపేట లిఫ్ట్ కింద లక్షన్నర క్యూసెక్కుల నీళ్లు తెచ్చే అవకాశం ఉన్నా.. కేవలం ఒక ప్రాజెక్టు కోసం రూ. 4500 కోట్లు దండుకోవాలని చూస్తున్నావు.

పాలమూరు-రంగారెడ్డి ద్వారా మక్తల్, నారాయణపేటకు లక్ష ఎకరాలు, కొడంగల్ కు లక్షన్నర ఎకరాలకు నీళ్లు వస్తాయి.

కానీ నువ్వు ఇప్పుడు కొత్తగా రూ. 4500 కోట్లతో తెస్తున్న లిఫ్ట్ ద్వారా మక్తల్ కు 25వేలు, నారాయణపేటకు 20వేలు, కొడంగల్ కు 50వేల ఎకరాలకు మాత్రమే నీళ్లు వస్తాయి.

ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ఈ కమీషన్ల కక్కుర్తి ఆపి, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి.

గత రెండు సీజన్లలో నీళ్లను లిఫ్ట్ చేయకుండా ఆంధ్రాకు వదిలిపెట్టి పాలమూరు ప్రజలకు అన్యాయం చేసిన రేవంత్ రెడ్డి ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలి.

# 2047 నాటికి తెలంగాణను టెక్స్‌టైల్ రాజధాని సీఎం రేవంత్ రెడ్డి



2047 నాటికి తెలంగాణను దక్షిణ ఆసియాకు టెక్స్‌టైల్ రాజధానిగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన ఏషియన్ టెక్స్‌టైల్ కాన్ఫరెన్స్ 2026లో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో తయారైన వస్త్రాలను ప్రపంచంలోని ప్రతి దేశంలో ప్రజలు ధరించేలా చేయాలన్నదే తన ఆశయమని అన్నారు.టెక్స్‌టైల్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే వారికి అన్ని రకాలుగా అండగా ఉంటామని సీఎం భరోసా ఇచ్చారు. పెట్టుబడిదారులకు అవసరమైన భూమి, విద్యుత్, నీరు, రాయితీలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, అనుమతులు కూడా వేగంగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. "మీకు విజన్ ఉంటే, మీకు సరైన భాగస్వాములం మేమే. కలిసికట్టుగా ప్రపంచాన్ని మార్చగల టెక్స్‌టైల్ వ్యవస్థను నిర్మిద్దాం" అని ఆయన పిలుపునిచ్చారు.తెలంగాణ వస్త్రాలకు ఘనమైన చరిత్ర ఉందని, పోచంపల్లి ఇక్కత్, గద్వాల చీరల నుంచి వరంగల్ దర్రీల వరకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని సీఎం గుర్తుచేశారు. దేశంలోనే అత్యధికంగా నాణ్యమైన పత్తిని ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణకు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉందని తెలిపారు. వరంగల్‌లో ప్రపంచ స్థాయి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అందుబాటులో ఉందని వివరించారు.హైదరాబాద్ ఫిల్మ్ ప్రొడక్షన్‌కు హబ్‌గా మారుతోందని, నెట్‌ఫ్లిక్స్ వంటి సంస్థలు ఇక్కడ స్టూడియోలు ఏర్పాటు చేస్తున్నాయని సీఎం అన్నారు. బాలీవుడ్‌తో పాటు ఇప్పుడు హాలీవుడ్ కూడా హైదరాబాద్ వైపు చూస్తోందని, సినిమా పరిశ్రమ ఫ్యాషన్ అవసరాలను స్థానికంగానే తీర్చేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రంలో గ్రీన్ టెక్స్‌టైల్ హబ్‌లను అభివృద్ధి చేస్తామని, యువతకు, ముఖ్యంగా మహిళలకు నైపుణ్య శిక్షణ ఇస్తామని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# క్యాతనపల్లి ఎమ్ ఎన్ ఆర్ గార్డెన్ లో మంచిర్యాల జిల్లా స్థాయి కాంగ్రెస్ సర్వసభ్య సమావేశం

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త పని చేయాలి,కాంగ్రెస్ పార్టీలో సీనియార్టీ ప్రతిపాదికనే పదవులు ఇస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసే వ్యక్తులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది.అన్ని పార్టీల్లో గ్రూప్ రాజకీయాలు ఉంటాయి. అవి అన్ని పక్కన పెట్టీ పార్టీ కోసం పని చేయాలి.బిఆర్ఎస్ పార్టీ పది ఏండ్లు చేసిన అరాచకాలు కాంగ్రెస్ పార్టీ ఎత్తి చూపింది.అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రతి పక్షాలు చేస్తున్న ఆరోపణల ను తిప్పి కొట్టాలి.గత పది ఏండ్ల బి ఆర్ ఎస్ పాలన లో రాష్ట్రం అప్పుల కుప్పగా మార్చింది.కాళేశ్వరం ప్రాజెక్ట్,మిషన్ భగీరథ పథకాల్లో భారీ స్కాం జరిగింది. వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి అప్పుల రాష్ట్రం గా మార్చింది.ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణ రావు మాట్లాడుతూ...ఇచ్చిన 6 గ్యారంటీలు అమలు చేస్తున్నాం.ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా కూడా సంక్షమ పథకాలు అమలు చేస్తుంది.గత ప్రభుత్వంలో చేసిన అప్పులకు వడ్డీలు కడుతున్నాం.గత ప్రభుత్వంలో జరిగిన అన్యాయలను వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలి. రాహుల్ గాంధీ సోనియాగాంధీ ఫ్యామిలీ త్యాగాల పార్టీ.కాంగ్రెస్ పార్టీ కోసం ఇందిరా గాంధీ,రాజీవ్ గాంధీ ప్రాణాలు అర్పించారు. ప్రధాన మంత్రి పదవి కూడా చేపట్టలేదు.పార్టీలో కష్టపడ్డ వారికి పదవులు రావాలి.పార్టీ గుర్తింపు ఇస్తుంది.పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడాలి.పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ...బిఆర్ఎస్ నిర్బంధ పాలనలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు చాలా ఇబ్బందులు పడ్డారు.అక్రమ కేసులు అనుభవించారు.కార్యక్తల వల్లే ఈ రోజు కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చింది.దేశం లో కాంగ్రెస్ పార్టీకి గొప్ప చరిత్ర ఉంది.65 ఏండ్ల కాంగ్రెస్,టీడీపీ పాలన లో చేయలేని అప్పులు బిఆర్ ఎస్ ప్రభుత్వం చేసింది. కేసీఆర్ హయాంలో 8 లక్షల అప్పులు దాటింది.అప్పుల కు వడ్డీలు కడుతూనే సంక్షమ పథకాలు అందిస్తున్నాం.గత ప్రభుత్వంలో బియ్యం అక్రమ స్మగ్లింగ్ నడిచింది.బిఆర్ఎస్ నాయకులు వేల కోట్ల రూపాయలు అక్రమంగా సమాధించారు.

శ్రీ రామ చంద్రుడు బీజేపీ జాగీరా.మతాల పేరిట రాజకీయాలు చేస్తుంది.బీజేపీ ప్రభుత్వం రెండు కోట్లా



ఉద్యోగాలు ఇస్తానని మోసం చేసింది,బిజేపీ ప్రభుత్వం.బీద ప్రజల సంక్షమం కోసం కాంగ్రెస్ పార్టీ పని చేస్తుంది. దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ బిజెపి ప్రభుత్వం ఎందుకు చేయడం లేదు.దోసుకున్న సొత్తులో కేసీఆర్ ఫ్యామిలీ లో తగాదాలు జరుగుతున్నాయి.కుల మతాలను రెచ్చగొట్టే బిజెపి పార్టీకి తెలంగాణ లో అవకాశం లేదు.ఇప్పుడిప్పుడే ప్రభుత్వాన్ని రిపేర్ చేస్తున్నాం. త్వరలో ప్రభుత్వాన్ని గాడిలో పెడతాం,సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన విదేశీ పెట్టుబడులు వస్తున్నాయి.ఈ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాల్లో చట్టంగా మారుతున్న యూసీసీ

దేశవ్యాప్తంగా పలు రాష్ట్ర అసెంబ్లీలు యూనిఫాం సివిల్ కోడ్ బిల్లుకు వరుసగా ఇప్పుడు అది చట్టంగా మారనుంది. ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) అవసరంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడారు.ఒకే కుటుంబంలో ఇద్దరికి భిన్నమైన నిబంధనలు వర్తించకూడదు. అసలు ఒకే ఇంట్లో రెండు విధానాలు ఎలా సాధ్యం?" అని ప్రధాని మోదీ ప్రశ్నించారు. ఒకవేళ ఒకే ఇంట్లోని కుటుంబంలో ఇద్దరు వ్యక్తులకు రెండు రకాల చట్టాలుంటే, ఆ ఇల్లు నడవదు" అని అన్నారు.చట్టం కూడా సమానత్వం గురించే మాట్లాడుతుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని మోదీ అన్నారు.ఈ బిల్లు మహిళలకు ప్రయోజనకరమని ప్రజావేదికల పైనా, మీడియాతోనూ, శాసనసభలోనూ మంత్రులు పదేపదే చెబుతున్నారు. ఈ బిల్లు ఆమోదం పొందాక, గుజరాత్‌లో మహిళల స్థితిగతులు, లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌ల గురించి కూడా చర్చ మొదలైంది.ఈ బిల్లు వల్ల మహిళలకు పెద్దగా ప్రయోజనం ఉండదని, పైగా సామాజిక సమస్యలు పెరుగుతాయని కొందరు నిపుణుల అభిప్రాయం. మరోవైపు, అణగారిన వర్గాల మహిళలకు ఈ బిల్లు వల్ల మేలు జరుగుతుందని మరికొందరు అంటున్నారు.యూనిఫాం సివిల్ కోడ్ బిల్లులో మహిళల కోసం ఉన్న ముఖ్యమైన నిబంధనలు ఏమిటి, వారికి ఎలాంటి కొత్త హక్కులు కల్పించబోతున్నారు?నిపుణులు ఏమంటున్నారు?ప్రతి మహిళకు వారసత్వ ఆస్తిలో సమాన వాటా లభిస్తుంది. మతం ఆధారంగా మహిళల కోసం ఎటువంటి ప్రత్యేక నిబంధనలు ఉండవుసామాజిక సంప్రదాయాల ప్రకారం ఇచ్చే విడాకులు కాకుండా, కోర్టు ద్వారా మంజూరయ్యే విడాకులు మాత్రమే చెల్లుబాటు అవుతాయి.వివాహం ప్రతి మతంలో వారి ఆచారాల ప్రకారం చేసుకోవచ్చు, కానీ వివాహం రిజిస్ట్రేషన్ చేయించుకోవడం తప్పనిసరి.లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉన్న మహిళను భాగస్వామి వదిలేస్తే, ఆమెకు భరణం పొందే హక్కు ఉంటుంది, వారికి పుట్టిన బిడ్డకు వారసత్వ హక్కులు లభిస్తాయి.వారసత్వ ఆస్తికి సంబంధించి ఎటువంటి వీలునామా రాయకపోతే స్థిరాస్తులు, చరాస్తులలో మహిళకు సమాన హక్కు లభిస్తుంది.ఏ మతంవారైనా సరే ఒక భార్య ఉండగా రెండో వివాహం చేసుకోకూడదనే నియమం తీసుకొచ్చారు.భర్త విడిచిపెట్టిన మహిళలకు న్యాయం చేసే అంశం కూడా ఈ బిల్లులో ఉంది.కోర్టు ద్వారానే కచ్చితంగా విడాకులు తీసుకోవాలనే నిబంధన గురించి రిటైర్డ్ జడ్జి జ్యోత్స్న యాజ్ఞిక్ మాట్లాడారు."యూనిఫాం సివిల్ కోడ్‌లో సామాజిక పద్ధతుల్లో ఇచ్చే విడాకులను అంగీకరించే బదులు, కోర్టు ద్వారానే విడాకులు తీసుకోవడం తప్పనిసరి చేశారు. అయితే ప్రస్తుత పరిస్థితిని గమనిస్తే, ఫ్యామిలీ కోర్టులలో ఇప్పటికే విడాకుల కేసులు భారీగా పెండింగ్‌లో ఉన్నాయి. అటువంటప్పుడు రాబోయే రోజుల్లో విడాకుల కేసుల భారం మరింత పెరుగుతుంది" అన్నారు యాజ్ఞిక్."ప్రస్తుతం చాలా కులాల్లో సామాజిక పద్ధతుల్లో జరిగే విడాకులు ఇకపై చెల్లకుండా పోతాయి. దీనివల్ల ఫ్యామిలీ కోర్టుల్లో కేసుల పరిష్కారానికి ఎక్కువ సమయం పడుతుంది. కొన్ని కేసుల్లో తక్కువ వయసున్న అమ్మాయిలు లేదా అబ్బాయిల విడాకుల పిటిషన్లు సరైనవే అయినప్పటికీ, ఇటువంటి పరిస్థితుల్లో కేసులు సుదీర్ఘకాలం కొనసాగుతాయి. దీనివల్ల విడాకుల తర్వాత తిరిగి వివాహం చేసుకునే అవకాశం చాలామందికి తగ్గిపోతుంది" అని జ్యోత్స్న యాజ్ఞిక్ చెప్పారు."చాలా సమాజాలలో 'లేఖణి', 'సాటాపాటా' వంటి ఆచారాలు ఇంకా కొనసాగుతున్నాయి. ఇటువంటి సంప్రదాయ పద్ధతుల ద్వారా జరిగే విడాకుల ప్రక్రియ దుర్వినియోగమవుతున్నట్లు 2021 చివరిలో గుజరాత్ హైకోర్టులో జస్టిస్ జేబీ పార్డీవాలా, జస్టిస్ నానావతి ధర్మాసనం గుర్తించింది. అయినప్పటికీ, నేటికీ ఈ పద్ధతులు కొనసాగుతున్నాయి. తక్కువ చదువుకున్నవారు, ఆత్మగౌరవం కోసం విడాకులు తీసుకునే మహిళలు ఈ పద్ధతుల ద్వారా విడాకులు పొందినా స్వల్ప కాలంలోనే మరో వివాహం చేసుకోగలుగుతున్నారు. ఇప్పుడు కోర్టులలో ఇటువంటి కేసుల భారం పెరిగి, న్యాయమూర్తుల సంఖ్య తక్కువగా ఉంటే, కొన్ని కులాలకు చెందిన మహిళలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది" అని ఆమె అభిప్రాయపడ్డారు."మహిళలకు అత్యంత ప్రమాదకరమైన నిబంధన ఏదైనా ఉందంటే, అది లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌కు గుర్తింపునివ్వడమే. ఈ సంబంధాలను రిజిస్ట్రేషన్ చేసుకోవడం తప్పనిసరి చేశారు. గతంలో లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉండేవారు సమాజానికి భయపడేవారు. కానీ ఇప్పుడు బహిరంగంగా, చట్టబద్ధంగా ఇటువంటి సంబంధాల్లో ఉండవచ్చు. కొత్త తరంలో లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లకు ఈ విధంగా గుర్తింపు లభిస్తే, సమాజాన్ని ఏకంగా ఉంచే వివాహ వ్యవస్థ బలహీనపడిపోతుంది. ఇది రాబోయే రోజుల్లో ప్రమాదకరం" అని న్యాయవాది పూజా ప్రజాపతి అభిప్రాయపడ్డారు"లివ్-ఇన్ రిలేషన్‌షిప్ ద్వారా జన్మించిన బిడ్డకు కూడా హక్కులు కల్పించే అంశం ఈ చట్టంలో ఉంది. ఈ సంబంధాల వల్ల కలిగే పిల్లల విషయంలో స్త్రీ, పురుషుల మధ్య కొత్త చట్టపరమైన వివాదాలు తలెత్తుతాయి. లివ్-ఇన్‌లో ఉన్న మహిళపై ఆరోపణలు వస్తే, కొత్త గొడవలు మొదలయ్యే అవకాశం ఉంది. దీనివల్ల మహిళలకు ఎక్కువ నష్టం కలగవచ్చు. అంతేకాకుండా, 18 నుంచి 21 ఏళ్ల లోపు యువతీ యువకులు లివ్-ఇన్ రిజిస్ట్రేషన్ చేయించుకుంటే వారి తల్లిదండ్రులకు సమాచారం అందించాలనే నిబంధన ఉంది. దీనివల్ల కొత్త సామాజిక సంఘర్షణలు మొదలవుతాయి. ఈ యూనిఫాం సివిల్ కోడ్ వల్ల దీర్ఘకాలంలో ప్రయోజనం కంటే వివాహ వ్యవస్థకే ముప్పు పొంచి ఉంది" అని చెప్పారు.యూనిఫాం సివిల్ కోడ్ ద్వారా విడాకుల కేసుల్లో మహిళలకు తక్షణమే భరణం అందడం, వివాహం జరిగిన ఏడాది తర్వాతే విడాకుల కేసు దాఖలు చేయాలనే నిబంధనలు మంచి పరిణామాలే. అయితే, మహిళలకు దీనివల్ల ఏవో పెద్దఎత్తున ప్రయోజనాలు కలుగుతాయని మాత్రం అనిపించడం లేదు" అని పూజా ప్రజాపతి అన్నారు.

## పురుగుల మందుతాగిన సర్పంచ్..

## ఆస్పత్రికితీసుకొళ్తుండ గా రోడ్డు ప్రమాదం

నిర్మల్ జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది.కడెం మండలం మాసాయిపేట గ్రామ సర్పంచ్ లహరి ఆత్మహత్యాయత్నం చేయడం.. ఆపై ఆసుపత్రికి తరలిస్తుండగా జరిగిన ప్రమాదంలో ఆమె ప్రాణాలు కోల్పోవడం స్థానికంగా కలకలం రేపుతోంది. మాసాయిపేట సర్పంచ్ లహరి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే కారులో ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. లహరిని తీసుకువెళ్తున్న కారు వేగంగా వెళ్తూ మార్గమధ్యలో అదుపు తప్పింది. రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ట్రాక్టర్ నాగళ్లను కారు బలంగా ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో కారు తీవ్రంగా దెబ్బతినగా.. లహరి పరిస్థితి మరింత విషమించింది. వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించినప్పటికీ మార్గమధ్యలోనే ఆమె ప్రాణాలు విడిచారు. ఒకే రోజు అటు ఆత్మహత్యాయత్నం, ఇటు రోడ్డు ప్రమాదం జరగడంతో మాసాయిపేట గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. సర్పంచ్ లహరి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలేంటి? ప్రమాదం ఎలా జరిగింది? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా హుజురాబాద్ బంద్

## వ్యాపారులు, ప్రజల స్వచ్ఛంద మద్దతు? పూర్తి స్థాయిలో మూతపడిన దుకాణాలు

**హుజురాబాద్ ప్రజాబలం ప్రతినిధి :** హుజురాబాద్ పట్టణం శుక్రవారం ప్రజా గర్జనతో మార్మోగింది. 'వేస్ట్ టు ఎనర్జీ' డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పిలుపుతో చేపట్టిన బంద్‌కు విస్తృత




స్పందన లభించింది. పట్టణం మొత్తం ఒకే స్వరంతో నిరసన వ్యక్తం చేయడంతో డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాటం మరింత ఉధృతమైంది. ఉదయం మొదలైన బంద్‌కు వ్యాపారులు స్వచ్ఛందంగా మద్దతు ప్రకటించారు. దుకాణాలు, వాణిజ్య సముదాయాలు, హోటళ్లు పూర్తిగా మూతపడ్డాయి. నిత్యావసర సేవలు మినహా అన్ని రంగాలు బంద్‌లో పాల్గొనడం గమనార్హం. పెట్రోల్ బంకులు సైతం స్వచ్ఛందంగా మూసివేసి నిరసనకు మద్దతు తెలపడం ఉద్యమ తీవ్రతను చాటింది. ఇక ఉదయం నుంచే ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ సాగుతూ డంపింగ్ యార్డ్ వల్ల కలిగే ప్రమాదాలను ప్రజలకు వివరించారు. వ్యాపారులను కలిసి బంద్‌కు సహకరించాలని కోరగా, ప్రజలు, వ్యాపారులు ఉత్సాహంగా స్పందించారు. సిరసపల్లి శివారులో ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న దీక్షలు 12వ రోజుకు చేరుకోవడంతో ఉద్యమం మరింత వేడెక్కింది. అంబేద్కర్ చౌరస్తాలో నిరసనకారులు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా ఉన్న ఈ ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు. అవసరమైతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. బంద్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. పట్టణంలోని కీలక ప్రాంతాల్లో బలగాలను మోహరించి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించారు. ర్యాలీలు, నిరసనలు జరిగినప్పటికీ ఎక్కడా ఉద్రిక్తతలు చోటుచేసుకోకపోవడం గమనార్హం. మొత్తంగా ప్రజలు, వ్యాపారులు ఒకే తాటిపైకి వచ్చి బంద్‌ను విజయవంతం చేయడంతో ప్రభుత్వం డంపింగ్ యార్డ్ నిర్ణయాన్ని పునరాలోచించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ పోరాటం ఇకపై మరింత ఉధృతం కావచ్చన్న సంకేతాలు కనిపిస్తున్నాయి.

# అత్యుత్తమ రాజధానిగా అమరావతి ఇదే నా శపథం



విజయవాడ, ఏప్రిల్ 3 ఏపీ రాజధాని అమరావతికి పార్లమెంట్ సాక్షిగా చట్టబద్ధత లభించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. పుష్కర కాలం కిందట తాము పునాది వేసిన అమరావతి కల ఇప్పుడు చట్టరూపం దాల్చడం శుభపరిణామమని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపిన ఆయన, పార్లమెంట్‌లో అన్ని పార్టీలు ఈ బిల్లును సమర్థించినా, ఒక్క వైసీపీ మాత్రమే వ్యతిరేకించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. దేశంలో అన్ని పార్టీలది ఒక దారైతే, వైసీపీది మరో దారి అంటూ ఆ పార్టీ వైఖరిని ఎండగట్టారు.

తాను తెలంగాణ అభివృద్ధికి ఎప్పుడూ వ్యతిరేకం కాదని, నిజానికి సైబరాబాద్, హైటెక్ సిటీల రూపకల్పనతో తెలంగాణ తన బ్రెయిన్ చైల్డ్ అని చంద్రబాబు గుర్తుచేశారు. విభజన సమయంలో రెండు రాష్ట్రాలకు న్యాయం జరగాలని కోరుకున్నానని, కానీ రాజధాని కూడా లేకుండా ఏపీని విడదీయడం అన్యాయమని పేర్కొన్నారు. ఆ క్లిష్ట పరిస్థితుల్లో తన అనుభవంతో పోలవరం ముంపు మండలాలను ఏపీలో విలీనం చేయించానని, అవి కలిపితేనే తాను ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తానని పట్టుబట్టి సాధించుకున్నానని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. జగన్ ప్రతిపాదించిన మావిగన్ వంటి వింత పేర్లపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పేరు చెప్పడానికి కూడా నాకు ఇష్టం లేదు అంటూ కౌంటర్ ఇచ్చారు. 2014లోనే 9 నగరాల కలయికతో ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతిని ప్లాన్ చేశామని, కానీ గత పాలకులు కుట్రలతో, నేరాలతో దాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. రైతులను రెచ్చగొట్టినా వారు వెనక్కి తగ్గకుండా భూములు ఇచ్చారని, అమరావతి రైతుల త్యాగం వృధా పోదని భరోసా ఇచ్చారు. ఒకప్పుడు హైదరాబాద్ కంటే అమరావతిలోనే భూముల ధరలు ఎక్కువగా ఉండేవని చంద్రబాబు గుర్తుచేశారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ చుట్టూ భూములు ఇచ్చిన వారు ఎలాగైతే లాభపడ్డారో, భవిష్యత్తులో అమరావతి రైతులు కూడా అదే స్థాయిలో ఆర్థికంగా ఎదుగుతారని ధీమా వ్యక్తం చేశారు. ఏపీలో అపారమైన వ్యవసాయ భూములు ఉన్నాయని, సరైన ప్రణాళికతో అభివృద్ధి చేస్తే హైదరాబాద్‌ను మించిన సంపదను సృష్టించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. గత పాలకుల తీరును ఉద్దేశించి మాట్లాడుతూ.. గతంలో వారిని సైకోలు అనేవారు, ఇప్పుడు అవన్నీ మాట్లాడదలుచుకోలేదు అంటూ పరోక్షంగా జగన్మోహన్ రెడ్డిపై విమర్శలు సంధించారు. వైసీపీ నేతలు గతంలో మంత్రులుగా ఎలా పనిచేశారో అర్థం కావడం లేదని, వారి కుట్రలు ఇక సాగవని హెచ్చరించారు. భగవంతుడు తనకు రెండు గొప్ప అవకాశాలు ఇచ్చాడని, ఒకప్పుడు హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలిపినట్లే, ఇప్పుడు అమరావతిని అత్యుత్తమ రాజధానిగా నిర్మిస్తానని చంద్రబాబు శపథం చేశారు.

# పిప్పిరి సభకు పకడ్బందీ ఏర్పాట్లు

# ఈనెల 6న సీఎం రేవంత్ రెడ్డి పర్యటన









**అదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి** ఏప్రిల్ 03, 2026 -- ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో ఈనెల 6న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు.

శుక్రవారం మంత్రి వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, స్థానిక శాసనసభ్యుడు అనిల్ జాదవ్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, జిల్లా కలెక్టర్ రాజర్షి షా తదితరులతో కలిసి సభా ప్రాంగణాన్ని పరిశీలించారు.

అనంతరం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి జూపల్లి మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి ఈనెల 6న ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నారని తెలిపారు. బోథ్ నియోజకవర్గంలో సుమారు రూ.1200 కోట్ల వ్యయంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల కోసం ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శంకుస్థాపన చేయనున్నారని పేర్కొన్నారు. ఈ విద్యాసంస్థలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు.

అలాగే బాసర సరస్వతి దేవాలయ అభివృద్ధికి రూ.300 కోట్లు, 2027 గోదావరి పుష్కరాల కోసం రూ.500 కోట్లతో కుంభమేళా తరహాలో ఏర్పాట్లు చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా రూ.600 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరగనున్నాయని తెలిపారు. సభకు ప్రజలు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

**పిప్పిరి సభను విజయవంతం చేయాలి**
**మంత్రి వివేక్ వెంకటస్వామి**

ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా ఎక్కడా లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు, పార్టీ శ్రేణులకు సూచించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ఈ సభ మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు, తాగునీరు వంటి సౌకర్యాలను సమకూర్చాలని ఆదేశించారు.

**ఉమ్మడి ఆదిలాబాద్ అభివృద్ధిపై సీఎం దృష్టి**
**ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. సాగునీటి, విద్యా రంగాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ సుమారు రూ.600 కోట్ల పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు. పిప్రి సభలో కీలక ప్రకటనలు వెలువడే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన రైతులకు ఎంతో మేలు చేస్తుందని అన్నారు. పిప్పిరి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ మంజూరు అయితే ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని తెలిపారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని కోరారు.

**ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు**
**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈనెల 6న మధ్యాహ్నం 2:00 గంటలకు హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి చేరుకుని, అనంతరం సభా ప్రాంగణంలో అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరిస్తారని తెలిపారు. సభలో ప్రసంగంతో పాటు లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ జరుగుతుందని పేర్కొన్నారు.

మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ చెక్కులు, సీఎం కప్ అవార్డుల ప్రదానం, గ్రామ పంచాయతీలకు ఐఎస్ఓ సర్టిఫికేషన్లు అందజేయనున్నట్లు వివరించారు. ఎండ తీవ్రత దృష్ట్యా తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, పారిశుధ్య ఏర్పాట్లు చేయాలని సూచించారు. పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సభలో ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటిడిఏ పీవో యువరాజ్ మర్మాట్, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ళ6:24 జూఎ, 3/4/2026ర ాతీఅఅఅఝం: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష తదితరులు పాల్గొన్నారు

## ఉద్యోగుల పెండింగ్ బకాయిలు విడుదలపై హర్షం.

## మైదుకూరు ఏపిఎన్జీఓ నాయకులు. చంద్ర మౌళి, రాఘవయ్య లు.




కడప మైదుకూరు యంపిడిఓ ఆవరణలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో అసోసియేషన్ మైదుకూరు తాలూకా అధ్యక్షుడు గజ్జల చంద్రమౌళి, సెక్రటరీ మాచనూరు రాఘవయ్య లు మాట్లాడుతూ, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మరియు జెఏసి చైర్మన్ శ్రీ.అలపర్తి విద్యాసాగర్ గారు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ.డి.వి. రమణ గారు కృషితో ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బకాయలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూ. 7,000 కోట్లకు పైగా బకాయిల విడుదలకు ఆమోదం తెలపడం ఉద్యోగులకు ఎంతో ఊరటనిచ్చే సానుకూల చర్య అని పేర్కొన్నారు. బకాయిలు విడతల వారీగా చెల్లిస్తున్నప్పటికీ, వాటి విడుదల వేగవంతం కావాలని ఉద్యోగులు ఆశిస్తున్నారని చెప్పారు. ఇటీవల ప్రభుత్వం ఉద్యోగులు మరియు పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ చెల్లింపుల కోసం మొత్తం రూ. 7,059 కోట్లు విడుదలకు ఆమోదం తెలిపిందని ఆయన వెల్లడించారు. ఈ మొత్తంలో:రూ. 1,847.83 కోట్లు, జనరల్ ప్రావిడెంట్ ఫండ్ రూ. 3,411.03 కోట్లు, గ్రాట్యుటీ బకాయిలురూ. 1,800 కోట్లు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌రూ. 223.47 కోట్లు, పోలీసు సిబ్బందికి అదనపు సరెండర్ లీవ్ చెల్లింపులుఉన్నాయని తెలిపారు. అలాగే, జి పి ఎఫ్ కింద రూ. 1,847.83 కోట్లు, అలాగే గ్రూప్ ఇన్సూరెన్స్ ఇప్పటికే విడుదల చేసినట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం, పెండింగ్ ఆర్థిక అంశాల పరిష్కారానికి ముందుకు రావడం అభినందనీయమని మైదుకూరు తాలూకా ఏపీయన్జీజీఓ అసోసియేషన్ అధ్యక్షుడు గజ్జల చంద్రమౌళి, సెక్రటరీ మాచనూరు రాఘవయ్య లు అన్నారు. ఈ పురోగతి ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నిరంతర కృషి మరియు రాష్ట్ర ప్రభుత్వ సానుకూల దృక్పథం ఫలితమని వారు పేర్కొన్నారు. ఉద్యోగుల హక్కులు మరియు సంక్షేమం కోసం అసోసియేషన్ ఎప్పటికీ కట్టుబడి పనిచేస్తుందని, అలాగే, పి.ఆర్.సి కమిటీ నియామకం, సరెండర్ లీవ్‌కు సంబంధించిన బిల్లులు సహా ఇతర పెండింగ్ బిల్లుల త్వరిత పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని వారు కోరారు. ఈ కార్యక్రమములో సెక్రటరీ మాచనూరు రాఘవయ్య, కోశాధికారి లక్కినేని బాబు ,ఉపాధ్యక్షులు రాజన్న , పెంచల్ రెడ్డి, గురు ప్రసాద్, పద్మావతి, సుజాత, మహిళా అధ్యక్షురాలు ఎలిషమ్మ,జాయిన్ సెక్రటరీ లు రామ గుప్తా, జనార్దన్ రావు, మరియు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఆర్ సి ఎం చర్చిలో గుడ్ ఫ్రైడే సంబరాలు



బ్రహ్మంగారిమఠం బి.మఠం మండల టౌన్ పరిధిలోని ఆర్.సి.యం చర్చి ప్రాంగణంలో శుక్రవారం గుడ్ ఫ్రైడే పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలు విచారణ గురువులు ఫాదర్ రవిచంద్ర పాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫాదర్ సునీల్, ఫాదర్ జయరాజు హాజరై ప్రార్థించారు. ఈ కార్యక్రమం సందర్భంగా విచారణ యువకులు నటించిన యేసు సిలువ మార్గం సన్నివేశం ఆకట్టుకుంది. అనంతరం అన్నదాన కార్యక్రమాలు, మజ్జిగ, చల్లటి పానీయాలు విశ్వాసులకు పంపిణీ చేశారు. ఆర్.సి.ఎం చర్చి లో భక్తి యుక్తంగా గుడ్ ఫ్రైడే కార్యక్రమం .

# కార్పొరేషన్లలో పెరుగుతున్న డివిజన్లు

విశాఖపట్టణం, ఏప్రిల్ 3, ఏపీలోని పలు కార్పొరేషన్లలో భారీగా వార్డులను పెంచుతూ కూటమి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో ఏపీలో అత్యధిక వార్డులు ఉన్న కార్పొరేషన్ గా మహా విశాఖ నగర పాలక సంస్థ జీవీఎంసీ నిలిచింది. అక్కడ 98 నుంచి ఏకంగా 120 దాకా వార్డులు పెరిగాయి. ఆ తరువాత స్థానంలో విజయవాడ కార్పొరేషన్ ఉండబోతోంది. ఇక్కద 64 వార్డులు ఉండేవి, వాటిని 86 వార్డులుగా పెంచారు. ఇక మూడవ స్థానంలో గుంటూరు కార్పోరేషన్ ఉంది. ఇక్కడ 57 వార్డులు ఉంటే దానికి 76 వార్డులుగా చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక ఏపీలో ఉన్న 13 కార్పొరేషన్లలో వరస ప్రకారం చూస్తే పెరిగిన వార్డుల వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరులో 54 వార్డులు ఉంటే అవి కాస్తా 72 వార్డులు అవుతున్నాయి. కర్నూల్ కార్పోరేషన్ కి 52 వార్డులు ఉంట్టే 68 వార్డులుగా పెరుగుతున్నాయి. తిరుపతికి 50 వార్డులు ఉంటే 66 వార్డులుగా మారుతున్నాయి. కడపకు 50 వార్డులు ఉంటే అవి 66కి చేరుకున్నాయి. ఏలూరుకి 50 వార్డులు ఉంటే 62 వార్డులుగా చేశారు. అనంతపురం కార్పోరేషన్ కి 50 వార్డులు ఉంటే 62గా చేశారు. ఒంగోలుకి 50 వార్డులు ఉంటే 62గా, విజయనగరంలో 50 వార్డులు ఉంటే 62గా చేశారు. చిత్తూరు కార్పోరేషన్ కి 50 వార్డులు ఉంటే 60గా మచిలీపట్నానికి 50 వార్డులు ఉంటే 60 గా పెంచారు. ఇలా చూసుకుంటే మొత్తం పెరిగిన వార్డులు రాష్ట్రవ్యాప్తంగా 197 గా ఉన్నాయి. దీంతో ఎంతో మంది ఆశావహులకు పోటీ చేసేందుకు అవకాశం లభిస్తోంది. కార్పోరేటర్ గా కీలకమైన పదవులలో వారు కూర్చునేందుకు మహత్తరమైన చాన్స్ గా ఇది ఉండబోతోంది. కేవలం కార్పోరేషన్లకే కాదు మునిసిపాలిటీలకు కూడా వార్డులను రాష్ట్రవ్యాప్తంగా పెంచుతున్నారు. దాంతో వందకు పైగా ఉన్న మునిసిపాలిటీలలో కూడా ఈ పెంపు వల్ల అంతకు నాలుగైదింతలు అవకాశాలు పెరుగుతాయని అంటున్నారు మొత్తం మీద చూస్తే కనుక ప్రస్తుతం పట్టణ స్థానిక సంస్థలలో ఇప్పటిదాకా ఉన్న ప్రజా ప్రతినిధులకు తోడుగా మరో ఇరవై నుంచి పాతిక శాతం అదనంగా చేరుతారు అని అంటున్నారు. కూటమిలో మూడు పార్టీలు ఉన్నాయి. ఎంతో మంది స్థానిక ఎన్నికల్లో పోటీకి తయారుగా ఉన్నారు. ఇపుడు వీరంతా పోటీకి బంగారు అవకాశం లభిస్తోంది. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల రాజకీయ ఆశావహులలో పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం అవుతోంది.

# చిత్తూరు-తచ్చూరు మధ్య గ్రీన్‌ఫీల్డ్ హైవే

తిరుపతి, ఏప్రిల్ 3 ఏపీలో ఆరు లైన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే రెడీ అయ్యింది.. ఈ మేరకు అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. చిత్తూరు నుంచి తమిళనాడులోని తచ్చూరు వరకు 116 కిలోమీటర్ల హైవే అందుబాటులోకి రానుంది. ఈ హైవే 116 కిలోమీటర్లలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే ఏకంగా 95 కిలోమీటర్లు ఉంది. ఈ హైవేను బెంగళూరు- చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవేకి అనుసంధానం చేశారు అధికారులు.ఆంధ్రప్రదేశ్‌లో మరో గ్రీన్‌ఫీల్డ్ హైవే అందుబాటులోకి రానుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరు నుంచి తమిళనాడును కనెక్ట్ చేసే.. చిత్తూరు-తచ్చూరు గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ట్రయల్ రన్ నిర్వహించారు. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఈ హైవేపైకి వాహనాలను అనునమతించారు. ఈ హైవేలో సుమారు 100 కి.మీ వేగంతో వెళితే దాదాపు గంటన్నరలోనే తమిళనాడుకు, పోర్టుకు చేరుకోవచ్చని అధికారులు అంచనా వేశారు. త్వరలోనే ఈ హైవేపైకి వాహనాలను పూరిస్థాయిలో అనుమతించనున్నారు.. టోల్ రుసుము వసూలు చేయనున్నారు. ఈ హైవే మొత్తం 116 కిలోమీటర్లు ఆరు లైన్లుగా ఉంటే.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే 95 కిలో మీటర్లు ఉంది.. మిగిలిన 21 కిలోమీటర్లు తమిళనాడులో ఉంది.చిత్తూరులోని మాపాక్షి దగ్గర ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రారంభమవుతుంది.. ఆ తర్వాత గంగాధర నెల్లూరు, ఎస్ఆర్‌పురం, నగరి మీదుగా కొనసాగుతుంది. అక్కడి నుంచి తమిళనాడులోని ఎంటరై ఊతుకోట్టై వరకు.. మళ్లీ అక్కడి నుంచి కట్టుపల్లి పోర్టు వరకు హైవే ఉంది. ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవేను కర్ణాటక నుంచి వచ్చే భారీ వాహనాలు తమిళనాడులోని పోర్టుకు చేరుకునేందుకు వీలుగా నిర్మించారు. ఈ హైవేలో ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు చిత్తూరు, గంగాధరనెల్లూరు, శ్రీరంగరాజపురం, నగరి దగ్గర మాత్రమే ఉంటాయి.నగరి, ఎస్ఆర్‌పురం, అనుపల్లె, అరతల, నరసింహాపురం, పల్లిపట్టు, ఊతుకోట, కుమారరాజపేట, వీరకావేరిరాజపురం, పొందవాక్కం దగ్గర ఇంటర్ చేంజ్‌లు ఉంటాయి. ఈ హైవే దాదాపుగా పనులన్నీ పూర్తి కావడంతో ట్రయల్ రన్ నిర్వహించారు. త్వరలోనే ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవేపైకి వాహనాలను అనుమతించనున్నారు. ఈ గచిత్తూరు- తచ్చూరు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనుల్ని 2022లో రూ.4వేల అంచనా వ్యయంతో నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవేను బెంగళూరు- చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవేకి కనెక్ట్ చేశారు. ఈ హైవేతో చెన్నై, బెంగళూరు వెళ్లేవారికి ఊరట దక్కింది.బెంగళూరు- చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే కూడా చిత్తూరు మీదుగా వెళుతోంది. ఇప్పటికే ఈ హైవేలో బెంగళూరు- వి.కోట మధ్య రాకపోకలకు అనుమతించారు. మొగిలి ఘాట్ దగ్గర పనులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. సెప్టెంబర్ లోపు ఆ పనులు పూర్తి చేయాలని భావిస్తున్నారు. చిత్తూరు జిల్లాలో ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు.. బైరెడ్డిపల్లె మండలం కమ్మనపల్లె, బంగారుపాళ్యం మండలం మొగిలి, గుడిపాల మండలం రామాపురం దగ్గర ఉన్నాయి.

# రాంగ్ ట్రాక్ లో తమ్ముళ్లు.. దారికి తెచ్చే పనిలో సీఎం

గుంటూరు, ఏప్రిల్ 3, ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఎమ్మెల్యేలు, అధికారుల మధ్య సమన్వయం కుదరడం లేదన్న విమర్శలు పెరిగిపోతున్నాయి. తాము చెప్పిన పనులు జరగడం లేదని, అధికారుల నుండి సరైన గౌరవం దక్కడం లేదని అధికార పార్టీ ఎమ్మెల్యేలు బహిరంగంగానే అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. తాజాగా పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఏకంగా పది గంటల పాటు ధర్నాకు దిగడం, గదిలో బంధించుకుని నిరసన తెలపడం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. తాము సిఫార్సు చేసిన వారికే పోస్టింగ్ ఇవ్వాలన్న పట్టుదల, అధికారులపై ఒత్తిడి తేవడం వంటి పరిణామాలు ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీస్తున్నాయని పార్టీ అధిష్టానం భావిస్తోంది.ఎమ్మెల్యేల ప్రవర్తనపై తీవ్ర అసంతృప్తితో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఈ ఉద్రేకాలకు అడ్డుకట్ట వేసేందుకు సరికొత్త వ్యూహాన్ని తెరపైకి తెచ్చారు.

ఎమ్మెల్యేలందరూ తమ భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవాలని, నిరంతరం ఒత్తిడికి గురవుతున్న వారు మెడిటేషన్ చేయాలని ఆయన సూచించారు. గతంలో కూడా చంద్రబాబు తన కేబినెట్ సహచరులకు, అధికారులకు ఈషా ఫౌండేషన్ వంటి ఆధ్యాత్మిక సంస్థల ద్వారా యోగా, ధ్యానం వంటి కార్యక్రమాలను నిర్వహించిన అనుభవం ఉంది. ఇప్పుడు మళ్ళీ అదే పద్ధతిలో ఎమ్మెల్యేల మనసులను ప్రశాంతం చేయాలని, వారు ప్రజల మధ్య సంయమనంతో ఉండేలా చేయాలని బాబు భావిస్తున్నారు.చాలామంది ఎమ్మెల్యేలు తాము గెలిచిన నియోజకవర్గాలకు మేమే కింగులం అనే భావనలో ఉండటం వల్లే ఇలాంటి ఘర్షణలు తలెత్తుతున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అధికారులపై హుకుం జారీ చేయడం, వారి గౌరవానికి భంగం కలిగించడం ద్వారా పనులు జరగవని, అది కేవలం అరాచకానికి దారితీస్తుందని చంద్రబాబు హెచ్చరిస్తున్నారు. పెన్షన్ల పంపిణీ వంటి సేవా కార్యక్రమాల్లో కూడా ఆయన ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. అధికారం అంటే బాధ్యత అని, అది అహంకారానికి వేదిక కాకూడదని హితవు పలికారు. ధ్యానం ద్వారా ఎమ్మెల్యేలలో ఉన్న ఆ అహంకారాన్ని తొలగించి, వారిని సేవా మార్గంలోకి మళ్లించడమే బాబు లక్ష్యంగా కనిపిస్తోంది.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం, పోలీస్ స్టేషన్లు, ఎస్పీ కార్యాలయాల ముందు ధర్నాలు చేయడం వంటి చర్యలు గత ప్రభుత్వం చేసిన తప్పులను గుర్తు చేస్తున్నాయని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే ఈసారి కేవలం హెచ్చరికలతోనే సరిపెట్టకుండా, ఎమ్మెల్యేల పనితీరుపై నిఘా పెట్టడమే కాకుండా వారికి మానసిక వికాస తరగతులు నిర్వహించాలని ఆలోచిస్తున్నారు. ఒకవేళ ధ్యానం, యోగా వంటి శిక్షణల తర్వాత కూడా ఎమ్మెల్యేల తీరు మారకపోతే, కఠిన చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడబోమని ఆయన స్పష్టమైన సంకేతాలు పంపారు.ప్రస్తుత రాజకీయాల్లో కేవలం గెలిస్తే సరిపోదు, ప్రజల ముందు ఎలా ప్రవర్తిస్తున్నామనేది కూడా ముఖ్యమని చంద్రబాబు నమ్ముతారు. రాబోయే రోజుల్లో ఎమ్మెల్యేలందరికీ ప్రొఫెషనల్ ట్రైనర్లతో వర్క్‌షాప్‌లు నిర్వహించే అవకాశం ఉంది. నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల కంటే కూడా నాయకుల ప్రవర్తనే ఎన్నికల్లో కీలకం కానుందని, అందుకే ఎమ్మెల్యేలు తమ బాడీ లాంగ్వేజ్ ను మార్చుకుని, అధికారులతో కలిసి పనిచేయాలని అధిష్టానం నిర్దేశించింది. ఈ మెడిటేషన్ మంత్రం ఎంతవరకు ఎమ్మెల్యేలలో మార్పు తెస్తుందో వేచి చూడాలి.

## నేరాల నియంత్రణ. ప్రజల్లో భద్రత భావాన్ని పెంచడమే లక్ష్యం

## కడప పోలీసుల గస్తీ

కడప నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా నైట్ పెట్రోలింగ్ ముమ్మరం చేశారు. అసాంఘిక కార్యకలాపాల కట్టడి, ప్రజల్లో భద్రత భావాన్ని పెంపోదించడం కోసం ప్రతీ రోజు నైట్ పెట్రోలింగ్ విధులు కొనసాగుతున్నాయి. లాక్డ్ హౌస్ ( తాళాలు వేసిన ఇళ్లు ) వద్ద దొంగతనాలు జరగకుండా ప్రత్యేకంగా నిఘా ఉంచారు. కింది స్థాయి సిబ్బంది నుండీ ఎస్సైలు, సి.ఐ లు, డీఎస్పీల దాకా రాత్రి వేళ మరింత అప్రమత్తత తో గస్తీ విధులు, పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. బీట్ తనిఖీ అధికారులు, సిబ్బంది వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి రవాణా వివరాలు, కొత్త వ్యక్తుల వివరాలు ఆరా తీసి అక్రమ రవాణాను అరికట్టే చర్యలు తీసుకుంటున్నారు. బీట్ తనిఖీ అధికారులు తరచూ బీట్ పాయింట్స్ తనిఖీ చేసి, సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ఎటువంటి నేరాలు జరగకుండా పకడ్బందీగా గస్తీ విధులు నిర్వర్తించేలా చేస్తున్నారు. లాడ్జి రూమ్స్ లో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. లాడ్జిలో ఉంటున్న వారి అధార్ కార్డు పరిశీలించి వారు వివరాలు సేకరించారు. లాడ్జిలో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.?? నైట్ పెట్రోలింగ్ ముమ్మరం చేసి అనుమానాస్పద/కొత్త వ్యక్తుల యొక్క వివరాలు ఆరా తీశారు. పాత నేరస్తులు, అనుమానితులు, చెడునడత కలిగిన వారి పై నిఘాను పెడుతున్నారు. మొబైల్ చెక్ డివైస్ ద్వారా అనుమానితులను చెక్ చేస్తున్నారు. దొంగతనాలు, చట్టవ్యతిరేక /అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచుతూ కట్టడి చేస్తున్నారు. దేవాలయాలు, ఎటిఎం కేంద్రాలు, ఇతర ముఖ్య వ్యాపార సముదాయాలు వద్ద అప్రమత్తంగా తిరుగుతూ అనుమానాస్పద వ్యక్తులను విచారించి తనిఖీ చేస్తున్నారు. రాత్రి పూట దొంగతనాలు, అల్లర్లు/గొడవలు జరగకుండా, కారణం లేకుండా రాత్రి వేళ తిరిగే ఆకతాయిల పై.... మద్యం సేవించి వాహనాలు నడిపే వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. తెల్లవారు జామున వెహికిల్ డ్రైవర్లకు స్టాప్ అండ్ వాష్ కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూస్తున్నారు

# తమ్ముళ్లలో అసంతృప్తి

నెల్లూరు, ఏప్రిల్ 3, కూటమి ప్రభుత్వం ఏర్పడి 21 నెలలు అయిపోతుంది. పవర్‌లోకి వచ్చాం సరే..పదవుల మాటేమిటని తెలుగు తమ్ముళ్లు ఎదురు చూస్తూనే ఉన్నారు. నామినేటెడ్ పోస్ట్ అయినా, పార్టీ పదవి అయినా..పార్టీ కోసం పనిచేసిన వారికే ఇవ్వాలంటున్నారు. అయితే ఎన్నికలకు ముందు..ఆ తర్వాత వైసీపీతో సహా వివిధ పార్టీల నుంచి వచ్చి టీడీపీలో చేరిన లీడర్లకు..పదవులు దక్కుతుండటం..తెలుగు తమ్ముళ్లకు ఏ మాత్రం మింగుడు పడటం లేదట. అసలే కూటమి పొత్తులో భాగంగా షేరింగ్‌లో పదవులు దక్కడం లేదన్న ఫీలింగ్‌లో ఉంటే..వలస నేతలను పెద్దపీట వేస్తుండటంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారట.తెలుగు భాషా పాఠాలుమరీ ముఖ్యంగా వైసీపీ లీడర్లకు పదవులు కట్టబెట్టడాన్ని ఏ మాత్రం జీర్ణించుకోలేక ..అధిష్టానంకు ఫిర్యాదులు చేస్తున్నారట. జంపింగ్‌లను నమ్మి పదవులు కట్టబెడితే పార్టీని ముంచేస్తారని చెబుతున్నారట. దీంతో పార్టీ, లోకల్‌గా నామినేటెడ్ పదవుల భర్తీలో టీడీపీ హైకమాండ్ ఒత్తిళ్లు ఫేస్ చేయాల్సి వస్తోందట. ఓవైపు సీనియర్లు..ఇంకోవైపు క్యాస్ట్ ఈక్వేషన్స్, మరోవైపు పార్టీ కోసం కష్టపడ్డోళ్లు, పార్టీని నమ్ముకుని వచ్చిన నేతలు ..ఇలా అందరికి పదవులు ఇవ్వడం ఇబ్బందిగానే ఉందట.టీడీపీ ఆవిర్భావ వేడుకల సందర్భంగా నిర్వహించిన సమావేశంలో..ద్వితీయ శ్రేణి నాయకుల్లో ఉన్న అసంతృప్తి బయటపడిందని అంటున్నారు. ఎన్నికల తర్వాత వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన వారికి కీలక పదవులు ఇవ్వడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారట సైకిల్ పార్టీ నేతలు. పార్టీలో సంస్థాగతంగా పదిహేను ఏళ్ల నుంచి సేవ చేస్తున్నామని..ఆస్తులను అమ్ముకుని కూడా పార్టీ కోసం ఖర్చు చేసిన నాయకులు ఉన్నారని, అలాంటి వారికి పదవులు ఇవ్వాలని సూచించారట. క్షేత్రస్థాయిలో పార్టీ జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులు వంటి పదవులను వైసీపీ నుంచి వచ్చిన కొందరికి ఎమ్మెల్యేలు సిఫారసు చేయటంపై అసంతృప్తి వ్యక్తం చేశారట. తమ ఎమోషన్స్‌కు విలువ ఇవ్వకుండా పదవులు ఇచ్చేస్తే ఎలా అని క్వశ్చన్ చేసినట్లు తెలుస్తోంది.ఒకటి రెండు చోట్ల నుంచి పార్టీకి ఫిర్యాదులు కూడా అందాయట. ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులకు పార్టీపై ప్రేమ ఉంటుందా? లేక పదవులపైనే ప్రేమ ఉంటుందో అధిష్టానం ఆలోచించుకోవాలని కూడా సూచనలు చేశారట. పార్టీని నమ్ముకుని పార్టీ కోసం త్యాగాలు చేసిన వారికి పదవులు ఇవ్వాల్సిన అవసరం ఉందని తేల్చి చెప్పారట. అయితే ఎమ్మెల్యేల సిఫారసులకే పార్టీ అధిష్టానం ప్రాధాన్యం ఇవ్వడంతో సమస్య వచ్చి పడిందంటున్నారు. ఈ క్రమంలోనే కొన్ని పొరపాట్లు జరిగాయని అటు చంద్రబాబు, ఇటు లోకేశ్ అలర్ట్ అయినట్లు టాక్ నడుస్తోంది.ఇక నుంచి అలా జరగదు. మాది భరోసా అంటూ లీడర్లకు భరోసా ఇచ్చారట చంద్రబాబు, లోకేశ్. పార్టీ కోసం పని చేసేవాళ్లకే పదవులు ఇస్తామని, పార్టీ బలోపేతానికి కృషి చేసిన వాళ్లకే ప్రజాప్రతినిధులుగా అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు టీడీపీ అధినేత. కార్యకర్తలను దూరం పెట్టే నేతలను తాను దూరం పెడతానని తేల్చి చెప్పడం వెనుక కారణం అదేనంటున్నారు. కష్టపడే కార్యకర్తలను, నేతలను గుర్తించే బాధ్యత లోకేశ్‌దేనని చెప్పారు. ఇక వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చే వలసదారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని లోకేశ్ హెచ్చరించడం కూడా ఇందులో భాగమేనంటున్నారు. క్యాడర్, లీడర్లే టీడీపీ భవిష్యత్ నాయకులన్న లోకేశ్..గ్రామ స్థాయి నాయకుడు బాగా పనిచేస్తే పొలిట్ బ్యూరోలో కూర్చోబెడుతామంటున్నారు. రాబోయే పొలిట్ బ్యూరోలో మీరు ఆ మార్పును చూడబోతున్నారని కూడా చెబుతున్నారు.మొత్తం మీద లీడర్ల నుంచి వచ్చిన సజెషన్స్‌ను విన్నాకే..వలస నేతలు..ఎస్పెషల్‌గా వైసీపీ నుంచి వచ్చిన లీడర్ల విషయంలో అలర్ట్‌గా ఉండాలని లోకేశ్ సూచించారని అంటున్నారు.

# పర్ఫెక్ట్ ప్లాన్ తో పవన్...



విజయవాడ, ఏప్రిల్ 3, ట్టడం ఆయన అభిమానులకు గర్వ కారణం. అయితే పవన్ కళ్యాణ్ కేవలం ఆ పదవి ని అలంకరణ కోసం వాడుకోకుండా, తానూ బాధ్యత చేపట్టిన శాఖలకు నూటికి నూరు శాతం న్యాయం చేస్తున్నాడు. ముఖ్యంగా ఆయన ఆద్వర్యం లో నడుస్తున్న పంచాయితీ రాజ్ శాఖ దేశం లోనే నెంబర్ 1 స్థానం లో నిల్చింది. వైసీపీ పార్టీ ప్రభుత్వ హయాం లో 24 వ స్థానం లో ఉన్న ఈ శాఖ, ఇప్పుడు మొదటి స్థానానికి చేరుకుందంటే పవన్ కళ్యాణ్ పని తీరు ఏ రేంజ్ లో ఉందో అర్థం చేసుకోవచ్చు. గ్రామా సభలు ఏర్పాటు చేసి, గ్రామాల్లోని ప్రజలు చేత వాళ్లకు అవసరమయ్యే పనులన్నీ కలెక్టర్ల దృష్టికి చేర్చి, పల్లె పండుగ పేరుతో రెండు విడతల్లో పవన్ కళ్యాణ్ ఈ స్థాయి ఫలితాలను అందుకున్నాడు.అభిమానులు ఎంతసేపు సినిమా ఫ్యాన్ వార్స్ లో దూరి రికార్డ్స్ కోసం కొట్లాడుకోవడం కాకుండా, ఇలాంటి విషయాలను జనాల్లోకి తీసుకెళ్తే నాయకుడిగా పవన్ కళ్యాణ్ ఇమేజ్ ఎక్కడికో వెళ్తుంది అంటూ సోషల్ మీడియా లో రాజకీయ విశ్లేషకులు కామెంట్స్ చేస్తున్నారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే కేంద్ర ప్రభుత్వం ఆద్వర్యం లో ప్రతీ ఏడాది దీనదయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సేతత్ వికాస్ జాతీయ సంస్థ గ్రామీణాభివృద్ధి, నీటి సంరక్షణ , పారిశుద్యం విభాగాల్లో పురస్కారాలను అందిస్తూ ఉంటుంది. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే పంచాయితీ రాజ్ శాఖ లో అవార్డులు అందుకుంది. ఇప్పుడు వరుసగా రెండవసారి కూడా అవార్డులను అందుకోవడం విశేషం. ఈ సంవత్సరం అయితే పంచాయితీ రాజ్ శాఖ ఏకంగా 5 విభాగాల్లో అత్యుత్తమ ర్యాంక్ అందుకుంది. గుడ్ గవర్నెన్స్ విభాగం లో శృంగవరం పంచాయత్ మొదటి స్థానం లో నిలబడింది.అదే విధంగా వుమెన్ ఫ్రెండ్లీ పంచాయత్ గా బొక్కాసం పాలెం అనే గ్రామం కూడా మొదటి స్థానం లో నిల్చింది. పేదరికం లేని గ్రామంగా, అత్యంత ప్రమాణాలతో జీవనం సాగుతున్న గ్రామం గా చెమ్ములపల్లి పంచాయత్ 2 వ స్థానం లో కొనసాగుతుండగా, సెల్ఫ్ సఫీషియంట్ఇన్ఫ్రా స్ట్రక్చర్ విభాగం లో గుండుమల పంచాయత్ 3వ ర్యాంక్ లో కొనసాగుతుంది. ఇక ఉత్తమ మండలం విభాగం లో అయితే కుప్పం దేశం లోనే 3 వ ర్యాంక్ సాధించింది. ఇలా పవన్ కళ్యాణ్ ఆద్వర్యం లో పంచాయితీ రాజ్ శాఖ ఎప్పుడూ చూడనంత అభివృద్ధిని చూస్తూ దేశంలోనే మన ఆంధ్ర ప్రదేశ్ ని ఆదర్శవంతమైన రాష్ట్రము గా తీర్చి దిద్దాడు పవన్ కళ్యాణ్.

# హిందుత్వ ముద్ర కోసం భూమన ఆరాటం

తిరుపతి, ఏప్రిల్ 3,ఆధ్యాత్మిక నగరి తిరుపతి రాజకీయాలు ఎప్పుడూ ఆసక్తికరంగానే ఉంటాయి. అయితే, గత కొంతకాలంగా వైసీపీ సీనియర్ నేత, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి చుట్టూ తిరుగుతున్న రాజకీయ పరిణామాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. తనపై ఉన్న 'హిందూ వ్యతిరేకి' ముద్రను చెరిపేసుకునేందుకు భూమన వేస్తున్న అడుగులు, తాజాగా జరిగిన ఒక ముస్లిం దంపతుల మత మార్పిడి ఉదంతం రాజకీయ వర్గాల్లో వేడి పుట్టిస్తోంది.తిరుపతికి చెందిన యాలమూరి శ్రీనివాస్‌రెడ్డి, పుష్ప దంపతులు ఉపాధి కోసం సుమారు 27 ఏళ్ల క్రితం సౌదీ అరేబియా వెళ్లారు. అక్కడ ఉన్న కాలంలో వారు ఇస్లాం మతాన్ని స్వీకరించి, తమ పేర్లను అబ్దుల్లా, అమీనాగా మార్చుకున్నారు. అన్ని అధికారిక పత్రాల్లోనూ అవే పేర్లతో కొనసాగారు. 2015లో భారతదేశానికి తిరిగి వచ్చిన వీరు తిరుపతిలోని పెద్దకాపు వీధిలో నివాసం ఉంటున్నారు.ఈ విషయం తెలుసుకున్న భూమన కరుణాకర్ రెడ్డి, స్వయంగా వారి ఇంటికి వెళ్లి పలుమార్లు చర్చలు జరిపారు. హిందూ ధర్మం విశిష్టతను వారికి వివరించి, తిరిగి స్వధర్మానికి రావాలని ప్రేరేపించారు. ఫలితంగా, భూమన నివాసంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆ దంపతులు తిరిగి హిందూ మతాన్ని స్వీకరించారు. అబ్దుల్లా మళ్ళీ శ్రీనివాస్‌రెడ్డిగా, అమీనా పుష్పగా తమ మూలాల్లోకి వచ్చారు.వైఎస్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన భూమనపై ప్రత్యర్థులు మొదటి నుంచీ ఒకే రకమైన దాడి చేస్తున్నారు. ఆయన నాస్తికుడని, దేవుడిని నమ్మరని, లోలోపల క్రైస్తవ మతాన్ని ప్రోత్సహిస్తారని రాజకీయ విమర్శలు నిత్యం వినిపిస్తుంటాయి. ముఖ్యంగా టీటీడీ చైర్మన్‌గా ఉన్న సమయంలోనూ ఆయనపై అనేక ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో, ఒక ముస్లిం జంటను హిందూ మతంలోకి తీసుకురావడం ద్వారా తనపై ఉన్న వ్యతిరేక ప్రచారానికి భూమన గట్టి కౌంటర్ ఇచ్చే ప్రయత్నం చేశారని విశ్లేషకులు భావిస్తున్నారు.భూమన కరుణాకర్ రెడ్డి టీటీడీ చైర్మన్‌గా ఉన్న సమయంలో ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. తిరుమల ఆస్థాన మండపంలో 90 మంది పీఠాధిపతులు, మఠాధిపతులతో నిర్వహించిన వేద విద్వత్ సదస్సులో ఒక తీర్మానం చేశారు. ఇతర మతాల నుంచి హిందూ మతంలోకి రావాలనుకునే వారికి తిరుమల శ్రీవారి సన్నిధినే వేదికగా చేయాలని, శ్రీవారే వారికి దిక్సూచి కావాలని ఆయన సంకల్పించారు. అయితే, ఈ లోపే ప్రభుత్వం మారిపోవడం, తదుపరి వచ్చిన కూటమి ప్రభుత్వం దీనిపై పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో ఆ పక్రియ ఆగిపోయింది. ఇప్పుడు వ్యక్తిగత స్థాయిలో ఆయన ఈ కార్యక్రమాలు చేపడుతున్నారు.ప్రస్తుతం తిరుమల లడ్డూ ప్రసాదం నెయ్యి కల్తీ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ వివాదంలో అప్పటి టీటీడీ బోర్డు పైనా, వైసీపీ ప్రభుత్వం పైనా హిందూ సమాజంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. సరిగ్గా ఇలాంటి క్లిష్ట సమయంలో భూమన ఇలాంటి మత పునఃస్వీకరణ కార్యక్రమాలు చేపట్టడం వెనుక రాజకీయ ప్రయోజనాలున్నాయని రాజకీయ పండితులు అభిప్రాయపడుతున్నారు.వైసీపీపై పడిన 'హిందూ వ్యతిరేక' ముద్రను తొలగించుకోవడానికి భూమన కరుణాకర్ రెడ్డి చేస్తున్న ఈ ప్రయత్నాలు క్షేత్రస్థాయిలో ఎంతవరకు ప్రభావం చూపుతాయన్నది ప్రశ్నార్థకమే. మత మార్పిడి చేసుకున్న దంపతులు భూమన కృషిని కొనియాడుతున్నప్పటికీ.. సాధారణ భక్తులు, రాజకీయ ప్రత్యర్థులు దీనిని కేవలం డ్యామేజ్ కంట్రోల్ చర్యగానే చూస్తున్నారు.

# అమరావతిలో లెక్క తప్పిన వైసీపీ

విజయవాడ, ఏప్రిల్ 2, ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుపై వారం రోజులుగా చర్చలు జరుగుతున్నాయి. దీనిపై కూటమి పార్టీలు చాలా దూకుడుగా రాజకీయంగా ఎత్తులు వేస్తూ గేమ్‌లో పైచేయి సాధించాయి. కానీ ఈ విషయంలో వైసీపీ మాత్రం మరోసారి సెల్ఫ్‌గోల్స్‌తో మరోసారి అబాసుపాలైంది. అమరావతి అనే ఎమోషన్‌ను క్యారీ చేయడంలో కూటమి పార్టీలు ముఖ్యంగా టీడీపీ విజయవంతం అయిందని చెప్పవచ్చు. ఈ విషయంలో విధానం అంటూ లేకుండా వైసీపీ తీవ్రంగా విమర్శలు పాలైంది. ఈ బిల్లు పార్లమెంట్‌లో చర్చకు వచ్చే సందర్భంలో కూడా తన వాదనను బలంగా చెప్పలేకపోయింది. అన్ని పార్టీలు ముక్తకంఠంతో అమరావతికి జై కొడితే ఒక్క వైసీపీ మాత్రమే తన స్టాండ్ ఏంటో చెప్పలేక చతికిలపడింది. అమరావతి చట్టబద్ధత బిల్లుపై రాజ్యసభలో చర్చ జరుగుతున్న టైంలో శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేదీ మాట్లాడుతూ, టీడీపీ లీడర్లంతా గ్యాలరీల్లో ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. మంత్రి నారా లోకేష్‌తోపాటు లోక్‌సభ ఎంపీలంతా కూడా అక్కడ కూర్చొని చర్చ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఇది చూడటానికి సాధారణ విషయమే కావచ్చు కానీ, ప్రియాంక చతుర్వేదీ మాట్లాడుతూ అమరావతిపై వారికి ఉన్న ఎమోషన్ ఎలాంటిదో అంటూ కితాబు ఇచ్చారు. దీని అక్కడ ఉన్న వారంతా చప్పట్లు కొడుతూ స్వాగతించారు. బిల్లు ఆమోదం పొందిన తర్వాత అందరూ లేచి సభకు నమస్కరించారు. హర్షధ్వానాలు చేశారు. అక్కడి వారంతా జై అమరావతి అంటూ నినాదాలు చేశారు. ఈ మొత్తం ఎపిసోడ్‌లో అమరావతి అనే ఎమోషన్‌ను పార్లమెంట్‌లో క్యారీ చేయడంలో కూటమి పార్టీలు, ముఖ్యంగా టీడీపీ విజయవంతం అయ్యింది. అందుకే అన్ని పార్టీలు బిల్లుకు మద్దతు ఇచ్చారు. ఎన్డీఏ, ఇండి కూటమి పార్టీలు అన్నీ జై అమరావతి అని నినదించాయి. ఇంతటి కీలకమైన ఘట్టంలో వైసీపీ పాత్ర లేకుండా పోయింది. దీనికి ఆ పార్టీ కన్ఫ్యూజన్ స్టాండే కారణం. సందర్భానుసారం స్టాండ్ మారుస్తూ అటు పార్టీ క్యాడర్‌ను, ఇటు ప్రజలను డైలమాలో పడేసింది. అసలు అమరావతిని వ్యతిరేకిస్తున్నారో చెప్పలేదు. సమర్థిన్నారో చెప్పడం లేదు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఎత్తున్న మూడు రాజధానులకు కట్టుబడి ఉన్నామనే విషయంపై కూడా క్లారిటీ ఇవ్వలేదు. ఇప్పుడు కొత్తగా మావిగన్ అంటూ సరికొత్త పల్లవి అందుకుంది. రోజుల వ్యవధిలోనే రకరకాల రంగులు మార్చి అటు సభల్లో ఇటు ప్రజల్లో చులకనైంది. తెలంగాణ ఏర్పాటుకు టీడీపీ వ్యతిరేకమా అనుకూలమా అంటే పార్టీ అధిష్ఠానం నాడు తక్కున సమాధానం చెప్పలేని పరిస్థితి. 2009లో తెలంగాణకు జై కొట్టిన తర్వాత మళ్లీ ప్లేట్ మార్చింది. ఇక్కడ ఆంధ్రప్రాంతంలో జై సమైక్యాంధ్ర నినాదం, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర కోవాలని కోరడం, చంద్రబాబు రెండు కళ్ల సిద్ధాంతం ఇలా భిన్నమైన స్టాండ్‌తో జనాలను కన్ఫ్యూజ్ చేసింది. అదే తర్వాత తెలంగాణ పార్టీ తుడిచిపెట్టుకుపోవడానికి ఒక కారణం అయ్యింది. అయితే చివరకు క్లైమాక్స్‌లో మాత్రం తెలంగాణకు అనుకూలంగా లెటర్ ఇచ్చి తెలంగాణకు జై కొట్టినా ప్రయోజనం లేకపోయింది. ఆ పార్టీపై ప్రజలకు అనుమానం అలానే ఉండిపోయింది. ఇప్పుడు వైసీపీ అదే స్థితిలో ఉంది. 2019కు ముందు అమరావతికి జగన్‌తోపాటు పార్టీ నేతలంతా జై కొట్టారు. అధికారంలోకి వస్తే టీడీపీ చేసిన దానికంటే ఎక్కువ చేస్తామనీ హామీలు ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ప్లేట్ ఫిరాయించింది. మూడు రాజధానులు అంటూ సరికొత్త మ్యూజిక్ స్టార్ట్ చేసింది. అంతే రాజధాని ప్రాంత రైతులంతా రోడ్లపైకి వచ్చారు. అధికారంలో ఉన్న వైసీపీ నాడు వారికి పోటీగా మూడు రాజధానులు కావాలనే వాదనలో అమరావతిలోనే ప్రత్యేక ధర్నా శిబిరాన్ని ఏర్పాటు చేసింది. కనీసం అక్కడి రైతులతో మాట్లాడి వారి సమస్యలేంటీ, మూడు రాజధానుల విధానం ఎందుకు ఎంచుకున్నామో అనే విషయాన్ని వివరించే ప్రయత్నం చేయలేదు. ఉక్కుపాదం మోపి ఉద్యాన్ని అణచివేయాలని చూశారు. వారిపై తీవ్రమైన విమర్శలు చేశారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారు. ఇలా చేసి వారిపై సానుభూతి వచ్చేలా చేశారు. అప్పటి వరకు రాజధాని రైతులు గురించి పెద్దగా పెట్టించుకోని వారంతా కూడా తెలుసుకోవడం మొదలు పెట్టారు. డబ్బులు తీసుకోకుండా ప్రభుత్వంపై నమ్మకం భూములు ఇచ్చిన రైతుల పట్ల ప్రభుత్వం ఇలా ప్రవర్తిస్తుందా అనేలా వైసీపీ చేసింది. దీంతో అప్పటి వరకు లేని ఒక ఎమోషన్ కనెక్షన్ వారితో ఏర్పడింది. వీటికి తోడు వైసీపీ ఎత్తుకున్న మూడు రాజధానులను ముందుకు తీసుకెళ్లేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వైజాగ్‌లో రుషి కొండను బద్దలు కొట్టి కట్టుకున్న ప్యాలెస్ కూడా నెగెటివ్ భావన వచ్చింది. 2024 ఎన్నికల్లో మూడు రాజధానులను ప్రజలు తిరస్కరించారనే విషయాన్ని కూడా వైసీపీ అంగీకరించడం లేదు. అలాగనే మూడు రాజధానులకు ఇప్పటికీ కట్టుబడే ఉన్నామని చెప్పడానికి కూడా ముందుకు రావడం లేదు. ఎన్నికల వరకు మూడు రాజధానులు అంటూ ప్రచారం చేసిన ఆ పార్టీ తర్వాత సైలెంట్ అయిపోయింది. అమరావతిలో అభివృద్ధి జరగడం లేదని సన్నాయి నొక్కులు నొక్కడం మొదలు పెట్టింది. ఇప్పుడు తేల్చుకోవాల్సిన వచ్చిన సందర్భంలో కూడా అసెంబ్లీకి వెళ్లకుండా, పార్లమెంట్‌లో వాదన గట్టిగా వినిపించకుండా తేలిపోయింది. అమరావతికి అనుకూలంగా ఉన్నామంటూనే బిల్లును వ్యతిరేకిస్తున్నామని అటూఇటూ కాని స్టేట్మెంట్‌తో అబాసుపాలైంది. లోక్‌సభలో, రాజ్యసభలో రెండింటిలో అన్ని పార్టీలు అమరావతి వర్థిల్లాలంటూ దీవిస్తుంటే వైసీపీ మాత్రం శాపనార్థాలు పెట్టి బయటకు వచ్చేసింది. అన్నింటికి తోడు జగన్ చేసిన మావిగన్ కూడా తీవ్ర విమర్శలకు ట్రోలింగ్‌కు గురైంది. చంద్రబాబు విమర్శించినట్టు అమరావతి అనడం కూడా జగన్‌కు ఇష్టం లేదని అందుకే పూటకో నినాదం చేస్తున్నారని అన్నట్టుగానే వారి తీరు ఉంది. ఇలా అడుగడుగునా తప్పుల మీద తప్పులు చేస్తూ అమరావతి ప్రాంతానికే కాకుండా ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలకు వైసీపీ దూరంగా జరిగిపోయింది. అందుకు భిన్నంగా టీడీపీ. అమరావతి రాగం ఎత్తుకున్నప్పటి నుంచి వారి పార్టీ లీడర్లంతా ఒకటే మాటపై ఉన్నారు. జగన్ మూడు రాజధానుల ఎత్తుగడను కూడా లెక్క చేయకుండా అన్ని ప్రాంతాల్లో ఒకే నినాదం ఉండేలా చూసుకున్నారు. ప్రభుత్వంపై నమ్మకంతో రాజధానికి పైస ఆశించకుండా రైతులు భూములు ఇచ్చిన విషయాన్ని ప్రపంచం దృష్టికి తీసుకెళ్లారు. తాత్కాలికంగా అని చెప్పి కొన్ని బిల్డింగ్స్ ఏర్పాటు చేశారు. దీనికి తోడు టీడీపీ నేతలు ఎవరూ ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకోవడానికి ప్రయత్నించ లేదు. విజిటింగ్ లీడర్స్ అంటూ విమర్శలు ఎదురైనా వాటిని తట్టుకొని నిలబడ్డారు. అక్కడ వైజాగ్‌లో జగన్ తన కోసం ప్యాలెస్ రెడీ చేసుకోవడం, ఇక్కడ చంద్రబాబు తనకంటూ ఇంటిని నిర్మించుకోకపోవడం కూడా కలిసి వచ్చింది. సంక్షోభంలోనే అవకాశాలు వెతుక్కునే చంద్రబాబు అమరావతి రైతుల ఉద్యమం, నాటి ప్రభుత్వం వారిని చిత్రవధ చేసిన పరిణామాలను తనకు రాజధానికి అనుకూలంగా ప్రజలను ఏకం చేయడానికి చేసుకున్నారు. అమరావతి రైతులను టీడీపీ వదిలేస్తుందని ప్రచారం చేసిన వైసీపీ అక్కడి రైతులను పట్టించుకోకుండా తప్పుల మీద తప్పులు చేసింది. రైతులను పట్టించుకోదని విమర్శలు ఎదుర్కొన్న టీడీపీ మాత్రం వారిని నమ్ముకొని, ఉద్యమాలు చేసి సెంటిమెంట్‌ను రాజేసి రాష్ట్ర ప్రజలందరితో జై అమరావతి అనేలా చేసింది. రాష్ట్ర ప్రజలతోనే యావత్ దేశ ప్రజలతో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి మాత్రమే అని నినదించేలా చేసింది. అమరావతి నినాదాన్ని పట్టుకొని టీడీపీ వంద మెట్లు పైకి ఎగబాగితే, పూటకో నినాదంతో వైసీపీ మరింత కిందికి జారిపోయింది.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి




కరీంనగర్ – పెద్దపల్లి బైపాస్ బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని కారు వేగంగా వెనుకనుంచి ఢీకొట్టింది. ఘటనలో కారులో వున్న ఇద్దరు మృతి చెందారు. ఒకరి పరిస్థితి విషమంగా వుంది. మరోక వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో కారులో నలుగురు ప్రయాణికులు వున్నారు. గాయాపడిని వారిని పోలీసులు ఆసుపత్రికి తరలించారు.

## జాతీయ స్థాయిలో వైసీపీ ఏకాకి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3, (న్యూస్ పల్స్) ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్ట సవరణ బిల్లు-2026 పార్లమెంటులో ఆమోదం పొందడం జగన్ మోహన్ రెడ్డి ఐదేళ్ల రాజకీయ వ్యూహానికి తగిలిన కోలుకోలేని దెబ్బ. దేశంలోని ప్రధాన రాజకీయ పక్షాలన్నీ అమరావతికి మద్దతుగా నిలిచాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం ఒంటరిగా మిగిలిపోయింది. జాతీయ స్థాయిలో ఆ పార్టీకి కనీసం గళం కలిపే మిత్రులు లేకపోవడం జగన్ రాజకీయ పరపతి ఏ స్థాయిలో పడిపోయిందో స్పష్టం చేస్తోంది. గతంలో ఢిల్లీ వేదికగా జగన్ నిర్వహించిన ధర్నాలకు తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ వంటివి సంఘీభావం తెలిపాయి. కానీ అమరావతి బిల్లు విషయంలో అవే పార్టీలు వైసీపీకి కనీస మద్దతు కూడా ప్రకటించలేదు. రాజ్యసభలో కీలక బిల్లుల సమయంలో బీజేపీకి అండగా నిలిచిన జగన్, అవసరమైనప్పుడు ఇండియా కూటమి నేతలను సంప్రదించడంలో విఫలమయ్యారు. ఈ ద్వంద్వ వైఖరి వల్ల జాతీయ నేతలు జగన్ రెడ్డిని నమ్మకూడదని నిర్ణయించుకున్నారు. ఫలితంగా పార్లమెంటులో వైసీపీ వాదన వినిపించడానికి ఒక్కరు కూడా ముందుకు రాలేదు. మూడు రాజధానుల నినాదంతో ఐదేళ్ల పాటు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని అడ్డుకున్నారన్న ఆరోపణలు ఇప్పుడు పార్లమెంటు సాక్షిగా బలపడ్డాయి. అమరావతికి చట్టబద్ధత కల్పించడం ద్వారా జగన్ ప్రతిపాదించిన మూడు రాజధానుల సిద్ధాంతాన్ని దేశవ్యాప్త పార్టీలు ఏకగ్రీవంగా తిరస్కరించినట్లయింది. వైసీపీ ఎంపీలు సభలో నిలబడి తమ వాదన వినిపించే ధైర్యం చేయలేకపోయారు. చర్చ నుంచి వాకౌట్ చేసి పారిపోవడం జగన్ పంతానికి ఎదురైన పరాజయంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాజకీయాల్లో విశ్వసనీయత చాలా ముఖ్యం. కాంగ్రెస్ నుండి బయటకు వచ్చిన తర్వాత జగన్ తన అవసరాలకు తగ్గట్టుగా అటు బీజేపీకి, ఇటు విపక్షాలకు చేరువయ్యే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఏ పక్షానికీ ఆయన పూర్తిస్థాయి మిత్రుడు కాలేకపోయారు. అమరావతి బిల్లు రూపంలో ఒక స్పష్టమైన వైఖరి తీసుకోవాల్సిన సమయం వచ్చేసరికి ఏ ఒక్క పార్టీ కూడా వైసీపీ పక్షాన నిలబడలేదు. ఒకప్పుడు చక్రం తిప్పాలని భావించిన నేతకు ఇప్పుడు ఢిల్లీలో కనీసం మాట వినే నాథుడు లేని స్థితి రావడం ఆశ్చర్యకరం. అమరావతి బిల్లు ఆమోదం పొందడం ద్వారా జగన్ ఐదేళ్ల పాలన, ఆయన రాజకీయ చాణక్యం రెండూ విఫలమయ్యాయని తేలిపోయింది. ఇది కేవలం రాజధాని అంశం మాత్రమే కాదు, భవిష్యత్తులో వైసీపీ జాతీయ రాజకీయాల్లో ఎదుర్కోబోయే గడ్డు పరిస్థితులకు ముందస్తు హెచ్చరిక. రాష్ట్రంలో అధికారం కోల్పోయి, కేంద్రంలో మిత్రులు లేక వైసీపీ ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. సొంత పార్టీ నేతలు సైతం జాతీయ స్థాయిలో ఎదురైన ఈ అవమానాన్ని చూసి నిర్వేదంలో మునిగిపోయారు. ఇతర రాష్ట్రాల ఎంపీలు సైతం ఏపీకి ఒకే రాజధాని ఉండాలని, అమరావతికి న్యాయం జరగాలని కోరడం జగన్ రెడ్డికి వ్యక్తిగతంగా పెద్ద ఎదురుదెబ్బ. ప్రజల మనోభావాలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుంటే జాతీయ స్థాయిలో కూడా మద్దతు లభించదని ఈ పరిణామం రుజువు చేసింది. ఐదేళ్ల పాటు సాగించిన వింత ప్రయోగాలు ఏపీ ప్రతిష్ఠను దిగజార్చడమే కాకుండా, వైసీపీని రాజకీయంగా ఏకాకిని చేశాయి.

## మిత్రపక్షంపై ఎమ్మెల్యే విసుర్లు

కొత్తగూడెం సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మిత్రపక్షం కాంగ్రెస్ ప్రభుత్వం పై మండిపడ్డారు. వీళ్ళ పరిపాలన చూస్తుంటే బీపీ లేస్తుందని అన్నారు. 'వీళ్ల పరిపాలన.. వీళ్లు పాడుగాను. బీపీ లేస్తుంది. తిట్టలేక ఈ మాట అంటున్నా' అంటూ ఎమ్మెల్యే కూనంనేని ఆగ్రహం వ్యక్తం చేసారు. 'తెలివి ఉండాలి, పట్టుదల ఉండాలి. దీక్ష ఉండాలి. వీళ్లకు అది లేదు' అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. కొత్తగూడెం బస్టాండ్లో జరిగిన ప్రజాపాలన- ప్రగతి నివేదిక 99 రోజులు కార్యక్రమంలో హాజరై కాంగ్రెస్ ప్రభుత్వంపై కూనంనేని విమర్శలు సంధించారు.

## హర్మ్మజ్‌ను తెరవడానికి 35 దేశాలు ప్రయత్నాలు..

### భారత్‌కు ఆహ్వానంపై స్పందించిన కేంద్రం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3, (న్యూస్ పల్స్) ఇరాన్‌తో తాము చేస్తున్న యుద్ధానికి మద్దతు ఇవ్వడం లేదని నాటో సహా మిత్ర దేశాలపై అమెరికా అధినేత డొనాల్డ్ ట్రంప్ కాలుగాలిన పిల్లిలా చిందులు వేస్తున్నారు. నాటో నుంచి అమెరికా వైదొలగుతుందని ఆయన బెదిరింపులకు దిగారు. బ్రిటన్ మాత్రం ఈ యుద్ధంతో తమకు ఎలాంటి సంబంధం లేదని ఖరాఖండిగా చెప్పింది. అవసరమైతే హర్మ్మజ్ తెరవడానికి దౌత్య మార్గాల్లో ప్రయత్నిస్తామని ప్రకటన చేసింది. దీంతో 35 దేశాలతో సమావేశం నిర్వహిస్తుండగా.. దీనికి భారత్‌ను ఆహ్వానించింది. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా దాదాపు మూసివేసిన హర్మ్మజ్ జల సంధిని తెరిపించడానికి యూకే నాయకత్వంలోని 35 దేశాలు ఏర్పాటుచేసిన సమావేశానికి భారత్‌కు ఆహ్వానం అందినట్టు కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది. ఆ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మీడియాతో మాట్లాడుతూ.. గురువారం జరగబోయే సమావేశంలో భారత్ తరఫున విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ వర్చువల్‌గా హాజరవుతారని ఆయన తెలిపారు. ' హర్మ్మజ్ జల సంధి అంశంపై చర్చించేందుకు ఏర్పాటుచేసిన సమావేశానికి భారత్ సహా పలు దేశాలను యూకే ఆహ్వానించింది.. భారత తరఫున విదేశాంగ కార్యదర్శి హాజరవుతారు' అని జైస్వాల్ తెలిపారు. చమురు, ఎల్పీజీ, ఎల్ఎన్జీ సహా ఇంధనం మోసుకొచ్చే నౌకల సురక్షిత ప్రయాణం కోసం ఇరాన్, ఇతర దేశాలతో మేము సంప్రదింపులు జరుపుతున్నాం.. గత కొన్ని రోజులుగా జరిపిన చర్చల ఫలితంగా భారత్‌కు చెందిన ఆరు ట్యాంకర్లు హర్మ్మజ్‌ను సురక్షితంగా దాటాయి.. నిరంతరం సంబంధిత పార్టీలతో సంప్రదింపులు కొనసాగిస్తున్నాం" అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి వెల్లడించారు. ప్రపంచ ఇంధన సరఫరాకు హర్మ్మజ్ అత్యంత కీలకమైంది. దీని ద్వారానే ప్రపంచ ఐదో వంతు ఇంధనం సరఫరా అవుతుండగా.. భారత్ దిగుమతి చేసుకునే చమురులో 40 శాతం, ఎల్ఎన్జీలో 50 శాతం, ఎల్పీజీలో 80 శాతం హర్మ్మజ్ నుంచే వస్తుంది. ఈ జలసంధిని తిరిగి తెరవడం తన కీలక ప్రాధాన్యతలలో ఒకటని చెబుతూ వచ్చిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం మాట మార్చారు. యూకేతో సహా అమెరికా మిత్రదేశాలను వారి చమురును వారే సమకూర్చుకోవాలని కోరారు. ఇకపై అమెరికా వారికి సహాయం చేయదని ఆయన నొక్కి చెప్పారు. అమెరికాకు అండగా నిలవని దేశాలకు.. తాము కూడా సహాయం చేయబోమని పేర్కొన్నారు. యూకే వంటి దేశాలకు రెండే మార్గాలున్నాయని ఒకటి ఇంధనం పుష్కలంగా ఉన్న తమ నుంచి ఆయిల్ కొనాలని.. రెండు ధైర్యం ఉంటే హర్మ్మజ్ దగ్గరకు వెళ్లి తెచ్చుకోవాలని బెదిరింపులకు దిగారు.

## మళ్లీ 3వ వారంలో పార్లమెంట్ సెషన్స్...

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3, (న్యూస్ పల్స్) కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ల అమలును వేగవంతం చేసేందుకు ఏప్రిల్ 16 నుంచి 18 వరకు మూడు రోజుల పాటు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించింది. 2023లో ఆమోదం పొందిన ఈ చట్టం.. కొత్త జనగణన, నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే అమల్లోకి వస్తుందని గతంలో పేర్కొన్నారు. అయితే, తాజా సవరణల ద్వారా ఈ నిబంధనలను సడలించి, 2029 సార్వత్రిక ఎన్నికల నాటికే 33 శాతం మహిళా కోటాను అమలు చేయాలన్నది ప్రభుత్వ ప్రధాన వ్యూహం. ఈ ప్రత్యేక సెషన్‌లో ప్రవేశపెట్టబోయే ప్రతిపాదనల్లో అత్యంత కీలకమైనది లోక్‌సభ స్థానాల పెంపు .

ప్రస్తుతం ఉన్న 543 స్థానాలను 816కు పెంచాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీనివల్ల పెరిగిన స్థానాల్లో సుమారు 273 సీట్లను మొత్తం స్థానాల్లో మూడో వంతు మహిళలకు కేటాయించే అవకాశం ఉంటుంది. ఇలా చేయడం వల్ల ప్రస్తుతం ఉన్న పురుష ఎంపీల ప్రాతినిధ్యానికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా, అదనపు స్థానాల ద్వారా మహిళా రిజర్వేషన్లను అమలు చేయవచ్చని కేంద్రం భావిస్తోంది. ఇదే తరహా మార్పులను రాష్ట్ర అసెంబ్లీల్లో కూడా ప్రవేశపెట్టనున్నారు. అమలు ప్రక్రియలో ఉన్న ప్రధాన అడ్డంకిని తొలగించేందుకు ప్రభుత్వం ఒక వినూత్న మార్గాన్ని ఎంచుకుంది. కొత్త జనగణన కోసం వేచి చూడకుండా, 2011 జనాభా లెక్కల ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు వీలుగా డీలిమిటేషన్ చట్టాన్ని సవరించనున్నారు. దీనివల్ల జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాల సీట్ల సంఖ్య తగ్గకుండా, అన్ని రాష్ట్రాల్లోనూ దాదాపు 50 శాతం మేర సీట్లు పెరిగేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందుకోసం ఒక రాజ్యాంగ సవరణ బిల్లుతో పాటు సాధారణ బిల్లును కూడా సభలో ప్రవేశపెట్టనున్నారు. ప్రతిపక్షాల నుంచి వస్తున్న విమర్శలు, సందేహాలను నివృత్తి చేసేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇప్పటికే పలువురు విపక్ష నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ప్రభుత్వం ఈ హడావుడి చేస్తోందని కాంగ్రెస్ వంటి పార్టీలు విమర్శిస్తున్నప్పటికీ, మహిళా సాధికారత విషయంలో వెనక్కి తగ్గకూడదని కేంద్రం గట్టి పట్టుదలతో ఉంది. ఈ ప్రత్యేక సమావేశాలు విజయవంతమైతే, భారత పార్లమెంట్ చరిత్రలో మహిళల ప్రాతినిధ్యం అత్యున్నత స్థాయికి చేరుకోవడం ఖాయం.

## గచ్చిబౌలి పబ్ లలో ఈగల్ టీం తనిఖీలు



హైదరాబాద్ గచ్చిబౌలి పోలిస్ స్టేషన్ పరిధిలో పబ్ లలో ఈగల్ టిం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కోండాపుర్ లోని క్వాక్ ఎరినా పబ్ లో తనిఖీలు నిర్వహించారు. గురువారం రాత్రి సౌత్ ఆఫ్రికా కు చెందిన ప్రముఖ డీజే బ్లాక్ కాఫీ పేరిట పబ్ నిర్వాహకులు భారీ ఈవెంట్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఈగల్ టీమ్ తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 8 మందికి డ్రగ్స్ పాజిటివ్ గా గుర్తించారు. డ్రగ్స్ పాజిటివ్ వచ్చినవారికి గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ కి తరలించారు. గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# మైనార్టీలే గెలుపు డిసైడ్...

తిరువనంతపురం, ఏప్రిల్ 3, (న్యూస్ పల్స్) కేరళ జనాభాలో ముస్లింలు సుమారు 26 శాతం, క్రైస్తవులు సుమారు 18 శాతం... కలిపి దాదాపు 45 శాతం పైగా ఉన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు తరచుగా హిందూ-ముస్లిం ధ్రువీకరణ చుట్టూ తిరుగుతుంటే, కేరళలో మాత్రం ఈ రెండు మైనారిటీ వర్గాల మొగ్గు ఎటువైపు ఉంటే ఆ కూటమి అధికార పీఠాన్ని అధిరోహిస్తుంది. దశాబ్దాలుగా యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ కు ఈ వర్గాలే కొండంత అండగా ఉంటూ వస్తున్నాయి. ముఖ్యంగా ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ వంటి పార్టీలు కాంగ్రెస్ కూటమిలో ఉండటం వల్ల ముస్లిం ఓట్లు గంపగుత్తగా యూడీఎఫ్‌కే పడేవి. ఉత్తర కేరళలోని మలప్పురం , వయనాడ్ జిల్లాలు మైనారిటీ రాజకీయాలకు కేంద్రబిందువులు. మలప్పురంలో ముస్లిం జనాభా అధికంగా ఉండటంతో ఇక్కడ ముస్లిం లీగ్ తిరుగులేని శక్తిగా ఎదిగింది. అలాగే వయనాడ్ వంటి చోట్ల ముస్లిం, క్రైస్తవ ఓటర్ల కలయిక అభ్యర్థుల గెలుపోటములను శాసిస్తుంది. ఈ జిల్లాల్లో మెజారిటీ స్థానాలను సాధించకుండా ఏ కూటమి కూడా తిరువనంతపురంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడం అసాధ్యం. గత ఎన్నికల్లో రాహుల్ గాంధీ వయనాడ్ నుండి పోటీ చేయడం కూడా ఈ మైనారిటీ సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని చేసిన వ్యూహమే. ప్రస్తుతం ప్రియాంకాగాంధీ వయనాడ్ ఎంపీగా ఉన్నారు. గతంలో మైనారిటీ ఓట్లు కేవలం కాంగ్రెస్ సొత్తని భావించేవారు, కానీ ఇటీవలి కాలంలో ఎల్డీఎఫ్ ఈ కోటలోకి చొచ్చుకెళ్లింది. మతతత్వ శక్తులను అడ్డుకోగల ఏకైక శక్తి కమ్యూనిస్టులేననే ప్రచారంతో ముస్లిం యువతను ఎల్డీఎఫ్ ఆకట్టుకుంది. అలాగే కేరళ కాంగ్రెస్ ఎం వంటి క్రైస్తవ ప్రాధాన్యత గల పార్టీని తమ కూటమిలోకి చేర్చుకోవడం ద్వారా మధ్య కేరళలోని క్రైస్తవ ఓటు బ్యాంకులో ఎల్డీఎఫ్ పట్టు సాధించింది. 2021లో ఎల్డీఎఫ్ వరుసగా రెండోసారి గెలవడానికి ఈ మైనారిటీ ఓట్ల చీలిక , మళ్లింపు ప్రధాన కారణం. ఒకప్పుడు కాంగ్రెస్‌కు వెన్నెముకలా ఉన్న క్రైస్తవ ఓటర్లలో ఇప్పుడు స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. చర్చిల్లో ఉన్న వివిధ వర్గాల మధ్య ఉన్న అంతర్గత సమస్యలు వారి ఓటింగ్ సరళిని ప్రభావితం చేస్తున్నాయి. జేకోబైట్ చర్చి వంటి వర్గాలు ఎల్డీఎఫ్‌కు మద్దతు తెలపడం యూడీఎఫ్‌కు గట్టి దెబ్బ. అదే సమయంలో, బీజేపీ కూడా క్రైస్తవ నాయకులతో మంతనాలు జరుపుతూ వారిని తమ వైపు తిప్పుకోవడానికి మైనారిటీల మధ్య అసమానతలు వంటి అంశాలను వాడుకుంటోంది. కేరళలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, మైనారిటీల ప్రయోజనాలను విస్మరించడం సాధ్యం కాదు. విద్యా సంస్థలు, మతపరమైన హక్కులు , సంక్షేమ పథకాల కేటాయింపులో ఈ వర్గాలకు ఇచ్చే ప్రాధాన్యతపైనే ఆయా పార్టీల మనుగడ ఆధారపడి ఉంటుంది. ముస్లిం లీగ్ వంటి పార్టీలు యూడీఎఫ్‌లో కింగ్ మేకర్లుగా వ్యవహరిస్తుంటే, ఎల్డీఎఫ్ తనదైన సోషల్ ఇంజనీరింగ్ ద్వారా మైనారిటీ మద్దతును కూడగడుతోంది. కేరళలో మైనారిటీ ఓటు అనేది కేవలం ఒక సంఖ్య కాదు, అది ఆ రాష్ట్ర రాజకీయ సుస్థిరతను నిర్దేశించే ఒక బలమైన శక్తి. రాబోయే ఎన్నికల్లో కూడా మలప్పురం నుండి కొట్టాయం వరకు ఈ వర్గాల మనసు గెలుచుకున్న వారే కేరళ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టిస్తారు.

# కాంగ్రెస్ లో గొంతు లేస్తోంది...

హైదరాబాద్, ఏప్రిల్ 3, కాంగ్రెస్ పార్టీ అంటే సాధారణంగా ఒక అభిప్రాయం అందరికీ ఉంది. అదే అపరిమితమైన స్వేచ్ఛ ఆ పార్టీలో ఉంటుంది. ఎవరైనా తమ సొంత అభిప్రాయాలను ఏ వేదిక మీద అయినా హాయిగా చెప్పవచ్చు. అది కాంగ్రెస్ పార్టీలో ప్లస్ అదే మైనస్ కూడా. అంతర్గత ప్రజాస్వామ్యంలో కాంగ్రెస్ ని మించిన పార్టీ వేరొకటి లేదు. అయితే అసంతృప్తులు అయినా అయినా పార్టీ వేదికల మీద నాలుగు గోడల మధ్యన చెబితేనే బాగుంటుంది. కానీ బాహాటం అయితే పార్టీ ప్రభుత్వం రెండూ ఇబ్బందుల్లో పడతాయని అంటున్నారు. ఈసారి బడ్జెట్ సెషన్ లో కాంగ్రెస్ కి కొంత ఇరకాటం ఏర్పడే విధంగా సన్నివేశాలు కనిపించాయి. అసెంబ్లీలో నల్గొండ జిల్లా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అయితే ఏకంగా ప్రభుత్వం మీద విమర్శలు చేశారు. ఖమ్మం జిల్లాతో పాటు సీఎం సొంత నియోజకవర్గంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు మాత్రమే బిల్లులు చెల్లిస్తున్నారని అదే ఇతర ప్రాంతాలలో కాంట్రాక్టర్లకు పెండింగులో పెడుతున్నారని వాపోయారు. అంతే కాదు ఎమ్మెల్యేలు గెలవకపోతే సీఎం కానీ మంత్రులు కానీ ఎక్కడ అని లాజిక్ పాయింట్ లేవదీశారు. అంతటితో ఊరుకోలేదు, తన నియోజకవర్గాలలో అభివృద్ధి పనులు సాగడం లేదని అచ్చం విపక్షం గొంతుకతో విమర్శలు చేశారు. ఎమ్మెల్యేలకు నియోజకవర్గం నిధులు ఇవ్వకపోతే ఎలా అని ఆయన ప్రశ్నించారు.

ఒక విధంగా కోమటిరెడ్డి మాటలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పూర్తిగా డిఫెన్స్ లో పడేశాయని అంటున్నారు ఇక శాసనమండలిలో చూస్తే ఎమ్మెల్సీ విజయశాంతి కాంగ్రెస్ ప్రభుత్వం మీద తనదైన శైలిలో విమర్శలు చేశారు. ఉద్యమ కారులకు ప్రభుత్వం చేసిన న్యాయం ఏమిటని సూటిగా ప్రశ్నించారు. వారికి ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చామని రెండేళ్ళు అవుతున్నా ఇంకా వాటిని నెరవేర్చలేదని ఆమె విమర్శించారు. ఉద్యమంలో అమరులైన కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని చెప్పారని అలాగే ఉద్యమ కారులకు నెలకు పాతిక వేల రూపాయల గౌరవ భృతి ఇస్తామని హామీ ఇచ్చారని ఆమె గుర్తు చేశారు. ఉద్యమకారులు లేకపోతే సీఎం అయినా మంత్రులు అయినా ఉండేవారా అని ఆమె నిలదీసినంత పని చేశారు. ఈ విధంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇద్దరూ తమ సొంత ప్రభుత్వం మీద విమర్శలు గుప్పించడంతో కొంత ఇబ్బందికరమైన పరిస్థితిలో ప్రభుత్వం పడింది అని అంటున్నారు. జీవన్ రెడ్డితో మొదలు : ఇక సీనియర్ మోస్ట్ కాంగ్రెస్ లీడర్ మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్ మీద తీవ్ర విమర్శలు చేసి పార్టీ వదిలి వెళ్లారు. పార్టీలో ఉంటూ ఈ ఇద్దరూ ఒకింత అసంతృప్తితోనే ప్రభుత్వం మీద విమర్శలు చేశారు అని అంటున్నారు.

ఇంకా చాలా మంది తమలోపల అసంతృప్తిని దాచుకున్నారు అని అంటున్నారు. ఇప్పటిదాకా ఒక ఎత్తు ఇక మీదట మరో ఎత్తు అన్నట్లుగానే ఈ పరిస్థితి కాంగ్రెస్ లో ఉందని అంటున్నారు. అయితే ఈ అసంతృప్తిని తగ్గించే ప్రయత్నం చేయాలి. అలాగే బహిరంగ విమర్శలు చేయకుండా చూసుకోవాలి. ఇప్పటి నుంచే డ్యామేజ్ కంట్రోల్ చేసుకోకపోతే విపక్షాలకు ఇది ఆయుధంగా మారుతుందని గతానుభవాలను చూసిన వారు కాంగ్రెస్ లో పెద్దలుగా ఉన్న వారు హితైషులు చెబుతున్నారు

# టార్గెట్ హరీష్ రావు...



హైదరాబాద్, ఏప్రిల్ 3, తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు మాజీ మంత్రి హరీష్ రావు చుట్టూ తిరుగుతున్నాయి. నిన్నటి వరకు కేటీఆర్, కవితలపైనే విమర్శనాస్త్రాలు సంధించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు తన రూటు మార్చి హరీష్ రావును టార్గెట్ చేయడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా హరీష్ రావుపై భూకబ్జా ఆరోపణలు చేయడం, వ్యక్తిగత విమర్శలకు దిగడం వెనుక పెద్ద రాజకీయ వ్యూహమే ఉందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రేవంత్ రెడ్డి నేరుగా పేరు ఎత్తకపోయినా, హరీష్ రావును ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా కలకలం రేపాయి. ముఖ్యంగా కన్న తండ్రిని పట్టించుకోని వారు.. ప్రజలను ఏం పట్టించుకుంటారు అనే అర్థం వచ్చేలా రేవంత్ చేసిన ఆరోపణలు హరీష్ రావును తీవ్రంగా ఇబ్బంది పెట్టేవిగా ఉన్నాయి. రాజకీయాల్లో ట్రబుల్ షూటర్‌గా పేరున్న హరీష్ రావుపై ఇలాంటి వ్యక్తిగత , అవినీతి ఆరోపణలు రావడం ఆయన ఇమేజ్‌కు పెద్ద సవాల్‌గా మారింది. ప్రభుత్వం ఇప్పటికే హరీష్ అనుచరులు, ఆయనకు సంబంధించిన భూ వ్యవహారాలపై విచారణకు ఆదేశించడం ఆయనను మరింత ఒత్తిడిలోకి నెట్టింది. ఈ పరిణామాల మధ్య కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు కొత్త ట్విస్ట్‌ను ఇచ్చాయి. రేవంత్ రెడ్డి కావాలనే హరీష్ రావును ఒంటరిని చేస్తున్నారని, కేటీఆర్ మరియు కవితలతో రేవంత్ కున్న రహస్య ఒప్పందంలో భాగంగానే ఈ వ్యూహం నడుస్తోందని సంజయ్ ఆరోపించారు. అంటే, బీఆర్ఎస్ పార్టీని హరీష్ రావు చేతుల్లోకి వెళ్లకుండా అడ్డుకోవడానికి, కల్వకుంట్ల కుటుంబంలోని అంతర్గత విభేదాలను రేవంత్ తనకు అనుకూలంగా మార్చుకుంటున్నారన్నది బీజేపీ వాదన. ఈ ఆరోపణల్లో నిజమెంత ఉన్నా, రేవంత్ రెడ్డి ఒక్కసారిగా హరీష్ పై పడటం వెనుక బీఆర్ఎస్ కేడర్‌ను గందరగోళానికి గురిచేసే ప్లాన్ స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుతానికి పరిస్థితులు హరీష్ రావుకు వ్యతిరేకంగా మారుతున్నట్లు కనిపిస్తున్నాయి. అటు ప్రభుత్వపరంగా విచారణలు, ఇటు రాజకీయంగా సొంత పార్టీలోనే ప్రాధాన్యత తగ్గిపోతోందన్న ప్రచారం ఆయనను ఆత్మరక్షణలో పడేశాయి. కేటీఆర్ అమెరికా పర్యటనలో ఉన్న సమయంలోనే హరీష్ రావుపై ఈ స్థాయిలో దాడులు జరగడం యాదృచ్ఛికం కాదని రాజకీయ పండితులు భావిస్తున్నారు. హరీష్ రావుకు ఉన్న మాస్ ఇమేజ్‌ను దెబ్బతీయడం ద్వారా బీఆర్ఎస్‌ను బలహీనపరచవచ్చని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఎన్నికల సమయంలో లేదా పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు సంక్షోభాలను చక్కదిద్దే హరీష్ రావు, ఇప్పుడు తన సొంత రాజకీయ ఉనికిని కాపాడుకోవాల్సిన పరిస్థితి ఎదురైంది. రేవంత్ రెడ్డి విసురుతున్న సవాళ్లను ఆయన ఎలా ఎదుర్కొంటారన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే హరీష్ రావు తనపై వస్తున్న ఆరోపణలను ఖండిస్తూ, ప్రభుత్వం వద్ద ఆధారాలు ఉంటే బయటపెట్టాలని సవాల్ విసిరారు. కానీ, అటు కాంగ్రెస్ ప్రభుత్వం, ఇటు బీజేపీ నేతల విమర్శల మధ్య ఆయన తన పట్టును ఎలా నిలుపుకుంటారో చూడాలి. రేవంత్ రెడ్డి వర్సెస్ హరీష్ రావు పోరు రాబోయే రోజుల్లో మరింత ముదిరే అవకాశం ఉంది. ఒకవైపు ప్రజా సమస్యలపై పోరాడుతూనే, మరోవైపు తనపై వస్తున్న అవినీతి మరకలను తొలగించుకోవాల్సిన బాధ్యత హరీష్ పై ఉంది. రేవంత్ రెడ్డి చేస్తున్న ఈ మైండ్ గేమ్ ‘ బీఆర్ఎస్‌లో చీలిక తెస్తుందా లేక హరీష్ రావును మరింత బలమైన నేతగా మారుస్తుందా అనేది కాలమే నిర్ణయించాలి.

## దక్షిణ కోస్తా రైల్వే జోన్లోకి కొత్తగా ఏడు రైల్వేస్టేషన్లు

విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటైన దక్షిణ కోస్తా రైల్వే జోన్కు తూర్పు కోస్తా రైల్వే జోన్లోని ఖుర్దా డివిజన్ పరిధిలోని 7 రైల్వేస్టేషన్లను కలిపారు. ఇచ్ఛాపురం నుంచి పలాస వరకు ఉన్న 7 రైల్వేస్టేషన్లను దక్షిణ కోస్తా రైల్వే జోన్లోకి బదిలీచేస్తూ రైల్వే బోర్డు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు 7 రైల్వేస్టేషన్లను దక్షిణ కోస్తా రైల్వే జోన్లోకి మారుస్తూ విడుదల చేసిన రైల్వే శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

# హైదరాబాద్ కు మరో డాల్బీ థియేటర్

హైదరాబాద్, ఏప్రిల్ 3, రెండు వారాల కిందట హైదరాబాద్‌లో ప్రారంభమైన అల్లు సినిమాస్ డాల్బీ థియేటర్ ఇప్పుడు నగరానికే ఓ స్పెషల్ అట్రాక్షన్. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఫ్యామిలీ పేరుతో దేశంలోనే అతిపెద్ద డాల్బీ స్క్రీన్‌ను హైదరాబాద్‌కు తీసుకొచ్చింది. ఇప్పుడు సూపర్ స్టార్ మహేష్ బాబు కూడా హైదరాబాద్‌కు మరో డాల్బీ థియేటర్‌ను తీసుకురాబోతున్నారు. మహేష్‌కు థియేటర్లు కొత్తకాదు.. ఆయన చాలా ఏళ్లుగా ఈ బిజినెస్‌లోనే ఉన్నారు. ఇప్పుడు మహేష్ కూడా హైదరాబాద్‌కు డాల్బీ తెస్తున్నారు. సూపర్ స్టార్ మహేష్‌బాబు చాలా ఏళ్ల కిందటి నుంచి వివిధ రకాల బిజినెస్‌లలో ఉన్నారు. అందులో ముఖ్యమైంది మూవీస్. ప్రముఖ ఎగ్జిబిటర్, డిస్ట్రిబ్యూటర్ ఆసియన్ సునీల్ భాగస్వామ్యంతో మహేశ్‌బాబు ఎఎంబీ సినిమాస్‌ను ప్రారంభించారు. ఈ బ్యానర్ కింద వివిధ నగరాల్లో మల్టిప్లెక్స్‌లు ఉన్నాయి. అల్లు సినిమాస్ ఈ మధ్యన హైదరాబాద్‌లో డాల్బీ థియేటర్‌ను ప్రారంభించింది కానీ.. అసలు సౌత్ ఇండియాలో మొట్టమొదటి డాల్బీ థియేటర్‌ను ఇంట్రడ్యూస్ చేసింది మహేష్ బాబే. ఈ జనవరి 16న బెంగళూరులోని లో సౌత్ ఇండియాలోనే మొట్టమొదటి డాల్బీ థియేటర్‌ను మహేష్ ప్రారంభించారు. 9 స్క్రీన్‌లు ఉన్న ఆ మల్టిప్లెక్స్‌లో 588 సీట్లు ఉన్న పెద్ద థియేటర్‌ను డాల్బీగా మార్చారు. ఇప్పుడు అదే క్రమంలో హైదరాబాద్‌కు ఆయన డాల్బీ థియేటర్‌ను తెస్తున్నారు.

హైదరాబాద్ సినిమా కూడలి అయిన ఆర్టీసీ క్రాస్ రోడ్స్ ని సుదర్శన్ థియేటర్‌ను మహేష్‌బాబు భాగస్వామ్యంలో ఆసియన్ సంస్థ ఏఎంబీ క్లాసిక్ పేరుతో మల్టిప్లెక్స్‌గా మారుస్తోంది. పాత థియేటర్ స్థానంలో మొత్తం 7 స్క్రీన్ల మల్టిప్లెక్స్ అక్కడ వస్తోంది. ఇప్పుడు అందులో ఓ ఆడిటోరియంను డాల్బీ థియేటర్‌గా మారుస్తున్నారు. 4ఐ లేజర్ ప్రొజెక్షన్‌తో డాల్బీ విజన్ స్క్రీన్ అందుబాటులోకి వస్తోంది. ఇప్పటికే కోకాపేటలో దేశంలోనే అతిపెద్ద డాల్బీ స్క్రీన్ అందుబాటులోకి వచ్చింది. ఇది వెస్ట్ హైదరాబాద్‌లో ఉంటే.. మహేష్ డాల్బీ థియేటర్ హైదరాబాద్ నడిబొడ్డున రానుంది. పైగా క్రాస్‌రోడ్ అంటే సినిమా జంక్షన్. సో నగరవాసులకు అందుబాటులోకి స్క్రీన్ వస్తోంది. ఈ ఏడాది చివరి నాటికి క్లాసిక్ డాల్బీ రెడీ కానుంది. మహేష్‌బాబు సినిమానే కాదు... హైదరాబాద్‌లో అతి తొందరలోనే మరో డాల్బీ సినిమా అందు?టులోకి వస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీస్ జీడిమెట్ల రంగా థియేటర్‌ను తీసుకుని దానిని పూర్తిగా ఆధునీకరిస్తోంది. ఈ థియటర్‌కూడా డాల్బీ విజన్ స్క్రీన్‌తో సిద్ధమవుతున్నట్లు సమాచారం. అది ఈ ఏడాది జూన్ నాటికే రెడీ అవుతుందంట.. అయితే ఇక హైదారబాద్ వాసులకు పండుగే. ఈ ఏడాది చివరినాటికి మొత్తం మూడు డాల్బీ థియేటర్లు హైదరాబాద్‌లో అందుబాటులో ఉంటాయి. అలాగే నగరంలోని పెద్ద స్క్రీన్, థియేటర్ అయిన ప్రసాద్స్ కూడా ఆధునీకరించారు. లేటెస్ట్.. ప్రొజెక్షన్ అందుబాటులోకి తెచ్చారు. ఇక హైదరాబాద్‌కు ఉన్న లోటు స్క్రీన్. ఒకప్పుడు ప్రసాద్స్‌లో ఉన్న ఐ మ్యాక్స్ సేవలు నిలిచిపోవడంతో ఆ లోటు అలాగే మిగిలిపోయింది. ఇప్పుడు మన సినిమాలు భారీ విజువల్ ఎఫెక్ట్స్‌తో వస్తున్నాయి. భారీ స్క్రీన్‌లపై వాటిని అనుభూతి చెందితే ఆ థ్రిల్లే వేరు. వారణాసి, రామయణ్ లాంటి ఇండియన్‌మూవీస్‌ను ఇప్పుడు ఐమాక్స్ ఫార్మాట్‌లో చిత్రీకరించారు. మరికొన్ని భారీ సినిమాలు కూడా వస్తాయి. అయితే హైదరాబాద్‌లో స్క్రీన్ కూడా మహేష్‌బాబునే తీసుకొచ్చే అవకాశం ఉంది. ఆసియన్ భాగస్వామ్యంతో హకీంపేట్ వద్ద భారీ థియేటర్‌ను నిర్మిస్తున్నారు. ఇందులో ఓ స్క్రీన్ ఐమాక్స్ అవుతుందనే ప్రచారం జరుగుతోంది కానీ.. దానిని వాళ్లు అధికారికంగా ధృవీకరించలేదు.

# మీ సేవ కేంద్రాల ఛార్జీల విషయంలో కీలక మార్పులు

హైదరాబాద్, ఏప్రిల్ 3, తెలంగాణ రాష్ట్రంలో పౌర సేవలను డిజిటల్ రూపంలో ప్రజలకు చేరవేసే మీ సేవ కేంద్రాల ఛార్జీల విషయంలో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. 15 ఏళ్లుగా ఉన్న పెంపు డిమాండ్‌ను ఇన్ని రోజులు నెరవేర్చారు. ఇప్పుడు పెరిగిన ఛార్జీల ప్రకారం ఏయే సర్టిఫికెట్లకు ఎంత వసూలు చేస్తారో చూద్దాం. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు ఉత్తర్వుల మేరకు, బుధవారం నుంచి అన్ని రకాల పౌరసేవలపై వినియోగ ఛార్జీలు పెరిగాయి.

గతంలో కేవలం వినియోగ ఛార్జీలు మాత్రమే ఉండగా, ఇప్పుడు ప్రభుత్వం వీటికి 18 శాతం జీఎస్టీని అదనంగా చేర్చింది. మీ సేవలో అందించే సేవలను ప్రధానంగా రెండు కేటగిరీలుగా విభజిస్తారు. కేటగిరి ఏలో ఉండే డాక్యుమెంట్ స్కాన్ లేదా సంబంధిత విభాగాల విచారణ అవసరం లేని సేవలు ఉంటాయి. గతంలో దీనికి 35 రూపాయలు వసూలు చేసే వారు. ఇప్పుడు దీన్ని 62 రూపాయలకు పెంచారు. కేటగిరి బీలో వివిధ శాఖల విచారణ లేదా పరిశీలన తర్వాత అందించే సేవలు వస్తాయి.

ఈ కేటగిరి కింద అందించే సేవలకు 45 రూపాయలు తీసుకునే వాళ్లు. ఇప్పుడు దాన్ని 80 రూపాయలకు పెంచారు. వాస్తవానికి ప్రభుత్వం ప్రకటించిన పెంపు 50శాతమే అయినప్పటికీ జీఎస్టీని కూడా పరిగణలోకి తీసుకుంటే ఈ భారం 77 శాతం నుంచి 78 వరకు పెరుగుతుంది. ఈ ధరల పెంపు ముఖ్యంగా సర్టిఫికెట్లు కోసం మీ సేవ కేంద్రాలకు వెళ్లే వారిపై ప్రభావం చూపనుంది. ఇప్పటి వరకు కుల ధ్రువీకరణ పత్రం తీసుకునే వారు కేవలం 45 రూపాయలు చెల్లిస్తే సరిపోతుంది. ఇప్పుడు ఆ సర్టిఫికెట్ కోసం 80 రూపాయలు చెల్లించాలి. గతంలో దరఖాస్తుతోపాటు నాలుగు కంటే ఎక్కువ పేజీలు స్కాన్ చేయాల్సి వస్తే పేజీకి రెండు రూపాయలు వసూలు చేసే వాళ్లు ఇప్పుడు అది 2.50కు పెంచారు. ప్రజలపై భారం వేసిన ప్రభుత్వం మీ సేవ కేంద్రాల నిర్వాహకులకు ఊరట కల్పించింది. వారి కమిషన్లు పెంచింది. కేటగిరి ఏలో సేవలకు గతంలో 13 రూపాయల కమిషన్ ఉండేది. దీన్ని ఇప్పుడు 40.34 రూపాయలకు పెంచారు.

కేటగిరి బీ సేవలకు 52.10 రూపాయాల కమిషన్ ఇస్తారు.

ఎక్కువ తీసుకుంటే ఎవరికి ఫిర్యాదు చేయాలి?

ప్రభుత్వం నిర్ణయించిన ఈ కొత్త ధరల కంటే మీ సేవ కేంద్రాల నిర్వాహకులు అదనంగా వసూలు చేయడానికి లేదు. అలా ఎవరైనా వసూళ్లకు పాల్పడిదే 1100 లేదా 18004251110 నెంబర్లకు ఫోన్ చేయవచ్చు లేదా. ఎవవబవలజీబబీజూజూనీతీబిఏబివశ్రీజీనిణజీనిజీ. ణనీల.తినికు మెయిల్ చేయవచ్చు.

# అడ్డూ, అదుపు లేకుండా ఫీజులు నిద్రౌతున్న విద్యాశాఖ

నల్గొండవరంగల్, ఏప్రిల్ 3, జూన్ లో కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఫీజులు ఎలా ఉంటాయన్న ఆందోళన విద్యార్థుల తల్లిదండ్రుల్లో మొదలైంది. ఇప్పటికే ప్రయివేటు, కార్పొరేట్ స్కూల్స్ ఫీజులు పెంచుతున్న సంకేతాలు యాజమాన్యాల నుంచి తల్లిదండ్రులకు అందాయి. పరిస్థితులు ఎలా ఉన్నా యాజమాన్యాలు ఏడాది కోసారి 20 నుంచి 30 శాతం ఫీజులు పెంచేస్తున్నాయి. నియంత్రించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఫీజుల భారం లేకుండా చేస్తామని గత సర్కార్ కమిటీల పేరిట సాగదీసింది. పస్తుత ప్రభుత్వం గద్దెనెక్కి రెండేం డ్లు దాటినా ఫీజుల దోపిడీని అరికట్టలేకపోయింది. ఇది వచ్చే విద్యాసంవత్సరానికైనా అమల్లోకి వస్తుందా అన్నది సంశయంగానే ఉంది. దీనిపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. రాష్ట్రంలో విద్యా సంవత్సరం అంటే ఫీజుల దోపిడీ అన్నట్టుగా మారింది. ఇంజనీరింగ్ విద్యకు అత్యధిక వార్షిక ట్యూషన్ ఫీజు రూ.1.83 లక్షలు. అదే పాఠశాల విషయానికి వస్తే కార్పొరేట్ స్కూళ్లలో రూ.5 లక్షలు! పటాన్చెరు ప్రాంతానికి చెందిన ఓ పాఠ శాల కొద్దిరోజుల క్రితం పాఠ్యపుస్తకాల ధరలను రూ.18 వేలకు పెంచింది. అలాగే పేరొందిన ప్రముఖ విద్యా సంస్థలు ఆరో తరగతి ఫీజును అమాంతం 30 వేల రూపాయలు అదనంగా పెంచాయి! దీన్ని సాకుగా చూపెడుతూ కొన్ని యాజమాన్యాలు మా దగ్గర ఫీజు తక్కువగా ఉంది. బయట చూడండి మీకే తెలుస్తుంది అంటూ ఏదో తక్కువ చేస్తున్నట్టు నటి స్తూ అందినకాడికి దండుకుంటున్నాయి. ఇలాగైతే సామా న్యుల పిల్లలకు విద్య అందేనా? ఈ దోపిడీకి కళ్లెమెప్పుడు? ఈ ప్రశ్నే తల్లిదండ్రుల గుండెలో ఇప్పుడు ఒక ఆందోళనగా ఉంటోంది. ఇంత బహిరంగంగా ఫీజుల్ని పెంచుతుంటే, ప్రభుత్వ పెద్దల కట్టడి చేసే చర్యలు మాటలకే పరిమితం కావడం శోచనీయం. ప్రభుత్వం ఏడాది క్రితమే ఫీజుల నియంత్రణకు చట్టం తెచ్చేందుకు బిల్లు నమూనా సిద్ధమైనప్పటికీ, దాని పై ఇంకా స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో అనేక అంశాలపై బిల్లులు ఆమోదం పొంది నా ఫీజుల బిల్లును మాత్రం ఆమోదానికి పెట్ట లేదు. దీని వెనుక అంతర్య మేంటి? వ్యక్తిగత అంశాలపై సవాల్ విసురు కునేందుకు సమయం కేటాయించిన అధికార, ప్రధాన ప్రతిపక్షసభ్యులు లక్షల మందికి ఉపయోగపడే బిల్లు గురించి ఎందుకు మాట్లాడలేదు? కావాలనే పక్కన పడేశారా అన చర్చ ఇప్పుడు నడుస్తోంది. దీనికి జవాబు పాలకులే చెప్పాలి. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం పాఠశాలల ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని 2022 జనవరి 17న జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆనాటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కానీ, ఆచరణలో అడుగు కూడా ముందుకు పడలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రస్తుత సర్కార్ రుసుములను కట్టడి వేసేందుకు కమిటీని ఏర్పాటు చేస్తామని 2024 సెప్టెంబర్లో ప్రకటించింది. రాష్ట్ర విద్యాకమిషన్ కూడా దీనికోసం చట్టం తీసుకురా వాలని స్పష్టంగా సిఫార్సు చేసింది. అయినప్పటికీ అమల్లోకి రాకపోవడం ప్రభుత్వ చిత్తశుద్ధిపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఒకవైపు విద్య వంటి ప్రాథమిక హక్కు విషయంలో ఇలా ఆలస్యం చేయడం అనేక అనార్థాలకు దారితీస్తుందని మేధావులు, విద్యావేత్తల అభిప్రాయం. ఇంకోవైపు, అందరికీ అందుబా టులో నాణ్యమైన విద్య అనే నినాదం ప్రజలను ఆకర్షించేలా ఉన్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు దానికి విరుద్ధంగా కనిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి స్థాయిలో విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నామనే ప్రకటనలు వినిపిస్తున్నాయి. యంగ్ ఇండియా వంటి పేర్లతో కొత్త ప్రభుత్వ పాఠశాలల ప్రచారం జరగడం ఒకవైపు ఆశాజనకంగా కనిపించినా, టెక్నో, గ్లోబల్, ఒలింపియాడ్ వంటి పేర్లతో ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులతో దోచుకుంటున్నాయి. ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తూ ఫీజులు పెంచుకునేందుకు పాలకవర్గాలే అవకాశం కల్పిస్తున్నాయి. కొన్ని పాఠశాలలు అదనపు ఫీజులు, ప్రత్యేక కార్యక్రమాల పేరుతో మరింత భారాన్ని మోపుతు న్నాయి. దీనివల్ల మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. విద్యను వ్యాపారంగా మార్చే ధోరణి పెరుగు తున్నప్పుడు, ప్రభుత్వ నియంత్రణ ఉండాలి. కానీ, లేకపోవడం బాధాకరం. విద్య అనేది లాభాపేక్షతో నడిచే రంగం కాకూడదు. అది సమాజ అభివృద్ధికి పునాది. అందరికీ సమాన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత. దీన్ని నిర్వర్తించడంలో ఆలస్యం చేయడమంటే భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టినట్టే. ఇలాంటి పరిస్థితుల్లో మాటలు కాకుండా చర్యలు అవసరం. ఇప్పటికైనా ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలి. ఆ చట్టంలో ప్రతి పాఠశాల ఫీజుల నిర్మాణం పారదర్శ కంగా ఉండేలా నిబంధనలు పెట్టాలి. నియంత్రణ సంస్థను ఏర్పాటు చేసి, ఫీజుల పెంపుపై పర్యవేక్షణ చేయాలి.

## పేర్ని నానిపై కేసు నమోదు

మచిలీపట్నం మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని వెంకట్రామయ్య (నాని)పై కేసు నమోదు అయింది. పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న పోలీసు అధికారుల సంఘం ఫిర్యాదు మేరకు, పేర్ని నానిపై కృష్ణా జిల్లా చిలకలపూడి పీఎస్లో కేసు నమోదు చేసారు. గురువారం మచిలీపట్నంలో అక్రమ నిర్మాణం కూల్చివేత ఘటనలో పోలీసులపై పేర్ని నాని అనుచిత వ్యాఖ్యలు చేసారని కేసు నమోదు చేసారు. చిలకలపూడి సీఐ పరమేశ్వరరావు, పోలీసులను పేర్ని నాని బెదరించారని కేసు నమోదు.

# కబ్జా కోరల్లో చెరువులు

వరంగల్, ఏప్రిల్ 3, చినుకు పోనుకోకపోతే గత ఏడాది వర్షాకా లంలో పద్ద తిప్పలు మళ్ళీ పడాల్సిన పరిస్థితి ఎదురవక తప్పదు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వందలాది చెరువులు, కుంటలు, నాళాలు కబ్జా కోరల్లో చిక్కిపోయాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాలుగు వేలకు పైగా చెరువులు, కుంటలు ఉండగా అందు లో వెయ్యికి పైగా చెరువులు, కుంటలు అధిక విస్తీర్ణంలో కబ్జాలకు గురైనట్లు ఆరోపణలు వస్తున్నాయి.పట్టణాల్లో ఉన్న చెరువులను ఆక్రమించిన కొందరు అందులో అక్రమ నిర్మాణాలు చేపట్టడం, గ్రామస్థాయిలో ఉన్న చెరువులు, కుంటలు ఆక్రమించిన వారు అందులో వ్యవసాయం చేయడం వల్ల చెరువులు, కుంటలు నీటి నిలువ సామర్థ్యం తగ్గిపోయి రోజు రోజుకు కుంచించుచకుపోతున్నానే విమర్శలు వస్తున్నాయి. అలాగే వరద (నాళాలు) కాలువలను ఆక్రమించడం వల్ల వర్షం నీరు కుంటలు, చెరువుల్లోకి చేరే పరిస్థితి లేకుండా పోయిందనే విమర్శలు వస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రధాన చెరువులుగా గుర్తించిన వాటిని సైతం ఆక్రమిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.చెరువులు, కుంటల బఫర్ జోన్, ఫుల్ ట్యాంక్ లెవెల్ (ఎఫ్ టి ఎల్) పరిధిలను దాటేసి కూడా కొందరు చెరువుల్లోకి చొరబడి చెరువులను చెరబడుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వంలోని వివిధ శాఖల పరిధిలో ఉన్న చెరువులు, కుంటలకు నిర్ణీత దూరంలో బఫర్ జోన్, ఎఫ్ టీ ఎల్ ఉండాల్సి ఉండగా, ఎక్కడ కూడా అటువంటి పరిస్థితి లేదనే విమర్శలు వస్తున్నాయి. కుంటలు, చెరువుల ఆక్రమణ రోజురోజుకు పెరిగిపోయి పట్టణాలు, పల్లెలో వర్షాకాలం వరదల ముంపు తీవ్రత పెరగడానికి కారణంగా మారిందని ఆరోపిస్తున్నారు.గత ఏడాది అక్టోబర్ లో కురిసిన భారీ వర్షాలకు త్రీ నగరి గా పేరుగాంచిన వరంగల్ రోడ్లన్నీ నదులుగా మారడం, ఎక్కడి నీరు అక్కడే తిష్ట వేసి అనేక కాలనీలు రోజుల తరబడి జలదిగ్బంధంలో చిక్కుకొని భారీగా ఆస్తులు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైళ్ల రాకపోకల తో పాటు, రోడ్డు రవాణా కూడా పూర్తిగా స్తంభించిపోయింది. అయినప్పటికీ ఇప్పటివరకు అధికార వర్గాలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చెరువులు, కుంటలు, నాళాలు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకోకపోవడం, దీనికి తోడు ఆక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించడం, ఆక్రమించిన చెరువులు, కుంటలు, నాళాల్లో నిర్మించిన అక్రమ నిర్మాణాలకు రోడ్లు, విద్యుత్తు, డ్రైనేజీ సౌకర్యం కల్పించడం విమర్శలకు తావిస్తోంది.దీనివల్ల చెరువులు, కుంటలు, నాళాల విస్తీర్ణం రోజురోజుకు కూచించుకుపోయి, భవిష్యత్తులో చెరువులు, కుంటలు, నాళాలు పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడనుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులు, కుంటలు ఆక్రమించడం వల్ల వర్షాకాలంలో వరద నీరు చెరువుల్లోకి వెళ్లకుండా, దిగువకు వెళ్ళిపోయి భూగర్భ నీటిమట్టం స్థాయి తగ్గుతుందనే విమర్శలు వస్తున్నాయి.హైదరాబాద్ మహానగరంలో చెరువులు, కుంటలు, నాళాల ఆక్రమణలను తొలగించడానికి 'హైడ్రా' ఏర్పాటుచేసిన విధంగా ప్రతి జిల్లాలో కూడా చెరువులు, కుంటలు, నాళా లు, ఇతర అక్రమ నిర్మాణాలను కట్టడి చేయడానికి ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయాలనిప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే చెరువులు, కుంటలు, నాళాలు ఆక్రమించిన వారిని తొలగించాలని, భవిష్యత్తులో మళ్లీ ఆక్రమణ లు జరగకుండా పటిష్టమైన కార్యాచరణ చేపట్టి చెరువులు, కుంటలు, నాళాల రక్షణకు ప్రభుత్వం కృషి చేయాలి.చెరువులు, కుంటలు, నాళాల ఆక్రమణ వల్ల రైల్వే శాఖకు కూడా భారీగా నష్టాన్ని తెచ్చిపెడుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైల్వే ట్రాక్ వెంట ఉన్న చెరువులు, కుంటలు, నాళాలు ఆక్రమించడం వల్ల భారీ వర్షాలకు ఒక్కసారిగా వరద ఉప్పొంగి ప్రవహించడం వల్ఎక్కడైనా చెరువు తెగితే రైల్వే ట్రాక్ పూ ర్తిగా నీట మునిగి రైళ్ల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. అక్టోబర్ 2025లో కురిసిన భారీ వర్షాలకు కాజీపేట నుండి డోర్నకల్ సెక్షన్లో కొన్ని కుంటలు తెగిపోవడంతో భారీ వరద రైల్వే ట్రాక్ ను ముం చెత్తింది.దీనితో ఒకరోజు పూర్తిగా దక్షిణాది నుండి ఉత్తరాదికి రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. రైల్వే స్టేషన్లన్నీ కూడా చెరువులను తలపించాయి. అలాగే వర్షాకాలంలోకురిసిన భారీ వర్షానికి కేసముద్రం ఇంటికన్నె రైల్వే స్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్ కొట్టుకుపోయింది. దీనితో రోజులపాటు రైళ్ల రాకపోకలు స్తంభించాయి. రైల్వే శాఖ 'ట్రాక్ ఎఫెక్టెడ్ ట్యాంక్స్' ను గుర్తించి వాటి నుండి వరద ముప్పు నివారణకు కూడా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.ఇరిగేషన్, పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖలు స్పందించి ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో ఉన్న చెరువులు, కుంటలకు, నాళాల ఎఫ్ టి ఎల్, బఫర్ జోన్ సర్వే నిర్వహించి , హద్దులు నిర్ణయించి ఎఫ్ టీ ఎల్ పరిధిలో నిర్మించిన నిర్మాణాలను తొలగించి, చెరువులు, కుంటలు, నాళాలను పరిరక్షించే కార్య క్రమాలను చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. చెరువులు, కుంటలు, నాళాలు ఆక్ర మణకు గురైతే సంబంధిత శాఖల అధికారులపై చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వం నిబంధనలు రూపొందించాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఎప్పటికప్పుడు చెరువులు, కుంటలు, నాళాలు ఆక్రమణలకు గురికాకుండా నిరంతర పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# వేముల వర్సెస్ కోమటిరెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 3, తెలంగాణలో హ్యామ్ రోడ్డు టెండర్ల చుట్టూ అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం ముదిరింది. రూ. 8 వేల కోట్ల స్కామ్ జరుగుతోందని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆరోపించగా.. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వాటిని తీవ్రంగా ఖండించారు. టెండర్లు అన్నీ కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పారదర్శకంగా జరుగుతున్నాయని.. తనపై బురద చల్లడం మానుకోవాలని కోమటిరెడ్డి హెచ్చరించారు. ఈ వివాదం ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారిందితెలంగాణ రాజకీయాలు హాట్ హాట్‌గా సాగుతున్నాయి. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యుల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరుకుంది. రాష్ట్రంలో అభివృద్ధి, పలు శాఖల్లో అవినీతిపై సభ్యులు విమర్శలు గుప్పించుకున్నారు. ఇక తాజాగా.. రాష్ట్ర రాజకీయం రోడ్ల అభివృద్ధి, హ్యామ్ టెండర్ల చుట్టూ తిరుగుతోంది. తనపై, ప్రభుత్వంపై మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి చేస్తున్న అవినీతి ఆరోపణలను రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. తన వ్యక్తిత్వాన్ని, పనితీరును ఉద్దేశించి మంత్రి కీలక కామెంట్స్ చేశారు. తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఎప్పుడూ అవినీతికి తావివ్వలేదన్నారు. తాను నిప్పు లాంటి వ్యక్తినని.. తన రాజకీయ జీవితంలో ఇప్పటివరకు ఎలాంటి అవినీతి మరకలు లేవన్నారు. కనీసం ఆరోపణలు కూడా రాలేదని.. అలాంటిది తన శాఖపై బురద చల్లాలని చూడటం హాస్యాస్పదంగా ఉందని కోమటిరెడ్డి మండిపడ్డారు.హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పద్ధతిలో చేపడుతున్న రోడ్డు పనుల్లో భారీ స్కామ్ జరుగుతుందన్న విమర్శలను కోమటిరెడ్డి ఖండించారు. హ్యామ్ రోడ్ల టెండర్లలో ఎలాంటి అవినీతి జరగలేదని అన్నారు. పారదర్శకంగానే రోడ్ల నిర్మాణం జరుగుతోందని వివరించారు. ఈ టెండర్లన్నీ కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ హైవేస్ అథారిటీ నిబంధనల ప్రకారమే ఖరారు చేసినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని, తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి రోడ్ల నిర్మాణం, నిబంధనల గురించి ఏమాత్రం అవగాహన లేదని విమర్శించారు. రోడ్ల గురించి, టెండర్ల ప్రక్రియ గురించి వేముల ప్రశాంత్ రెడ్డికి కనీస జ్ఞానం లేదన్నారు. గత పదేళ్లలో రాష్ట్రంలో రోడ్లను అధ్వాన్నంగా మార్చిన వారు ఇప్పుడు తమపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని కోమటిరెడ్డి ఎద్దేవా చేశారు.కాగా, రోడ్ల అభివృద్ధి పేరిట తీసుకొస్తున్న హ్యామ్ రోడ్స్ విధానంలో రూ.8 వేల కోట్ల స్కాం జరుగుతుందని వేముల ప్రశాంత్ రెడ్డి ఇటీవల ఆరోపించారు. 6 వేల కిలోమీటర్ల హ్యామ్ మోడల్ రోడ్లకు రూ. 13 వేల కోట్లతో టెండర్ల పిలిచారన్నారు. మొబిలైజేషన్ కింద 10 శాతం అంటే రూ. 1300 కోట్లు ముందే ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమయ్యిందని ఆరోపించారు. ఈ టెండర్‌లో ఎక్సెస్ టెండర్ వేసుకోవాలని ప్రభుత్వమే సలహాలు ఇవ్వటాన్ని ఆయన తప్పుబట్టారు. హ్యామ్ మోడల్ రోడ్ల విషయంలో రేవంత్ ప్రభుత్వం మరోసారి రివ్యూ చేసుకోవాలని సూచించారు. ఈ రోడ్లను జేఇంఫ్రా , బృందా ఇంఫ్రా కంపెనీలకు ఇచ్చేందుకు సిద్ధమయ్యాని.. ఈ కంపెనీలకు అనుభవం లేదని.. ఆర్‌అండ్‌బీలో పనులు చేసిన దాఖలాలు లేవని అన్నారు. దీనిపై విజిలెన్స్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రశాంత్ రెడ్డి చేసిన ఈ ఆరోపణలకు తాజాగా కోమటిరెడ్డి కౌంటర్ ఇచ్చారు.

# నకిరేకల్ లో పిచ్చికుక్కల స్వైర విహారం



నల్గొండ నకిరేకల్ లో నాలుగు సంవత్సరాల అబ్బాయి శరత్చంద్ర పై వీధిలో ఆడుకుంటుండగా కుక్క దాడి చేసింది. దాంతో ముఖంపై భారీగా గాయాలు అయ్యాయి. బాలుగు అపస్మానిక స్థితిలో పడిపోయాడు. బంధువులు హుటాహుటిన ప్రైవేట్ హాస్పిటల్ కి తరలించారు. తీవ్ర గాయాలుతున్న చిన్నారి శరత్ చంద్రకు ప్రధమ చికిత్స చేసి హైదరాబాద్ నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. కుక్కకు పిచ్చి లేచి అందరినీ కరుస్తుందని ఎవరూ పట్టించుకోవట్లేదు అని చిన్నారి శరత్చంద్ర తల్లిదండ్రులు అవేదన వ్యక్తం చేస్తున్నారు.

# నాకు డ్రగ్ నెగెటివ్ వచ్చింది నటి హేమ



హైదరాబాద్ కొండాపూర్ ప్రాంతంలోని క్వాక్ ఏరీనా పబ్లో డ్రగ్స్ కలకలం రేపింది. 64 మందికి డ్రగ్స్ టెస్ట్ నిర్వహించగా, ఆరుగురికి గంజాయి పాజిటివ్, ఇద్దరికి డ్రగ్స్ టెస్ట్ పాజిటివ్ వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. వారినిలో సినీ నటి హేమ కుడా వున్నారు. పబ్లో జరిగిన పార్టీలో తాను ఉన్నానని, కానీ తనకు డ్రగ్స్ టెస్టులో నెగెటివ్ వచ్చిందని ఆమె వీడియో పోస్ట్ చేసారు.

# దొడ్డి కొమరయ్యకు బీఆర్ఎస్ నేతల నివాళులు

హైదరాబాద్ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య జయంతి సందర్భంగా.. తెలంగాణ భవన్ లో వారి చిత్ర పటానికి బీఆర్ఎస్ నేతలు నివాళులర్పించారు. శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనా చారి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సుమిత్రానంద్, ఉపేంద్ర చారి, బాలరాజ్ యాదవ్, కురువ విజయ్ కుమార్, తుంగ బాలు, దేవరి మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.



# కాళీయమర్దన అలంకారంలో రామచంద్రుని కరుణామృతం

ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజైన శుక్రవారం ఉదయం స్వామివారు కాళీయమర్దన అలంకారంలో భక్తులను కటాక్షించారు.ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు జరిగిన వాహన సేవలో భజన బృందాలు భక్తిరసభరితంగా భజనలు, కోలాటాలు నిర్వహించగా, స్వామివారు పురవీధుల్లో విహరిస్తూ భక్తులను ఆనందింపజేశారు.వాహనసేవ అనంతరం ఉదయం 11 గంటలకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం వంటి పవిత్ర ద్రవ్యాలతో శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీ కోదండరాముల ఉత్సవమూర్తులకు విశేష అభిషేకం చేశారు

# ఘనంగా మైలవరంలో గుడ్ ఫ్రైడే వేడుకలు



మైలవరంలో గుడ్ ఫ్రై డే వేడుకలు ఘనంగా జరిగాయి. సమస్త మానవాళి పాపాల విముక్తి కొరకు ప్రభువు సిలువ త్యాగం మరువలేనిదిఅని. ఏసుక్రీస్తు సిలువపై చేసిన బలిదానాన్ని విశ్వసిస్తూ క్రైస్తవులు శుభ శు క్రవారం గా విశ్వసిస్తారన్నారు. మైలవరంలో ఆర్ సి ఎం చర్చి పాస్టర్ అనిల్ ఆధ్వర్యంలో సిలువ మోస్తూ, పాటలతో ఆరాధిస్తూ సిలువ యాత్ర నిర్వహించారు.

పంచాయతీ కార్యాలయం వద్ద తెలుగు యువత అధ్యక్షులు లంక లితీష్, పాస్టర్ అనిల్ తో కలసి సిలువ దగ్గర ప్రార్థనచేసి, ప్రభువు పలికిన ఏడు మాటలను స్మరించుకున్నారు.. ఈ సందర్భంగా లితీష్ అందరికీ గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు తెలియజేసి ప్రభువు మార్గాన్ని, ప్రభువు చేసిన త్యాగాన్ని మరువకూడదన్నారు..

# కొండగట్టు లో భక్తుల అందోళన

జగిత్యాల హనుమాన్ జయంతి రోజున కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తులు ఆందోళనకు దిగారు. గురువారం రాత్రి భక్తులు నిరసనకు దిగారు. గంటల తరబడి క్యూ లైన్లో వేచిచూస్తున్న భక్తులకు లడ్డూ ప్రసాదం అందుబాటులో లేకుండా పోయింది. ప్రసాదం అడిగితే సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని భక్తులు ఆరోపించారు. భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో ఆలయ అధికారులు విఫలం అయ్యారని ఆరోపించారు.

# మరో వివాదంలో టీడీపీ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం టీడీపీ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మరో వివాదంలో చిక్కుకున్నారు. సదరు ఎమ్మెల్యే చెందిన రుద్రాన్ష్ కాంట్రాక్ట్ సంస్థకు అనుమతులు లేవని అధికారులు తేల్చివేసారు. ఆర్ అండ్ బీ ఎస్ఈ సంతకాలు ఫోర్జరీ చేసి.. నకిలీ పత్రాలతో కాంట్రాక్ట్ సంస్థ నిర్వహిస్తున్నట్టుగా ఆరోపణ. రుద్రాన్ష్ పేరుతో అనంతపురంలో మూడు కోట్ల రూపాయల విలువైన పనులు ఎమ్మెల్యే కంపెనీ చేస్తోంది. బంధువుల పేరిట రుద్రాన్ష్ రిజిస్ట్రార్ అయినట్లు టీడీపీ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చెబుతున్నారు. రుద్రాన్ష్ కాంట్రాక్ట్ సంస్థకు అనుమతి ఇవ్వలేదని ఆర్ అండ్ బి అధికారులు స్పష్టం చేసారు. అనంతపురం టీడీపీ నేత శ్రీనివాస్ చౌదరి ఆర్టీఐ దరఖాస్తుతో విషయం బయట పడింది.

## భూబాధితుల దీక్షకు మద్దతు తెలిపిన సబిత ఇంద్రారెడ్డి



పరిగి పదకొండు రోజులుగా పరిగి మండలం కాడ్లాపూర్ గ్రామంలో భూ బాధితుల రిలే నిరహార దీక్ష కొనసాగుతోంది. వికారాబాద్ జిల్లాలోని ఇండస్ట్రీయల్ పార్కో భూమి కోల్పోతున్న రైతుల రిలే నిరహార దీక్షకు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి హాజరయ్యారు. సబితా ఇంద్రారెడ్డితో రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. భూమి తప్ప తమకు వేరే ఆదారం లేదని తెలిసారు. బీఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా ఉంటుందని సబితా ఇంద్రారెడ్డి హామీ ఇచ్చారు.

## ఈ నెల 13 న జీవన్ రెడ్డి బీఆర్ఎస్ లో చేరిక



హైదరాబాద్ మాజీ మంత్రి జీవన్ రెడ్డి, ఏప్రిల్ 13వ తేదీన బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నారు. ఏప్రిల్ 7వ తేదీన జీవన్ రెడ్డి నివాసానికి కేటీఆర్ వెళ్లి పార్టీలోకి ఆహ్వానించనున్నారు. ఏప్రిల్ 13న పార్టీ చేరిక అనంతరం, జగిత్యాలలోనే పార్టీ ప్లీనరీ పెట్టాలనే ఆలోచనలో బీఆర్ఎస్ పార్టీ వుందని సమాచారం.

## ప్రైవేటు స్కూళ్లకి కళ్లెం వేయాలి కవిత



హైదరాబాద్ రాష్ట్రంలో ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు 30% నుంచి 40% ఫీజులు పెంచడం మధ్య తరగతి తల్లితండ్రులకు తలకు మించిన భారంగా మారుతున్నదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. . అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రవేట్ స్కూల్ యాజమాన్యాల పై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటు. తక్షణమే ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి.. అధిక ఫీజు వసూళ్లను కట్టడి చేయాలని అన్నారు. .

## అమరావతి బిల్లును లోకసభ రాజ్యసభ లో ఆమోదించడం పై హర్షం

### మాజీ జిల్లా ఉపాధ్యక్షులు మాధవస్వామి

నందవరం అమరావతి రాజధాని బిల్లు ను లోకసభ,రాజ్యసభ లో బిల్లు ఆమోదించడం పై మాజీ జిల్లా ఉపాధ్యక్షులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మాధవస్వామి హర్షం వ్యక్తం చేశారు. స్వగృహం లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగు పడాలంటే రాజధాని అవసరం అని చంద్రబాబు ప్రజా రాజధాని గా అమరావతి ని ఏర్పాటు చేస్తే వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత మూడు ముక్కులు ఆట ఆడి రాజధాని నాశనం చేశారని ఏదేవా చేశారు.తెలుగుదేశం పార్టీ అధికారం లోకి వచ్చాక రాజధాని బిల్లు ను లోకసభ, రాజ్యసభ లో బిల్లు ఏమోదించడం పై ఆమోదం పై హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే బి.వి.జయ నాగేశ్వర్ రెడ్డి చేనేత కార్మికుల సంక్షేమం కోసం చేస్తున్న కృషిని ఓర్వలేకనే మాజీ ఎంపీ బుట్టా రేణుక అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని విమర్శిస్తూ రూపొందించిననియోజకవర్గ ఎమ్మెల్యే బి.వి. జయ నాగేశ్వర్ రెడ్డి ప్రతిష్టను దెబ్బతీసేలా మాజీ ఎంపీ బుట్టా రేణుక నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదని స్థానిక నాయకులు మరియు కార్యకర్తలు తీవ్రంగా ఖండించారు.కేవలం రాజకీయ ఉనికి కోసమే ఆమె చేనేత సొసైటీ అంశాన్ని తెరపైకి తెచ్చి బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని వారు మండిపడ్డారు.ఎమ్మెల్యే జయ నాగేశ్వర్ రెడ్డి పదవిలోకి వచ్చినప్పటి నుండి చేనేత కార్మికుల అభివృద్ధి కోసం,వారికి రావాల్సిన బకాయిలు మరియు కొత్త పథకాల అమలు కోసం నిరంతరం శ్రమిస్తున్నారని నాయకులు గుర్తు చేశారు.ఎమ్మెల్యేకు పెరుగుతున్న ఆదరణను చూసి తట్టుకోలేక, పస లేని ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించాలని బుట్టా రేణుక చూస్తున్నారని వారు విమర్శించారు.సొసైటీ అభివృద్ధి: గతంలో ఎన్నడూ లేని విధంగా చేనేత సొసైటీల బలోపేతానికి ఎమ్మెల్యే కృషి చేస్తుంటే, వాటిపై అసత్యాలు ప్రచారం చేయడం కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు."జయ నాగేశ్వర్ రెడ్డి హయాంలో చేనేత కార్మికులకు జరుగుతున్న మేలు కళ్ళముందే కనిపిస్తోంది.

వాస్తవాలు తెలుసుకోకుండా బుట్టా రేణుక మాట్లాడటం ఆమె స్థాయికి తగదు.ఆరోపణలు మానుకోకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారు.ఈ కార్యక్రమం మండల సొసైటీ చైర్మన్ ధర్మపురం గోపాల్, లచ్చప్ప, సొసైటీ డైరెక్టర్ భీమ శేఖర్, మైనార్టీ షరీఫ్ , తిప్పరాజు చేనేత కార్మికులు బుగిడే పొంపయ్య,శంకర్, తిమ్మన్న,చిదిగే కుమార్, చాకలి శీను, వెంకటేష్, మల్ల,పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బద్వేలు రూరల్ నియోజకవర్గంగా పోరుమామిళ్ల

### వచ్చే ఎన్నికల నాటికి బద్వేలు అసెంబ్లీ జనరల్ కానుందా ?

### గత 25 సంవత్సరాలుగా ఎస్సీ రిజర్వ్ ఉన్న బద్వేలు

### పార్లమెంట్ కేంద్రంగా ప్రొద్దుటూరు




బద్వేలు ఇప్పటివరకు ఏడు మండలాలతో కలిసి ఉన్న బద్వేలు నియోజవర్గం పునర్ విభజన తో ప్రత్యేకంగా బద్వేలు రూరల్ పేరుతో పోరుమామిళ్ల కేంద్రంగా మరో నియోజకవర్గం ఏర్పాటు అయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి బద్వేల్ నియోజకవర్గం లో బద్వేలు పోరుమామిళ్ల కలసపాడు అట్లూరు బి కోడూరు కాశినాయన గోపవరం మండలాలు ఉన్నాయి ఇప్పుడు పోరుమామిళ్ల కేంద్రంగా బద్వేల్ ఏర్పాటు కానున్నట్లు సమాచారం రాజకీయ విశ్లేషకులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు ఉమ్మడి కడప జిల్లాలో ప్రస్తుతం 10 అసెంబ్లీ నియోజకవర్గాలు కడప రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గాలు ఉన్నాయి ఇప్పుడు అసెంబ్లీ స్థానాల సంఖ్య 15 కు పెరగవచ్చని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు అందులో పోరుమామిళ్ల ఎర్రగుంట్ల లక్కిరెడ్డిపల్లె కడప గ్రామీణ నియోజకవర్గంతో పాటు మరో నియోజకవర్గం ఏర్పాటు అయ్యే అవకాశం ఉంది బద్వేలు రూరల్ నియోజకవర్గ పోరుమామిళ్ల కేంద్రంగా ఏర్పాటు అయ్యే పోరుమామిళ్ల మండలం బి కోడూరు కాశి నాయన కలసపాడు మండలాలతోపాటు మైదుకూరు నియోజకవర్గంలోని బ్రహ్మంగారి మఠం మండలం కూడా కలిసే అవకాశం ఉంది ఇక బద్వేలు నియోజకవర్గం లో బద్వేలు గోపవరం అట్లూరు మండలాలు ఉండనున్నాయి నియోజకవర్గ విభజనపై ఆశావాహులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు గత 25 సంవత్సరాలుగా బద్వేల్ అసెంబ్లీ రిజర్వు స్థానంగా ఉంది విభజన జరిగితే బద్వేల్ అసెంబ్లీ జనరల్ అవుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు పార్లమెంట్ కేంద్రంగా ప్రొద్దుటూరు పార్లమెంటు అసెంబ్లీ స్థానాలు పెంచాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కడప జిల్లాలోని రాజకీయ ఉత్సాహవంతుల్లో ఎక్కడలేని విధంగా పరుగులు పెట్టిస్తుంది ప్రస్తుతం కడప జిల్లాలో పులివెందుల జమ్మలమడుగు బద్వేలు కడప ప్రొద్దుటూరు మైదుకూరు కమలాపురం ఉన్నాయి తాజా నిర్ణయం ప్రకారం రాష్ట్రంలో అసెంబ్లీ సీట్లు పెంపు దమాషా ప్రకారం చూస్తే రెండు నుంచి మూడు అసెంబ్లీ స్థానాలు పెరిగే అవకాశం ఉంది తాజా నిర్ణయం ప్రకారం ఎర్రగుంట్ల కడప గ్రామీణ పోరుమామిళ్ల కొత్త నియోజకవర్గాలు రానున్నాయి 1.50 లక్షలు ఓట్లు ఉండేలా కొత్త నియోజకవర్గాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదన ఉంది దీంతో కడప కడప గ్రామీణ నియోజకవర్గాలు ఏర్పాటు అవకాశాలు ఉన్నాయి అవసరమైతే సిద్ధవటం మండలాన్ని కడప గ్రామీణ నియోజకవర్గంలో కలిపే అవకాశం ఉంది ప్రతిపాదిత, ఎర్రగుంట్ల నియోజకవర్గం కింద ఎర్రగుంట్ల ముదునూరు వీరుపు నాయుడు పల్లె తొండూరు కొండాపురం సింహాద్రిపురం మండలాలను చేర్చే అవకాశం ఉంది మూడోది ఏర్పాటు చేస్తే బద్వేలు మైదుకూరు పొద్దుటూరు నుంచి అవకాశం ఉంది పోరుమామిళ్ల పొద్దుటూరు గ్రామీణ నియోజకవర్గాలు ఏర్పాటు అయ్యే అవకాశాలు లేకపోలేదు రాష్ట్రంలో పెరిగే పార్లమెంట్ స్థానాలను పరిగణలోకి తీసుకుంటే కడప జిల్లా నుంచి ఒక నియోజకవర్గానికి అవకాశం ఉంది పట్టణ ప్రాథమిక జనాభా ఓట్ల సంఖ్యను బట్టి ప్రొద్దుటూరు పార్లమెంటు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి ఇప్పటికే జిల్లాలో కడప కింద కడప రాజంపేట ప్రతిపాదిత కడప గ్రామీణ కమలాపురం బద్వేలు నియోజకవర్గాలు వచ్చే వీలు ఉంది ప్రొద్దుటూరు పార్లమెంట్ పరిధిలోకి పులివెందుల ప్రతిపాదిత ఎర్రగుంట్ల మైదుకూరు జమ్మలమడుగు పొద్దుటూరు అసెంబ్లీ నియోజకవర్గాలు వచ్చే అవకాశం ఉంది విభజన జరిగితే పెరిగే స్థానాల్లో తమ అదృష్టం ఎలా ఉందో చూసుకోవచ్చు అనిప్రధాన పార్టీలకు చెందిన వారు ఎంతో ఆశపడుతున్నారు

## గజ్వేల్, సిద్దిపేటలో ప్రశాంతంగా హనుమాన్ జయంతి వేడుకలు:

### పటిష్ట బందోబస్తు మధ్య ముగిసిన శోభాయాత్రలు



సిద్దిపేట సిద్ధిపేట జిల్లా వ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా,ఆధ్యాత్మిక ఉత్సాహంతో నిర్వహించబడ్డాయి. ముఖ్యంగా గజ్వేల్ మరియు సిద్ధిపేట పట్టణాలలో భారీ ఎత్తున శోభాయాత్రలు నిర్వహించబడ్డాయి.వేడుకల సందర్భంగా ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిశాయి. ముందస్తు ప్రణాళికతో పోలీసులు విస్తృతంగా బందోబస్తు ఏర్పాటు చేసి, శాంతి భద్రతలను సమర్థంగా నిర్వహించారు. శోభాయాత్రల కారణంగా సాధారణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్‌ను సక్రమంగా మళ్లించడం జరిగింది.ర్యాలీలు సాగిన మార్గాల్లో విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించారు.శాంతి భద్రతలను కాపాడటంలో సహకరించిన ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బంది మరియు ప్రజలకు కమిషనర్ ఆఫ్ పోలీస్ రష్మీ పెరుమాళ్, ఐ ధన్యవాదాలు తెలిపారు.

## అమరావతికి చట్టబద్ధత

### బద్వేల్ లో తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు సంబరాలు



బద్వేలు ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్ష నెరవేరిన వేళ.. అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటు ఉభయ సభల్లో చారిత్రాత్మక బిల్లు ఆమోదం పొందడం పట్ల బద్వేల్ మాజీ ఎమ్మెల్యే కె. విజయమ్మ నియోజకవర్గ ఇన్చార్జ్ కె. రితేష్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. పార్టీ కార్యాలయం వద్ద సంబరాలు చేశారు అసాధ్యమైన దానిని సుసాధ్యం చేసి, అమరావతికి చట్టబద్ధత కల్పించిన భారత ప్రధాని నరేంద్ర మోదీ , ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర ప్రజల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.తెలుగు ప్రజల శ్రేయస్సు, అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, ఇప్పటికే రాష్ట్రానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక విజయం సందర్భంగా బద్వేల్ పట్టణంలో బాణసంచా కాల్చి, ప్రజలకు మిఠాయిలు పంచి సంబరాలు నిర్వహించారు. అనంతరం నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి తమ కృతజ్ఞతను చాటుకున్నారు.

## పరిష్కారం కాకున్నారాష్ట్ర విభజన

## తెలంగాణకు ఎప్పుడూ వ్యతిరేకం కాదు

## సీఎం చంద్రబాబు నాయుడు

అమరావతి విభజన సమయంలో రెండు రాష్ట్రాల్లోనూ భావోద్వేగాలు ఉన్నాయి. తెలుగు జాతి ప్రయోజనాల కోసం సంపద సృష్టికి ఓ ప్రాంతం తయారు కావాలనే హైదరాబాద్ లో సైబరాబాద్ నిర్మాణం చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు.శుక్రవారం అయన మీడియాతో మాట్లాడారు. రెండు ప్రాంతాలకూ సమన్యాయం చేయాలని ఆ రోజు చెప్పాం. చాలా అంశాలు పరిష్కారం కాకున్నా విభజన జరిగింది. ఆర్థిక కష్టాలు, రాజధాని లేదు, వనరులు లేవు అన్నీ ఇబ్బందులే. అక్కడి నుంచే మొదలయ్యాం. అప్పాయింటెడ్ డే జూన్ 2 కంటే ముందే తెలంగాణలో ఉన్న 7 పోలవరం ముంపు మండలాలు ఏపీలో కలపాలని కోరాను. తెలంగాణకు నేను ఎప్పుడూ వ్యతిరేకం కాదు. తెలంగాణాకు నష్టం కలగాలని ఎప్పుడూ కోరుకోను. ఇవాళ హైదరాబాద్ లో ఇంతటి సంపద కలిగిందంటే సైబరాబాద్ లాంటి నగరాల నిర్మాణమే. చాలా మంది ఎంపీలు గుర్తించి పార్లమెంటులోనూ ఇది ప్రస్తావించారు. ఆ గౌరవాన్ని ఎప్పుడూ పోగొట్టుకోను రాజధాని లేకుండా విజయవాడకు వచ్చాం. ఒక ఎస్ఈ కార్యాలయంలో ఆఫీసు ఏర్పాటు చేసుకుని, బస్సులో బస చేసి కార్యకలాపాలు ప్రారంభించామని అన్నారు.ఏమీ లేకుండా రాష్ట్రం ఏర్పడిందనటానికి అవే ప్రత్యక్ష ఉదాహరణ. శివరామకృష్ణన్ కమిటీని కేంద్రం ఏర్పాటు చేస్తే 46 శాతం మంది ప్రజలు విజయవాడ- గుంటూరు మధ్య రాజధానికి ఏర్పాటుకు అనుకూలమని పేర్కొన్నారు. అయితే వైసీపీ చాలా డ్రామాలు ఆడింది. అధికార వికేంద్రీకరణ చేస్తూనే మనకంటూ ఓ రాజధాని ఉండాలని మేం సంకల్పం చేశాం. ఆ సంకల్పంలో భాగమే మూడు ప్రాంతాలకు సమాన దూరంలో ప్రాంతాన్ని రాజధానిగా ఎంపిక చేశాం. రాష్ట్రం మధ్యలో ఉన్న ప్రాంతంగా, కనెక్టివిటీ పరంగా, భౌగోళికంగా, చారిత్రాత్మక ప్రదేశంగా రాజధానిగా ఎంపిక చేసి ప్రణాళికలు చేశామని అన్నారు.

## మాజీ మంత్రి కొడాలి నాని తో కలిసి దుర్గమ్మను దర్శించుకున్న నాగపూర్ (సౌత్) బీజేపీ ఎమ్మెల్యే మోహన్ మాతే.

### కుటుంబ సభ్యులతో కలిసి దైవదర్శనంలో పాల్గొన్న కొడాలి నాని, ఎమ్మెల్యే మోహన్ మాతే.

ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ నేత కొడాలి నాని,నాగపూర్ (సౌత్) బీజేపీ ఎమ్మెల్యే మోహన్ మాతే కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు.శుక్రవారం ఉదయం ఇంద్రకీలాద్రికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్న కొడాలి నాని, మోహన్ మాతే. ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం నేతలిద్దరూ అమ్మవారి అంతరాలయ దర్శనం చేసుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆశీర్వచనాలు అందించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## కవిత పార్టీ పేరు టీఆర్ ఎస్సా...

హైదరాబాద్, ఏప్రిల్ 2 టీఆర్ఎస్... ఈ పేరుతో తెలంగాణకు ప్రత్యేకమైన అటాచ్‌మెంట్ ఉంది. తెలంగాణ రాష్ట్ర సమితి పేరుతో ప్రత్యేక పార్టీ పెట్టి ప్రత్యేక రాష్ట్రం కోసం కేసీఆర్ చేసిన పోరాటాలను కథల కథలుగా చెప్పుకుంటారు తెలంగాణ ప్రజలు. లేటెస్ట్ పాలిటిక్స్‌లో చాలా పార్టీలకు టీఆర్ఎస్ రోల్ మోడల్. ప్రత్యేక రాష్ట్ర సాధించిన పార్టీగా టీఆర్ఎస్‌కు ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం ఉంది. అయితే పార్టీని వేరే రాష్ట్రాల్లో విస్తరించాలనే ఆలోచనతో తెలంగాణ రాష్ట్ర సమితిని, భారత రాష్ట్ర సమితిగా మార్చి సరికొత్త నినాదాన్ని అందుకున్నారు కేసీఆర్. తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఓడిపోయారు. ఇప్పుడు తన కుమార్తె కవిత టీఆర్ఎస్ పేరుతో కొత్త పార్టీ పెట్టాలని ఆలోచన చేస్తున్నట్టు కనిపిస్తోంది. శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె చేసిన కామెంట్స్ సంచలనంగా మారుతున్నాయి. బంజారాహిల్స్‌లోని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆమె సమావేశం పెట్టింది ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల దోపిడీపై అయినా సరే రాజకీయంగా కూడా కొన్ని కామెంట్స్ చేయడం సంచలనంగా మారింది. తన పార్టీ గురించి మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానంగా టీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు అందుబాటులో ఉందని, దాన్ని ఎవరైనా పెట్టుకోవచ్చని అన్నారు. తన పార్టీ ప్రొఫెసర్ జయశంకర్ సిద్ధాంతాల మేరకే నడుస్తుందని చెప్పారు. తమకు ఇతర రాష్ట్రాల సిద్ధాంతకర్తలు అవసరం లేదని స్పష్టం చేశారు.

టీఆర్ఎస్ ఫ్రీ అయిందని చెప్పడం వెనుక కవిత పార్టీ పేరు అదే అయి ఉంటుందని ప్రచారం మొదలైంది. ఈ నెలాఖరున పార్టీ పేరు అజెండా ప్రకటిస్తానంటూ ఆమె చెప్పుకొచ్చారు. ఈ పేరును వదిలేసిన బీఆర్ఎస్ నుంచి ఎలాంటి రియాక్షన్ వస్తుంది. ప్రజల్లో వచ్చే స్పందన ఏలా ఉంటుందనే విషయాల గురించి తెలుసుకునేందుకు మీడియా సమావేశంలో కవిత ఇలాంటి కామెంట్స్ చేసి ఉంటారని విశ్లేషకులు అంటున్నారు.

## నిజామాబాద్ లో లవ్ స్టోరీ...

### వరుడు గ్రేట్ శాక్రిఫైజ్

నిజామాబాద్, ఏప్రిల్ 3 నిజామాబాద్ జిల్లా నవీపేట మండలంలోని ఆ కళ్యాణ మండపం పెళ్లి సందడితో కళకళలాడుతోంది. బంధుమిత్రుల కోలాహలం, మంగళ వాయిద్యాల హోరు మధ్య వధువు పల్లవి , వరుడు వేణుగోపాల్ పెళ్లి పీటల మీద కూర్చున్నారు. పండితులు మంత్రోచ్ఛారణలు చేస్తూ పెళ్లి తంతును నడిపిస్తున్నారు. జీలకర్ర బెల్లం కార్యక్రమం పూర్తయ్యింది. ఇక ప్రధాన ఘట్టమైన మాంగల్య ధారణ సమయం రానే వచ్చింది. పెళ్లికొడుకు వేణుగోపాల్ చిరునవ్వుతో తాళిని పల్లవి మెడలో కట్టబోయాడు.సరిగ్గా అదే క్షణంలో.. కాలం ఆగిపోయినట్లుగా పల్లవి ఒక్కసారిగా వద్దు.. ఈ పెళ్లి నాకు ఇష్టం లేదు! అని గట్టిగా అరిచింది. ఆ ఒక్క మాటతో పెళ్లి పందిరంతా నిశ్శబ్దం అలుముకుంది. అప్పటివరకు సంతోషంగా ఉన్న బంధువుల ముఖాల్లో ఒక్కసారిగా ఆందోళన, అయోమయం నెలకొన్నాయి. పల్లవి కన్నీళ్లతో తన మనసులోని నిజాన్ని అందరి ముందూ బయటపెట్టింది. తాను వేరే కులానికి చెందిన వ్యక్తిని ప్రేమిస్తున్నానని, ఇంట్లో చెబితే ఎక్కడ ఒప్పుకోరో అన్న భయంతో ఇంతకాలం మౌనంగా ఉన్నానని నిజాయితీగా ఒప్పేసుకుంది.ఈ మాట వినగానే పల్లవి తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. బంధువులు ఆమెను ఒప్పించే ప్రయత్నం చేశారు. ఇప్పుడు పెళ్లి ఆగిపోతే పరువు పోతుంది, కాపురం మొదలుపెట్టాక అంతా సర్దుకుంటుంది అని నచ్చజెప్పారు. కానీ పల్లవి

58తన నిర్ణయానికి కట్టుబడింది. తనని ప్రేమించిన వాడికి కాకుండా మరొకరికి భార్యగా కాలేనని తెగేసి చెప్పింది. పరువు కోసం ఒక నిరర్థకమైన బంధంలో బందీ కావడానికి ఆమె నిరాకరించింది.అక్కడ అందరూ ఆశ్చర్యపోయే మరో దృశ్యం ఆవిష్కృతమైంది. తన మెడలో తాళి కట్టాల్సిన అమ్మాయి అలా చెప్పడంతో సాధారణంగా ఏ వరుడైనా అవమానంగా భావించి గొడవ చేస్తాడు. కానీ వేణుగోపాల్ సంస్కారం ముందు అందరూ తలవంచాల్సిందే. పల్లవి బాధను, ఆమె నిజాయితీని అతను అర్థం చేసుకున్నాడు. నాపై ప్రేమ లేని అమ్మాయిని బలవంతంగా పెళ్లి చేసుకొని, ఇద్దరి జీవితాలను నాశనం చేయడం నాకు ఇష్టం లేదు. ఆమె ఇష్టాన్నే నేను గౌరవిస్తాను అని ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచాడు.ఘటన సినిమాల్లో వచ్చే క్లైమాక్స్ లా అనిపించినా, వేణుగోపాల్ చూపించిన ఆ పరిణతికి అక్కడున్న వారంతా ఫిదా అయిపోయారు. ఆ గొడవలో ఆమెను విమర్శించకుండా, ఒక ప్రాణం విలువ తెలిసిన మనిషిగా అతను పెళ్లి రద్దుకు అంగీకరించాడు. చివరికి బంధువులు కూడా చేసేదేమీ లేక పెళ్లిని రద్దు చేసుకున్నారు. ఒకవైపు తన ప్రేమ కోసం సాహసం చేసిన వధువు పల్లవి, మరోవైపు తనను కాదన్న అమ్మాయి వ్యక్తిత్వాన్ని గౌరవించిన వరుడు వేణుగోపాల్.. వీరిద్దరి నిర్ణయాలు సమాజంలో ఒక కొత్త చర్చకు దారితీశాయి. ప్రేమ, పెళ్లి అనేవి బలవంతంగా రుద్దేవి కావని, అవగాహనతో కూడినవని ఈ సంఘటన మరోసారి నిరూపించింది.

## జూబ్లీహిల్స్‌లో ఇండియా ఆర్ట్

### ఫెస్టివల్‌కు రంగం సిద్ధం

నగరంలోని జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏప్రిల్ 3 నుండి 5 వరకు నిర్వహించనున్న ఇండియా ఆర్ట్ ఫెస్టివల్‌కు సంబంధించిన ప్రెస్ మీట్ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు ఫెస్టివల్ విశేషాలను మీడియాకు వివరించారు.దేశవ్యాప్తంగా ప్రముఖ గ్యాలరీలు, కళాకారులు ఈ ఉత్సవంలో పాల్గొననున్నట్లు తెలిపారు. మొత్తం 30 గ్యాలరీలు, 300 మంది కళాకారులు, సుమారు 3000 కళాఖండాలు ప్రదర్శనకు ఉంచనున్నట్లు వెల్లడించారు. పెయింటింగ్స్, శిల్పాలు, ఫోటోగ్రఫీ, ప్రింట్స్ వంటి విభిన్న కళారూపాలు ఈ ఫెస్టివల్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని పేర్కొన్నారు.ఏప్రిల్ 3న ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఎఎఖ ప్రివ్యూ నిర్వహించనున్నారు. అలాగే ఏప్రిల్ 4, 5 తేదీల్లో ప్రజలకు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రవేశం కల్పించనున్నట్లు తెలిపారు.కళాభిమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని భారీగా పాల్గొనాలని నిర్వాహకులు ఆహ్వానించారు.

## “సంగీతం యమహా తత్వానికి కేంద్రబిందువుగా ఏ ఆర్.రహమాన్ యమహా మ్యూజిక్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ యమమోటో టకేటోషి




విజయవాడ ఏప్రిల్.3: యమహా మ్యూజిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ, అకాడమీ అవార్డు విజేత మరియయుఅంతర్జాతీయ ఖ్యాతిగాంచిన సంగీత దిగ్గజం ఎ.ఆర్. రెహ్మాన్ గారిని తమ బ్రాండ్ అంబాసడర్‌గా నియమించినట్లు ప్రకటించింది.

అకాడమీ అవార్డు గెలుచుకున్న సంగీత దర్శకుడిగా మరియు ప్రపంచవ్యాప్తంగా గౌరవించబడుతున్న సంగీత ప్రతిభగా ఎ.ఆర్. రెహ్మాన్ భారతీయ సంగీతాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన ప్రయాణం భారతీయ ప్రతిభకు ఉన్న ప్రపంచ స్థాయి అవకాశాలను ప్రతిబింబిస్తుంది ––– ఇది భారతదేశంలో సంగీత సంస్కృతిని అభివృద్ధి చేయాలనే యమహా మ్యూజిక్ ఇండియా సంకల్పానికి అనుగుణంగా ఉంది. ఈ భాగస్వామ్యం యమహా మ్యూజిక్ ఇండియా యొక్క దీర్ఘకాలిక కట్టుబాటుకు ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది.

యమహా మ్యూజిక్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ యమమోటో టకేటోషి మాట్లాడుతూ:

“సంగీతం యమహా తత్వానికి కేంద్రబిందువుగా ఉంటుంది. భారతదేశం యొక్క సమృద్ధమైన సంగీత వారసత్వం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాలి. మా ‘మేడ్ ఇన్ ఇండియా’ కార్యక్రమం మరియు ఎ.ఆర్. రెహ్మాన్ గారితో మా భాగస్వామ్యం ద్వారా, తదుపరి తర సంగీతకారులను ప్రేరేపించడం మరియు దేశవ్యాప్తంగా వ్యవస్థీకృత సంగీత విద్యను విస్తరించడం మా లక్ష్యం.”

సేల్స్ యూనిట్ హెడ్ శ్రీ ర్యోజి మారుయామా మాట్లాడుతూ:

“మా లక్ష్యం కేవలం వాద్య పరికరాల వరకే పరిమితం కాదు. వర్క్‌షాప్‌లు, పాఠశాలల భాగస్వామ్యాలు, గ్రామీణ అవుట్‌రీచ్ కార్యక్రమాల ద్వారా సంగీత సమాజాలను అభివృద్ధి చేయడానికి మేము కట్టుబడి ఉన్నాము. ఈ భాగస్వామ్యం ప్రతి ఆశావహ కళాకారునికి సంగీతాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే మా దృక్పథాన్ని బలపరుస్తుంది.”

ఎ.ఆర్. రెహ్మాన్ మాట్లాడుతూ:

“యమహా ఎప్పుడూ ఖచ్చితత్వం మరియు విశ్వసనీయతకు ప్రతీకగా నిలిచింది. సంగీతంలో ఉన్నత ప్రమాణాలను కలిగి ఉన్న బ్రాండ్‌తో అనుబంధం కలిగినందుకు నాకు గర్వంగా ఉంది. వారి ‘మేడ్ ఇన్ ఇండియా’ దృష్టికోణం నాణ్యమైన వాద్య పరికరాలను మరింత అందుబాటులోకి తీసుకువస్తోంది. ఈ కార్యక్రమం నా ఖవీ మ్యూజిక్ కన్జర్వేటరీ మరియు ది సన్‌షైన్ ఆర్కెస్ట్రాలో శిక్షణ పొందుతున్న యువ ప్రతిభలకు ఇప్పటికే ప్రయోజనం కలిగిస్తోంది. మనం యువ కళాకారులను మార్గదర్శనం చేస్తూ, సంగీత విద్యను బలోపేతం చేస్తే, భారతీయ సంగీతకారులు ప్రపంచ వేదికపై ముందంజలో నిలుస్తారు.”

యమహా మ్యూజిక్ ఇండియా గురించి:

2008 మార్చిలో స్థాపించబడిన యమహా మ్యూజిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, యమహా కార్పొరేషన్ గ్లోబల్ గ్రూప్‌లో భాగంగా పనిచేస్తూ, భారత మార్కెట్‌కు యమహా సంగీత వాద్య పరికరాలు మరియు ఆడియో ఉత్పత్తుల పూర్తి శ్రేణిని అందిస్తోంది. సంస్థ ప్రధాన కార్యాలయం హర్యానాలోని గురుగ్రామ్‌లో ఉంది.

మా సంస్థ తత్వాలు వినియోగదారులపై కేంద్రీకృతమైన నిర్వహణలో ప్రతిఫలిస్తాయి. ఉత్పత్తులు మరియు సేవలలో ఉత్తమతను అందించడం, ప్రస్తుత మార్కెట్లను విస్తరించడం మరియు కొత్త మార్కెట్లను సృష్టించడం, పరిశోధన మరియు అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం, వినియోగదారులకు అమ్మకాల అనంతరం మెరుగైన సేవలు అందించడం, గ్లోబలైజేషన్‌ను ప్రోత్సహించడం మరియు విభిన్నీకరణ ద్వారా అభివృద్ధి సాధించడం మా ముఖ్య లక్ష్యాలు.

భారతదేశంలో దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలో భాగంగా, యమహా మ్యూజిక్ ఇండియా “మేడ్ ఇన్ ఇండియా” ఉత్పత్తులను బలోపేతం చేస్తూ, ముఖ్యంగా ఆడియో మరియు సంగీత వాద్య పరికరాల విభాగాల్లో అభివృద్ధి చెందుతోంది.

2019 నుండి చెన్నైలో తయారీ యూనిట్‌ను స్థాపించడం ద్వారా సంస్థ దేశీయ తయారీ సామర్థ్యాన్ని విస్తరించింది. ఖర్చు తగ్గింపు, సరఫరా చురుకుదనం, మార్కెట్‌కు వేగంగా స్పందించే సామర్థ్యాన్ని పెంచడంలో ఇది సహాయపడుతోంది. ఈ యూనిట్‌లో సంస్థ నిరంతరం కొత్త ఆవిష్కరణలు చేస్తూ అభివృద్ధి కొనసాగిస్తోంది.

యమహా యొక్క తత్వం ––– శబ్దం మరియు సంగీతం ద్వారా జీవితాలను సమృద్ధిగా చేయడం ––– సృజనాత్మకతను ప్రోత్సహించే సంస్కృతిని పెంపొందిస్తుంది మరియు సంగీతాన్ని ప్రతి ఒక్కరికీ జీవితకాల ప్రయాణంగా మారుస్తుంది.

## ఏప్రిల్ 5న ‘చేతక్ స్క్రీన్ అవార్డ్స్-2025’ వేడుక




హైదరాబాద్, ఏప్రిల్ 3 : ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూప్‌కు చెందిన స్క్రీన్ అకాడమీ, 2025 సంవత్సరానికి గాను హిందీ సినిమా, ఓటిటి కంటెంట్‌లో ఉత్తమ ప్రతిభను గౌరవించే చేతక్ స్క్రీన్ అవార్డ్స్ నామినేషన్లను ప్రకటించింది. అవార్డు వేడుక ఏప్రిల్ 5న నిర్వహించబడుతుంది. ఆదిత్య ధర్ దర్శకత్వంలో వచ్చిన స్పై థ్రిల్లర్ ‘ధురంధర్’ అత్యధికంగా 24 నామినేషన్లతో ముందంజలో నిలిచింది. మోహిత్ సూరి దర్శకత్వంలోని ‘సయ్యారా’ 17 నామినేషన్లు సాధించగా, నీరజ్ ఘయ్వాన్ రూపొందించిన ‘హోంబౌండ్’ 15 నామినేషన్లు పొందింది. మొత్తం 31 విభాగాల్లో నామినేషన్లు ప్రకటించబడగా, థియేట్రికల్, ఓటిటి విడుదలలను సమగ్రంగా ప్రతిబింబిస్తున్నాయి. ఈ అవార్డులు భారతీయ వినోద రంగంలో సృజనాత్మక ప్రతిభను గౌరవించేందుకు, సినీ, డిజిటల్ కంటెంట్‌లో ఉత్తమతను గుర్తించేందుకు లక్ష్యంగా ఉన్నాయి. 1995లో స్థాపించబడిన స్క్రీన్ అవార్డ్స్, 50 మందికి పైగా ప్రముఖ దర్శకులు, కళాకారులు, సాంస్కృతిక ప్రముఖులతో కూడిన స్వతంత్ర, లాభాపేక్షలేని స్క్రీన్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించ బడుతున్నాయి. ఎంపిక ప్రక్రియ కఠినంగా, నిష్పాక్షికంగా నిర్వహించబడింది. 95 శాతం కంటే ఎక్కువ మంది అకాడమీ సభ్యులు పాల్గొని, ప్రతి విభాగాన్ని సగటున 38––40 మంది సభ్యులు ‘ట్రిమ్డ్ మీన్(ఒలింపిక్)’ పద్ధతిలో మూల్యాంకనం చేశారు. పారదర్శకతను మరింత బలోపేతం చేయడానికి యూనివర్సిటీ ఆఫ్ సదర్న్ కాలిఫోర్నియా స్కూల్ ఆఫ్ సినిమాటిక్ ఆర్ట్స్‌లో సినిమా, మీడియా స్టడీస్ చైర్ ప్రొఫెసర్ ప్రియా జైకుమార్ ప్రత్యేక స్కోరింగ్ విధానాన్ని రూపొందించారు.

## రోడ్డు ప్రమాద బాధితునకు వెన్సో 50,000 సహాయం



హైద్రాబాద్ ఏప్రిల్ 3: చెమిడిదెపాడు గ్రామం, గుడ్లూరు మండలం, ప్రకాశం జిల్లా నివాసి అల్లూరి సుమంత్(24) ఒక నిరుపేద కుటుంబానికి చెందిన యువకుడు, రోజువారీ కార్పెంటర్ గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయన తండ్రి పక్షవాతం కారణంగా మంచానికే పరిమితమై ఉన్నారు, అందువలన కుటుంబానికి సుమంతే ఏకైక ఆధారం. దురదృష్టవ శాత్తు, డిసెంబర్ 15వ తేదీ రాత్రి పని ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్న సమయం లో మాచవరం గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సుమంత్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆటో మరియు పశువులను తప్పించబోయి కరెంట్ స్థంభాన్ని ఢీకొనడంతో, తలకు మరియు చెవికి తీవ్రమైన గాయాలు అయ్యాయి. ప్రస్తుతం సుమంత్ ఒంగోలు లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రి లో వెంటిలేటర్ పై అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నాడు. డాక్టర్ల ప్రకారం బ్రెయిన్ డ్యామేజ్ తీవ్రంగా ఉండడంతో చికిత్స ఎంతకాలం కొనసాగుతుందో కూడా తెలియని పరిస్థితి!

ఇప్పటి వరకు గ్రామస్థుల సహాయంతో కొన్ని రోజుల ఖర్చులు భరించినప్పటికీ, ఇకపై ఆసుపత్రి ఖర్చులు భరించలేని పరిస్థితి కుటుంబానికి ఏర్పడింది. గుడ్లూరు మండలం విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షులు అద్దంకి అజయ్ కుమార్ ద్వారా సుమంత్ కుటుంబం చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం అందించ వలసినదిగా వెన్సో ను కోరింది.

హైదరాబాద్ రవీంద్ర భారతి లో విశ్వకర్మ ఆర్ట్ ఫౌండేషన్ వారు నిర్వహించిన ఉగాది పురస్కారాల కార్యక్రమం లో వెన్సో ట్రస్టీలు ..... గారి చేతుల మీదుగా సుమంత్ బంధువు వెంకటాపురం ఆచారి కి 50,000/- రూపాయల చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ తొలి శాసన సభాపతి సిరికొండ మధుసూదనాచారి, శాసనమండలి సభ్యులు దాసోజు శ్రవణ్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి, ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్ పర్సన్ కమ్మరి పార్వతమ్మ, హైదరాబాద్ డి ఆర్ ఓ ఇ. వెంకటాచారి, ఏసిపి సిసిఎస్ జూబౌ కె ఎం కిరణ్ కుమార్,

అధ్యక్షులు డాక్టర్ తుంపాల వెంకటేశ్వరరావు, బంగారు తాతారావు, పెంటా శ్రీనివాస ఆచార్య, కదారు వీర బ్రహ్మం, కొండపి ఎస్ వి గణేష్ బాబు, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బంగారు తాతారావు మాట్లాడుతూ నిస్సహాయ స్థితిలో జీవన పోరాటం చేస్తున్న యువకుడు సుమంత్ కు ఆర్థిక సహాయం చేసి ఆదుకొన్న గౌరవ దాతలకు పేరుపేరునా ధన్యవాదములు తెలిపారు.

## బాబూ జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

ధర్మారం: ప్రముఖ స్వతంత్ర సమరయోధుడు భారత మాజీ ఉప ప్రధాన మంత్రి బాబూజీ జయంతి ఉత్సవ కమిటీ ని శుక్రవారం ధర్మారం జిపి కార్యాలయంలో అన్ని కుల సంఘాల, రాజకీయ నాయకుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ గా మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాంపెల్లి రాజేశం, వైస్ చైర్మన్ గా సోగాల వంశీ, ప్రధాన కార్యదర్శి నార ప్రేమ్ సాగర్, ప్రచార కార్యదర్శి జేరిపోతుల శ్రీకాంత్, కోశాధికారిగా బొల్లి సూర్యచరణ్, లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి దాగేటి ఉదయ్ యాదవ్, దేవి జనార్ధన్, పాలకుర్తి రాజేశం, తుమ్మలరాం బాబు, సొగాల తిరుపతి, బొమ్మగాని సతీష్, దేవి అఖిల్, నాగరాజు, నూనె సత్యనారాయణ, నాడేం శ్రీనివాస్, దేవి కిషోర్, ఈదుల శ్రీనివాస్, రాము,దేవి నళిని కాంత్, దేవి లావణ్య, దేవి రాజేందర్, పి స్వరూపరాని, సాల్వాజీ మాధవరావు, రాగుల మల్లేశం, దేవి వంశీ కృష్ణ, దేవి అజయ్, పాలకుర్తి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## మండుటెండల ను సైతం లెక్కచేయని భక్తులు



హుజూర్ నగర్ ఏప్రిల్ 3 హుజూర్ నగర్ పట్టణానికి అతి సమీపాన స్వయంభుగా వెలిసిన స్వామి పడగ రాయి గుట్ట స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆ స్వామి సన్నిధిలో ప్రతి శుక్రవారం దాతల సహకారంతో ఆలయ కమిటీ వారు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు అంతేకాకుండా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇట్టి అన్నదాన కార్యక్రమం దాత కదిర వెంకటరెడ్డి శ్రీలక్ష్మి దంపతులు వేపల సింగారం వాస్తవ్యులు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామివారి సన్నిధిలో అన్నదాన కార్యక్రమం చేయడం గొప్ప భాగ్యముగా మేము భావిస్తున్నాం వారు తెలియజేశారు అదేవిధంగా ఆలయ కమిటీ వారు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం భక్తులు తమ దాతృత్వం చాటుకుంటున్నారు స్వామి వారి సన్నిధికి వచ్చే భక్తులకు ఎండ నుండి ఎటువంటి ఆటంకాలు కలక్కుండా ఏర్పాట్లు అన్ని చూసుకుంటున్నారు ఆలయ కమిటీ వారు ప్రతి శుక్రవారం అందుబాటులో ఉంటూ ఆలయ అభివృద్ధికి తోడ్పడుతున్నారు అదేవిధంగా భక్తులు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ఆ దేవుని కరుణ కటాక్షాలు మీ మీద ఉండాలని ఆలయ కమిటీ వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు శాగం రెడ్డి కృష్ణారెడ్డి ప్రధాన కార్యదర్శి పొనుగుపాటి వెంకటేశ్వరరావు కోశాధికారి గుర్రం చిన్న వెంకటరెడ్డి ఉపాధ్యక్షులు తోడేటి సర్వయ్య వీరవల్లి గురునాథం శంకరమ్మ అమరోజ్ నాగరాజ్ భక్తులు తదితరులు పాల్గొన్నారు

## భక్తులకు చల్లని త్రాగునీరు అందించేందుకు.. భీమేశ్వర ఆలయంలో చలివేంద్రం ప్రారంభం



వేములవాడ రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని భక్తులకు చల్లని త్రాగునీరు అందించే ఏర్పాట్లు చేశారు. ఆలయంలో ఏర్పాటు చేసిన జల ప్రసాద కేంద్రం ప్లాంట్ ద్వారా కూలర్లకు నల్లల ద్వారా త్రాగునీరు అందిస్తూ భక్తులకు సౌకర్యం కల్పిస్తున్నారు.అలాగే సేవా వాలంటీర్ల సహకారంతో అవసరమైన ప్రాంతాల్లో కూల్ బబుల్స్ ఏర్పాటు చేసి భక్తులకు సులభంగా నీరు అందే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నటరాజ స్వామి విగ్రహం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆలయ ఈవో రమాదేవి ప్రారంభించారు.వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఆలయ పరిసరాల్లోని ఇతర ప్రాంతాల్లో కూడా అవసరాన్ని బట్టి మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఈవో తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు, అలాగే విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి త్రాగునీరు అందుబాటులో ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, సేవా వాలంటీర్లు పాల్గొన్నారు.

## సర్వాయి పల్లెలో అభయ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



కడప మైదుకూరు మున్సిపాలిటీ పదవ వార్డు సర్వాయిపల్లి గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి నూతన దేవాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ శుక్రవారం శంకుస్థాపన చేశారు.. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతోపాటు స్థానిక కౌన్సిలర్ సుబ్బారెడ్డి ఇతర నాయకులు తదితరులు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కు ఘనంగా స్వాగతం పలికి గ్రామంలోకి ఆహ్వానించారు.ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కు వేద పండితులు ఆశీర్వచనము లు అందజేశారు .అనంతరం అభయాంజనేయ స్వామి దేవాలయానికి పునాదిరాయివేసి ఆలయ నిర్మాణ పనులు ఎమ్మెల్యే ప్రారంభించారు.. ఈ సందర్భంగాఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ను శాలువా, పూలమాల తలపాగా తో గ్రామ ప్రజలతోపాటు టిడిపి నాయకులు సుబ్బారెడ్డి తదితరులు ఘనంగా సత్కారం చేశారు.

# విద్యార్థులు ఇష్టపడి కష్టపడి చదవాలి

## ఏఎస్ఐ అక్బర్ బాషా



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 3** వెంకటాపురం మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన వెంకటాపురం మండల పరిధిలోని మరికల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వెంకటాపురం ఏఎస్ఐ అక్బర్ బాషా గురువారం పలు సూచనలు అందించారు మరికలా గ్రామంలో నిర్వహించిన గ్రామసభకు విధులు నిర్వర్తించేందుకు వెళ్లిన భాష సమీపంలోని పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి పలు సూచనలు అందించారు విద్యార్థులు ఇష్టపడి కష్టపడి చదవాలని ఉన్నత శిఖరాలను అధిరోహించి పాఠశాలకు గ్రామానికి ఉపాధ్యాయులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు ఈ సందర్భంగా పాఠశాలలో పెయింటింగ్ నిమిత్తం ఐదు వేల రూపాయల నగదును పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు ఏ ఎస్ ఐ అక్బర్ బాషాను పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు ~~× కీ శాలువ తో అభినందించారు

# డిజిటల్ మీడియాపై సెన్సారింగ్

## (సి. హెచ్. ప్రతాప్)

ప్రస్తుత సమాచార సాంకేతిక యుగంలో డిజిటల్ మాధ్యమాలు ప్రతి ఒక్కరి జీవితంలోనూ అంతర్భాగమయ్యాయి. సామాజిక మాధ్యమాలు, ఓటిటి వేదికలు స్మార్ట్‌ఫోన్ ద్వారా తక్షణమే అందుబాటులోకి రావడం వల్ల సమాచార వ్యాప్తి సులభమైంది. అయితే, ఈ స్వేచ్ఛతో పాటు హానికరమైన కంటెంట్ కూడా విపరీతంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో డిజిటల్ మీడియాపై సెన్సార్‌షిప్ లేదా క్రమబద్ధమైన నియంత్రణ అవశ్యకత గతంలో కంటే ఇప్పుడు చాలా ఎక్కువగా ఉంది. సంప్రదాయ చలనచిత్రాలు, వార్తాపత్రికలకు ఉన్నట్లుగా కఠినమైన నిబంధనలు లేకపోవడం వల్ల సమాజంపై, ముఖ్యంగా యువత మరియు బాలలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతోంది.

డిజిటల్ వేదికలపై ప్రసారమయ్యే అనేక చిత్రాలు, ధారావాహికలలో మితిమీరిన హింస, అశ్లీలత మరియు అసభ్యకరమైన భాషా ప్రయోగం నియంత్రణ లేకుండా సాగుతున్నాయి. కఠినమైన వడపోత ప్రక్రియ లేకపోవడం వల్ల చిన్న పిల్లలు సైతం ఇటువంటి కంటెంట్‌ను సులభంగా వీక్షిస్తున్నారు. ఇది వారి మానసిక వికాసంపై ప్రతికూల ముద్ర వేస్తూ నేర ప్రవృత్తికి దారితీస్తోంది. నైతిక విలువలను కాపాడాలంటే డిజిటల్ కంటెంట్‌ను నిశితంగా పరిశీలించి, తగిన రేటింగ్స్ కేటాయించడం మరియు అభ్యంతరకరమైన దృశ్యాలను తొలగించడం వంటి చర్యలు తప్పనిసరి.

డిజిటల్ మీడియా ద్వారా వ్యాప్తి చెందుతున్న తప్పుడు సమాచారం లేదా 'ఫేక్ న్యూస్' నేడు సామాజిక శాంతికి పెద్ద సవాలుగా మారింది. మతపరమైన ఉద్రిక్తతలు రెచ్చగొట్టేలా రూపొందించిన కంటెంట్ క్షణాల్లో కోట్లాది మందికి చేరుతూ అల్లర్లకు కారణమవుతోంది. దేశ భద్రతకు ముప్పు కలిగించే అంశాలను మరియు సైబర్ వేధింపులను అరికట్టడానికి ప్రభుత్వ నిఘా అత్యంత అవసరం. భావప్రకటనా స్వేచ్ఛ అనే పేరుతో ఇతరుల వ్యక్తిత్వ హననానికి పాల్పడటం లేదా సామాజిక ప్రశాంతతను దెబ్బతీయడం ఆమోదయోగ్యం కాదు.

కళాకారుల సృజనాత్మకతకు స్వేచ్ఛ ఉండాలి, కానీ అది సామాజిక హితాన్ని విస్మరించకూడదు. డిజిటల్ సంస్థలు స్వయం నియంత్రణ పాటించనప్పుడు ప్రభుత్వం కఠినమైన చట్టాలను అమలు చేయాల్సి ఉంటుంది. డీప్‌ఫేక్స్ మరియు కృత్రిమ మేధతో సృష్టించే తప్పుడు సమాచారాన్ని అరికట్టడానికి చట్టపరమైన నియంత్రణ ఎంతో అవసరం. కేవలం వీక్షకుల సంఖ్యను పెంచుకోవడమే లక్ష్యంగా కాకుండా బాధ్యతాయుతమైన సమాచారాన్ని అందించడంపై దృష్టి సారించాలి. అంతర్జాల ప్రపంచం సురక్షితంగా ఉన్నప్పుడే సామాజిక ప్రగతి సాధ్యమవుతుంది. నియంత్రణ లేని స్వేచ్ఛ అరాచకానికి దారి తీస్తుంది కావున, తగిన పరిమితులతో కూడిన డిజిటల్ వినియోగమే సమాజానికి శ్రేయస్కరం.

# ఏటూరునాగారం లో ఇంకుడు గుంతల నిర్మాణ పనులను పరిశీలించిన బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 3** ఏటూరునాగారం మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో మురుగునీటి సమస్య పరిష్కారానికి చేపట్టిన సామూహిక ఇంకుడు గుంత (నిర్మాణ పనులను ములుగు జిల్లా పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు శుక్రవారం నాడు పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూగర్భ జలాల పెరుగుదలకు మరియు గ్రామంలో పారిశుద్ధ్య మెరుగుదలకు ఇంకుడు గుంతలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా పెద్ద పరిమాణంలో నిర్మిస్తున్న ఈ సోక్ పిట్ ద్వారా మురుగునీరు రోడ్లపై నిల్వ ఉండకుండా, శాస్త్రీయ పద్ధతిలో భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని కోరారు

నాణ్యత పరిశీలన గుంత నిర్మాణంలో ఉపయోగిస్తున్న రాళ్లు, ఫిల్టర్ బెడ్ నాణ్యతను ఆయన స్వయంగా తనిఖీ చేశారు.జల సంరక్షణ: ప్రతి చుక్క నీటిని భూమిలోకి పంపడం ద్వారా భవిష్యత్తులో నీటి ఎద్దడి రాకుండా చూడవచ్చని అధికారులను కోరారు

ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గడదాసు సునీల్ కుమార్, కాకులమర్రి ప్రదీప్ రావు గారు, తాడూరి రఘు, వార్డు మెంబర్ ఏంపెల్లి రాజు, కొండాయి చిన్ని, బట్టు గోపి, వావిలాల ముత్తయ్య, చిప్ప నాగరాజు, ఎర్రల సారయ్య, ఎస్.కె బాబా, ఫీల్డ్ అసిస్టెంట్ సాంబశివరావు నాయకులు, పంచాయతీ సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# తరగిపోతున్న గుట్టలు బాంబుల మోతతో ఉలికి పడుతున్న పల్లె జనం



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 3** ములుగు ములుగు మండలంలోని మహమ్మద్ గౌస్ పల్లి గ్రామంలో పచ్చటి అడవి ప్రాంతంతో ప్రకృతి ప్రసాదించిన గుట్టలు ప్రజలకు ఆకట్టుకునే విధంగా దర్శనమిస్తున్న గుట్టలు ఆ ప్రాంత వాసులకు మంచి వర్షపాతాన్ని ఆక్సిజన్ అందజేస్తూ ప్రజల జీవన ప్రమాణాన్ని పెంచుతున్న తరుణంలో అక్రమార్కులు ఎంతోమంది డబ్బు సంపాదన లక్ష్యంగా గుట్టలను సైతం పిండి పిప్పి చేస్తున్నారు అనుమతులు లేని క్రషర్ల తో గుట్టలను బాంబులు పెట్టి పేలుస్తూ ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీస్తున్నారు పలుమార్లు గ్రామస్తులు అధికారులకు తెలియజేసిన ఏ అధికారి పట్టించుకున్న పాపాన పోలేదు ఈ తంతు ఇలాగే కొనసాగితే రానున్న కాలంలో గుట్టలు అనేవి లేకుండా పోతాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు తక్షణమే జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకుని తక్షణమే బ్లాస్టింగ్ నిలిపివేయాలని కోరుతూ ప్రకృతి ప్రసాదించిన వారసత్వ సంపదను కాపాడుకునే బాధ్యత ములుగు జిల్లా ప్రజల అందరిదని అన్నారు

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమం



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 3 ములుగ** జిల్లా సంక్షేమ భవనంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి డా. కె. కొమురయ్య (ఐదీజఐా) గారి ఆధ్వర్యంలో జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి మాట్లాడుతూ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అతి సాధారణ కుటుంబంలో జన్మించి, తన ధైర్యసాహసాలతో తనకున్న మిత్రుల అండ దండతో మొఘల్ సామ్రాజ్యాన్ని సవాలు చేసి, గోల్కొండ కోటపై బహుజన జెండాను ఎగరవేసి సుమారు 7 నెలలు పాలించిన తొలి బహుజన నాయకుడని కొనియాడారు.



అలాగే ఆయన సుమారు 30 సంవత్సరాల పాటు స్వంత రాజ్యాన్ని పాలించిన తెలంగాణ బహుజన ముద్దుబిడ్డగా చరిత్రలో నిలిచారని ప్రశంసించారు

ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన వారు ములుగు పులి నర్సింగం గౌడ్, జిల్లా జీూజ అధ్యక్షులు ముంజాల బిక్షపతి గౌడ్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, మరియు సంక్షేమ భవన కార్యాలయ సిబ్బంది. బిసి వెల్ఫేర్ శాఖా ఉద్యోగులు సరిత, మానస, రేణుక, సాడాలు, జి.గోపాల్ చారి, రత్నాకర్ నాలుగవ తరగతుల ఉద్యోగులు, విలేకరులు పాల్గొన్నారు.

జిల్లా వె.బ.త.అభివృద్ధి అధికారి
ములుగు జిల్లా .

# మండల వ్యాప్తంగా గ్రామసభలు

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధ: మార్చి03 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** "ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, మండల వ్యాప్తంగా గురువారం గ్రామసభలు, అధికారుల సమక్షంలో, సర్పంచ్ ఆధ్వర్యంలో, గ్రామ పంచాయతీ కార్యదర్శులు నిర్వహించారు, ఈ సందర్భంగా పుల్కల్ మండల పరిధిలోని, గొంగులూరు,గ్రామంలో జరిగిన గ్రామసభలో, ప్రజలు అధికారులను నిలదీశారు, ఈ సందర్భంగా, మాజీ ఎంపిటిసి పల్లెకిష్టయ్య, మాట్లాడుతూ, గ్రామంలో గత వారం క్రితం వేసిన సిసి రోడ్లు, నాణ్యత లేదని, ఆగ్రహం వ్యక్తం చేశారు, కనీసం రోడ్డు వేసేటప్పుడు ఇసుకను ఏ మాత్రం వాడకుండా, రోడ్డు వేశారని, ఆరోపించారు, కంకర, సిమెంట్,డస్ట్,మాత్రమే ఉపయోగించి రోడ్డు నిర్మించార ని, సంబంధిత అధికారులు దానిని పరిశీలించి, బిల్లులు నిలిపివేయాలని, డిమాండ్ చేశారు, పాలకవర్గం ఏర్పడినప్పటి నుంచి, ఇప్పటివరకు ఎన్ని నిధులు వచ్చాయని అన్నారు, ఇది గ్రామ ప్రజలందరి ముందట, తెలియజేయలన్నారు, అదేవిధంగా పాత బకాయిలను ఎంత చెల్లించాలని, దానిని కూడా ప్రజల ముందే చెప్పాలని, మొండిపట్టు పట్టారు, ప్రస్తుతం పంచాయతీలో, ఎన్ని నిధులు ఉన్నాయని, పూర్తి వివరాలు గ్రామ ప్రజలందరికీ, తెలియజేయాలన్నారు, ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు,యువత, అంగన్వాడి టీచర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు



# గుల్షన్ ఏ పాతిమ సొసైటీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



**ములుగు జిల్లా ప్రజాపాలం ప్రతినిధి ఏప్రిల్ 3 ఏటూరు నాగారం** జాతీయ రహదారి 163 పై రోడ్డుకు ప్రక్కన ఉన్న మస్జిద్ ఏ ఖద్రియ వద్ద వేసవి కాలం కావడంతో బాటసారులకు దాహం తీర్చాలని ఉద్దేశంతో గుల్షన్ ఏ ఫాతిమా హెల్పర్ సొసైటీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు

ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడానికి స్థానిక ఎస్సై మహేష్ చలివేంద్రాన్ని ప్రారంభించి బాటసారిలకు చల్లటి నీటిని అందించారు ఈ కార్యక్రమం చేసిన ముస్లిం సోదరులందరికీ ఎస్ఐ మహేష్ ఇలాంటి మంచి కార్యక్రమాలు మరెన్నో చేయాలని కోరుకుంటూ అభినందించారు

## తిరుపతి లో గుడ్ ఫ్రైడే వేడుకలు

గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని పురస్కరించుకుని ఎక్కడ చూసినా వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. తిరుపతి జిల్లా లోని ప్రార్థనా మందిరాల్లో, క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మానవాళి పాప విమోచనం కోసం ఏసుక్రీస్తు తన ప్రాణాన్ని త్యాగం చేసిన రోజును క్రైస్తవ సోదరులు "గుడ్ ఫ్రైడే" ను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచి చర్చిల్లో, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రేమ, త్యాగం, విశ్వాసం వంటి సుగుణాలను ప్రపంచ మానవాళికి పరిచయం చేసిన ఏసుక్రీస్తు బోధనలు ఈనాటికీ అనుసరణీయమని, ఆచరణీయమని క్రైస్తవులు సోదరులు తెలిపారు.

## మూడ నమ్మకాలు నమ్మకండి పోలీస్ అధికారి

### ఓ పోలీస్ అధికారి మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు





**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి మార్చి 03(ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ ప్రాంతాల్లో, ఇంకా మూఢనమ్మకాలు నమ్ముతున్నారని, రోడ్డుపై నిమ్మకాయలు, కొబ్బరికాయలు, పెట్టే మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా, అవగాహన కల్పించేందుకు, ఒక పోలీస్ అధికారి చేపట్టిన చోరువనె ఈ కథనం! తెలియజేస్తుంది, పోలీస్ అధికారి ఓం ప్రకాష్, వ్యాధులను నయం చేయడానికి, రోడ్లపై కొబ్బరికాయలు నిమ్మకాయలు పెట్టడం వంటి,మూఢనమ్మకాలను, చురుకుగా నిరుత్సాహపరిచారు, ఈ వస్తువులు తినడానికి మాత్రమేనని, మాయాజాలం కోసం కాదని, నిరూపించడానికి, అక్కడ మూడు దారుల వద్ద పెట్టినటువంటి, అతను అక్కడికక్కడే, అందులో నుంచి ఒక కొబ్బరికాయ తీసుకొని, కొట్టి తిన్నాడు, నిమ్మకాయలు గుడ్ల వల్ల కలిగే అసలైన పోషక, ఆరోగ్య ప్రయోజనాలను, ఆయన వివరిస్తూ, ప్రజలు ఇలాంటి వదంతులను మానుకోవాలని, విజ్ఞప్తి చేశారు, ఈ అధికారి సృజనాత్మక, విధానానికి, నేటిజెన్ల, నుంచి ప్రశంసలు లభించాయి.

## అంజన్న మాలధారణ స్వాములకు నిలువ నీడ లేక ఇబ్బందులు

### ఆలయ కమిటీపై భక్తుల ఆగ్రహం



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 3** ఏటూరు నాగారంశ్రీ రామ నవమి అనంతరం మండల దీక్షలో ఉన్న స్వాములకు తగిన సదుపాయాలు లేకపోవడంతో తీవ్ర అసంతృప్తి

స్థానిక రామాలయం గుడి కళ్యాణ మండపం వద్ద శ్రీ రామ నవమి సందర్భంగా దాతల సహకారంతో చల్లటి పందిళ్లు ఏర్పాటు చేయడం జరిగింది. పండుగ సమయంలో భక్తులకు మంచి సౌకర్యాలు కల్పించినప్పటికీ, అనంతరం పరిస్థితులు మారడం గమనార్హం.

శ్రీ రామ నవమి ముగిసిన తరువాత హనుమాన్ స్వాములు, అంజన్న స్వాములు 41 రోజుల మండల దీక్షలో భాగంగా మాలధారణ చేపట్టారు. ప్రతి సంవత్సరం ఈ సమయంలో రామాలయం వద్ద స్వాముల కోసం ప్రత్యేకంగా కుటీరాలు ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

అయితే ఈ ఏడాది మాత్రం ఆలయ కమిటీ సభ్యులు ఆ సంప్రదాయాన్ని కొనసాగించకపోవడంతో మాలధారణలో ఉన్న స్వాములు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండ వేడి తీవ్రత ఎక్కువగా ఉండటంతో నిలువ నీడ లేక భక్తులు, స్వాములు బాధపడుతున్నారు. ఈ పరిస్థితిపై భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తూ, వెంటనే స్థానిక గ్రామ పెద్దలు.స్పందించి స్వాములకు తగిన నీడ, తాగునీరు, విశ్రాంతి సదుపాయాలు కల్పించాలని దాతలను కోరారు

## మేదారం సమ్మక్క గద్దెల వద్ద గాయపడ్డ బాలుడి యువాన్ ను పరామర్శించిన బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్

### మేదారం కట్టడాలు 1000 ఏళ్ల నిలిచిపోయే చరిత్ర అని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ ఒక నిండు బాలుడి జీవితానికి శాపంగా మారింది





తాడ్వాయి మండల మేదారం గ్రామంలో గత నెల 25వ తేదీన మేదారం గద్దెల వద్ద ప్రమాదానికి గురైన పూజారి సిద్దబోయిన రమేష్ కుమారుడు యువన్(6 సంవత్సరాలు సమ్మక్క గద్దె వద్ద ఆడుకుంటున్న సమయంలో గద్దె కు ఉన్న సైడ్ బండలు కాళ్లపై ఊడిపడడంతో దీనితో వైద్య నిమిత్తం హాస్పటల్ తరలించగా బాలుడు యువన్ కాలు పూర్తిగా నుజ్జు నుజ్జు కావడంతో కాలు తొలగించిన వైద్యులు మరొక కాలు కూడా ప్యాక్చర్ కావడం జరిగినది బాలుడు యువాన్ పరిస్థితి చాలా బాధాకరంగా ఉందని లక్ష్మణ్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు

మేదారం ప్రమాదంలో గాయపడ్డ బాలుడి కుటుంబానికి 25 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని మరియు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగాన్ని ఇవ్వాలని ఈ సందర్భంగా ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకుల మర్రి లక్ష్మణ్ బాబు డిమాండ్ చేశారుబి

బిఆర్ఎస్ పార్టీ పక్షాన అనేకసార్లు నాణ్యత లోపిస్తుందని చెప్పినప్పటికీ ప్రభుత్వం మరియు కాంట్రాక్టర్లు మంత్రులు పెడచెవిన పెట్టి కాసులు కక్కుర్తి కోసం నిరుపేద అయినా సమ్మక్క పూజారి సిద్ధబొయిన రమేష్ కొడుకు యావన్ ఒక కాలు పూర్తిగా తీసివేయగా మరొక కాలు అంగవైకల్యంలోనే ఉండడం చాలా బాధాకరమని దీనికి కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రులు పూర్తి బాధ్యత వహించాలని

ఈ సందర్భంగా లక్ష్మణ్ బాబు డిమాండ్ చేశారు ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రులు సీతక్క కళ్ళు తెరిచి మేదారంలో మేదారం జాతర ముందు పనులపై ఎన్నోసార్లు జరిగిన సంఘటనపై విచారణ జరిపించి సంబంధిత అధికారులు కాంట్రాక్టర్లపై చర్య తీసుకోవాలని మరియు ఇటువంటి సంఘటనలు పునరావతం కాకుండా ఉండేందుకు మేదారం అభివృద్ధి పనులను సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించి బాధ్యులపై చర్య తీసుకొని మరియు రాబోయే రోజుల్లో ప్రమాదాలు జరగకుండా చూడాలని ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ప్రభుత్వనికి విజ్ఞప్తి చేశారు.

బి ఆర్ఎస్ ప్రభుత్వం సమ్మక్క సారక్క పూజారి సిద్ధబోయిన రమేష్ కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని వారు తెలుపడం జరిగింది

ఈ కార్యక్రమంలో ఏటురునాగారం సర్పంచ్ కాకులమర్రి శ్రీలత బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కాకులమర్రి ప్రదీప్ రావు ఎండి వాలి బాబా బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు....

## కోట మర్పల్లి ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి నిధులతో సిసి రోడ్డు మరమ్మత్తులు



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఏప్రిల్ 3(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:**మర్పల్లి మండలంలోని కోట్ మర్పల్లి గ్రామంలో ఎస్సీ కాలనీలో సిసి రోడ్ ప్రారంభించడం జరిగింది, గౌ, చేవెళ్ల ఎశీ పి కొండా విశ్వేశ్వర్ రెడ్డి , ఎంపి నిధులు మరియు వీ+చీ=జు+ూ నిధులతో సీసీ రోడ్డు పనులు బలరాం గౌడ్ సమక్షంలో మరియు జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల లక్ష్మయ్య మండల ఇన్చార్జి రామేశ్వర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి శ్రీమంత్ కుమార్, రమేష్, గారితో ,కలిసి భూమి పూజ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా,బిజెపి జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల లక్ష్మయ్య మండల ప్రధాన కార్యదర్శి శ్రీమంత్ కుమార్ , రమేష్ ,బలరాం గౌడ్ శ్రీమంత్ రమేష్ గ్రామ పెద్దల, కృష్ణారెడ్డి మార్కెట్ కమిటీచైర్మన్ మాజీ,మహేందర్ విష్ణువర్ధన్ రెడ్డి గ్రామ నాయకులు మిత్రులు తదితరులు పాల్గొన్నారు



ఈ సందర్భంగా బలరాం గౌడ్ గారు మాట్లాడుతూ గ్రామంలో ప్రతి అభివృద్ధికేంద్ర ప్రభుత్వ నిధులతోనేజరుగుతున్నాయని ఎంపీ గారు మన మండలం పై ఎంతో ప్రత్యేక దృష్టి పెట్టీ ఎక్కువ నిధులు మంజూరు చేశారని, రాబోవు కాలంలో అవసరమైతే మళ్లీ నియోజకవర్గ, మండల అభివృద్ధికి సరిపడా నిధులు ఎంపీ గారి సహకారంతో తెస్తానని, పనులన్నీ సవ్యంగా జరగాలని, గ్రామాలలోని ప్రజలు ఈ అభివృద్ధి కార్యక్రమాలకు ఎంతో హర్షిస్తున్నారని బలరాం గౌడ్ వివరించారు

## దొడ్డి కొమరయ్య త్యాగం తెలంగాణ సాధనకు పునాది

### దొడ్డి కొమరయ్య 99 వ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న మల్లి బాబు యాదవ్



**ఇల్లందు ప్రతినిధి ఏప్రిల్ 3 (ప్రజాబలం)** ఇల్లందు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అసు వులుబాసిన తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య చేసిన త్యాగం ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, ప్రతి ఒక్కరూ వారి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు, మేకల మల్లిబాబు యాదవ్ పిలుపునిచ్చారు శుక్రవారం నాడు దొడ్డి కొమరయ్య 99 వ జయంతి సందర్భంగా పండితాపురం గ్రామంలో చిత్రపటానికి మల్లి బాబు యాదవ్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దొడ్డి కొమరయ్య జనగామ జిల్లా కడవెండి గ్రామంలో 1927 ఏప్రిల్ 3న సాధారణ గొర్రెల పెంపకం దారుల కుటుంబంలో జన్మించి నిజాం జాగిర్దారుల బలవంతమైన వెట్టి చాకిరి నిర్మూలన కొరకు తెలంగాణ సాధన కోసం, జరిగిన సాయుధ రైతాంగ పోరాటంలో కేవలం 19 ఏళ్లకే చిన్న వయసులోనే ప్రాణాలను పణంగా పెట్టి తొలి అమరవీరుడ య్యాడని, నాడు ఆయన చూపిన త్యాగం మనందరకు స్ఫూర్తి అని, అందుకే మనం తెలంగాణ స్వేచ్ఛ వాయువులు పీల్చగలుగుతున్నామని, దొడ్డి కొమరయ్య ఆశయ సాధనకు మేమంతా కట్టుబడి ఉన్నామని, వారి ఉద్యమ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మేకల మల్లికార్జునరావు, జి. రవి చింతల పెద్ద వెంకయ్య, అల్లిక బక్కయ్య, శీలం పుల్లయ్య, పాటిబండ్ల ప్రసాదు, మల్లికార్జున్ నరేష్ నాగరాజు మరియు తదితరులు పాల్గొన్నారు

## జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తా: కలెక్టర్ రాజర్షి షా

### వినతి పత్రాన్ని అందజే సిన టీ.ఎస్.జె యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల్ అనిల్ కుమార్ జిల్లా నాయకులు. అదిలాబాద్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక.

**అదిలాబాద్ప్రజాబలం ప్రతినిది**ఏప్రిల్ :03 తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్(టీ.ఎస్.జె.యు)జిల్లా నూతనంగా ఎన్నుకోబ డిన కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సమావేశ కార్యాలయంలో కలెక్టర్ రాజర్షి షా ను మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రాన్నీ అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నూతనంగా ఎన్నుకొబడిన జిల్లా అధ్యక్షుడు రాగం సుభాష్,ప్రధాన కార్యదర్శి మేడపట్ల సాయన్న,ఉపాధ్య క్షులు పసుపుల స్వామిలకు శుభాకాంక్షలు తెలియజే శారు.ఈ సందర్భంగా యూని యన్ నాయకులు జర్నలిస్టు లు ఎదుర్కొంటున్న సమస్య లను ఆయన దృష్టికి తీసుకు వచ్చారు.ఇందులో ప్రధానంగా అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులను మంజూరు చేయడంతో పాటు హెల్త్ కార్డులు అన్ని



ప్రైవేటు ఆసు పత్రులలో చెల్లుబాటు అయ్యే విధంగా చూడాలని,అర్హులైన జర్నలిస్టుల అందరికీ ఇల్లు, ఇంటి స్థలాలు ఇవ్వవలసింది గా కోరారు.దీనిలో భాగంగా జర్నలిస్టులపై దాడులు జరు గుతున్న సందర్భంలో అటాక్స్ కమిటీని జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసి రక్షణ కల్పించా ల్సిందిగా విజ్ఞప్తి చేశారు.దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సమస్యల పరిష్కారా నికి చొరవ చూపుతామని వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తాను అని బరోసా ఇచ్చారు.యూనియన్ కోశాధికారి అమృత్,ఓకే ప్రచార కార్యదర్శి మిలింద్, యూనియన్ గౌరవ అధ్యక్షు లు నరేష్ కదం,సహాయ కార్యదర్శి ఆర్కసంతోష్ తో పాటు మిగతా సభ్యులు దీపక్ ఎమ్మర్లవార్,అనిల్ పవర్,అడ్డిగం మోహన్,శంకర్ తదితరులు ఉన్నారు.

# మర్పల్లి నిత్యం పూలమాలతో పూజింపబడుతున్న భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 3 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం మర్పల్లి టౌన్ లో నిత్యం పూలమాలతో అందంగా ముస్తాబవుతున్న బాబాసాహెబ్ అంబేద్కర్ ఏప్రిల్ ఫస్ట్ నుండి ఏప్రిల్ 14 వరకు నిత్యం భక్తి శ్రద్ధలతోప్రేమానురాగాలతోపూలమాలలు అందరి ఆరాధ్య దేవుడు బాబాసాహెబ్ అంబేద్కర్ అని నవపేట్ మండల ఇన్చార్జి ఆనందం తెలిపారు భారతరత్న అంటే నే ఒక నక్షత్రం లాంటి వెలుగు మాటలు స్పష్టత గౌరవంలో హుందాతనంలో ఎదుటివారిని ప్రేమించే గొప్ప మనసున్న జ్ఞాన వంతుడు వెలిగే సూర్యుడు మన బాబాసాహెబ్ అంబేద్కర్ అని మర్పల్లి మండల ప్రెసిడెంట్ శివా తెలిపారు బాబా సాహెబ్ గొప్ప జ్ఞానశీలి గొప్ప మేధావి ఆయన మాటలు పవర్ ఉంది ఆయన దగ్గర సిరి సంపదలు లేకపోవచ్చు కానీ టన్నులకు టన్నులు జ్ఞాన సంపద ఉన్న ప్రపంచ జ్ఞాని మన బాబాసాహెబ్ అంబేద్కర్ అని భరత్ తెలిపారు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి భారతదేశ ముద్దుబిడ్డ ప్రపంచాల దేశాలలో తనకంటూ ఒక సంపద ఉంది అది జ్ఞానము అని నిరూపించుకున్న గొప్ప వ్యక్తి మన బాబాసాహెబ్ అంబేద్కర్ అని ఫైలు నర్సింలు తెలిపారు ఏప్రిల్ ఒకటి నుండి ఏప్రిల్ 14 వరకు నిత్యము పూలమాలలతో అంబేద్కర్ పండగ సంబరాలు నిరంతరం జరుగుతాయని మర్పల్లి మండల అంబేద్కర్ యూత్ అసోసియేషన్ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తపరిచారు

## తెలంగాణ సాయుధ పోరాట వీరుడు "దొడ్డి కొమురయ్య"

## జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)పి.చంద్రయ్య



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 03 :** నిజాం నిరంకుశ పాలనలో ప్రజల సంక్షేమం,భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణ సాయుధ ఉద్యమంలో దొడ్డి కొమురయ్య అలుపెరుగని పోరాటం చేశారని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమరయ్య జయంతి ఉత్సవాలకు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి,జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ,వివిధ కుల సంఘాల ప్రతినిధులు, వెనుకబడిన తరగతుల కులాల సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగించి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ...నిజాం నిరంకుశ పాలనలో అణిచివేతకు గురవుతున్న ప్రజల ఆత్మగౌరవం, భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటం ఉద్యమంలో దొడ్డి కొమురయ్య వీరోచిత పోరాటం చేశారని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న పరిస్థితులపై చైతన్యపరిచి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేశారని తెలిపారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం దొడ్డి కొమురయ్య చేసిన పోరాటం యువతకు మార్గదర్శకమని తెలిపారు.దేశ స్వాతంత్రం, ప్రజల సంక్షేమం కోసం వీరోచితంగా పోరాడి, ప్రాణ త్యాగాలు చేసిన మహనీయుల చరిత్రను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో వసతి గృహాల సంక్షేమ అధికారులు, యాదవ, కురుమ కుల సంఘాల ప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 4న మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ పరీక్ష ఎన్నికకు పూర్తి ఏర్పాట్లు


## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)పి.చంద్రయ్య

**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 03 :** మున్సిపల్ సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 4వ తేదీన జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపాలిటీలో చైర్‌పర్సన్,వైస్ చైర్‌పర్సన్ ల పరోక్ష ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు.శుక్రవారం బెల్లంపల్లి సబ్ కలెక్టర్,ఎన్నికల పరిశీలకులు మనోజ్ తో కలిసి క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయాన్ని సందర్శించి బి-ఫామ్ జారీకి సంబంధించి ఫామ్-ఎ(అధికార ప్రతినిధి అధికరణ పత్రాలు)ను స్వీకరించారు.ఎన్నికల హాల్‌ను పరిశీలించి,బారికేడింగ్,భద్రతా ఏర్పాట్లు,సదుపాయాలను తనిఖీ చేసి ఎ.సి.పి.ఎస్.ఐ.లతో భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ...ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండేందుకు ప్రత్యక్ష ప్రసారం ఏర్పాట్లు చేయాలని,రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. ఎన్నికలు ప్రశాంతంగా,సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేసి అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రణానంతరం మహోన్నత సేవ

## ముగ్గురికి ప్రాణదానం చేసిన పోలీస్ సోదరుడు




అంబర్‌పేట పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న కంబాల శంకర్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ కావడం అత్యంత విషాదకర ఘటనగా నిలిచింది. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసిన శంకర్ ఆకస్మికంగా మృతిచెందడం పోలీస్ శాఖలోనే కాకుండా స్థానిక ప్రజల్లో కూడా తీవ్రగ్భ్రాంతిని కలిగించింది.అయితే పుట్టెడు దుఃఖంలోనూ శంకర్ కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం సమాజానికి ఆదర్శంగా నిలిచింది. తన కుమారుడు ఇక లేడన్న బాధను పక్కన పెట్టి, మరొకరి ప్రాణాలు కాపాడాలనే గొప్ప సంకల్పంతో ఆయన తండ్రి అవయవ దానం చేయడానికి ముందుకు వచ్చారు.శంకర్ అవయవాలను రెండు కిడ్నీలు మరియు లివర్ దానం చేయడంతో ముగ్గురు ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులు కొత్త జీవితం పొందారు. ఈ మహోన్నత నిర్ణయం ద్వారా శంకర్ మరణానంతరం కూడా జీవించి ఉన్నట్లే అని పలువురు అభిప్రాయపడుతున్నారు.సమాజంలో అవయవ దానం పట్ల అవగాహన పెంచేలా ఈ సంఘటన నిలిచింది. శంకర్ కుటుంబ సభ్యులు చూపిన ఉదారత, మానవత్వం నిజంగా అభినందనీయం. వారి త్యాగం మరెందరికో స్ఫూర్తిగా నిలవనుం

# ఉట్కూర్ అచల ఆశ్రమంలో గురు పూజ.





నారాయణ పేట, ఏప్రిల్ 2(స్కైన్యూస్ ) ప్రతి పౌర్ణమి సందర్భంగా శ్రీ గురు చరణానంద దత్త ఎడ్ల దాసయోగి గారి ప్రియ శిషులు, భక్తులు నిర్వహించే పాదుక పూజ ఈ పౌర్ణమి తేదీ 02-04-2026 నాడు ఉట్కూర్ దగ్గర శ్రీలింగాపురంలోని శ్రీ దత్తాత్రిలింగేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలోని

శ్రీ అచలగురు మందిరంలో

శ్రీ గురు చరణానంద దత్త ఎడ్ల దాసయోగి

పాదుక పూజ నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా ఉదయం 10.30 గంటలకు గురువుగారి దంపతుల సమాధి వద్ద లఘు పూజ చేసిన భక్తులు అనంతరం అచల గరు మందిరంలో గురు పూజ భక్తి శ్రద్ధ లతో ఘనంగా నిర్వహించారు. శ్రీ గురు దర్శనానంద విజయార్యులు ఆధ్వర్యంలో జరిగిన పూజ కార్యక్రమంలో భక్తులు, కుటుంబ సభ్యులు పాల్గొని గురువు గారి కృప పాత్రులు కాగలరని మనవి.

# ప్రజా సమస్యల పరిష్కారానికే ఇంటింటా ఫిర్యాదుల సేకరణ

## ములుగు లో ప్రారంభించిన సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె నారాయణ

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 3** ములుగు ములుగు పట్టణంలో ఇంటింటా సీపీఐ కార్యక్రమాన్ని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తో కలిసి డాక్టర్ కె నారాయణ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈ ప్రచారాన్ని ప్రధానంగా ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడానికి చేపడుతున్నామన్నారు. ఈ ప్రచారంలో పార్టీ నాయకులు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సాధకబాధకాలను స్వయంగా అడిగి తెలుసుకుంటారని చెప్పారు. ముఖ్యంగా పేదల ఇండ్లు, ఇంటి స్థలాలు, గుడిసె వాసులకు పట్టాలు, రేషన్ కార్డులు, పెన్షన్ లు, సాగునీరు వంటి స్థానిక





సమస్యలపై దృష్టి సారించడం జరుగుతుందని ఈ సమస్యలపై ప్రజల నుండి ఫిర్యాదులను సేకరించడం జరుగుతుందని . ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ముఖ్యంగా ఆరు గ్యారెంటీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడంలో ఆలస్యం జరుగుచున్నదని . దీంతో ప్రజలు హామీల అమలు ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారని అన్నారు . ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జును రావు సహాయ కార్యదర్శి జంపాల రవీందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు యండి అంజద్ పాష, ఇంజం కొమురయ్య, ముత్యాల రాజు, బండి నర్సయ్య, వడి సారయ్య,కుమ్మరి సాగర్, జక్కుల అయిలయ్య, రాజు,బుడిమె సదయ్య, బోడ రమేష్,కొక్కుల రాజేందర్, నాసర్, మామిడి నటరాజ్,మంకిడి క్రిష్ణ, లింగమూర్తి, మద్రి స్వామి, పరంసింగ్, దద్ర గోపి,కల్తి తిరుపతి,గొంది రవికుమార్,తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్య 99 వ వేడుకలు

## జూకంటి ప్రవీణ్ కుమార్



రాజాపేట తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు అమరజీవి దొడ్డి కొమురయ్య 99వ జయంతి సందర్భంగా శుక్రవారం రాజపేట మండల కేంద్రంలో మండల కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం, దొడ్డి కొమురయ్య సాగించిన పోరాటం అజరామమైందన్నారు. పీడిత వర్గాల విముక్తి కోసం ఆ మహనీయుడు చేసిన త్యాగాన్ని వెలకట్టలేమన్నారు. దొడ్డి కొమరయ్య పోరాట స్ఫూర్తితో తెలంగాణ సమాజం ముందుకు సాగాలన్నారు. అ మహనీయుని స్మారకార్థంగా హైదరాబాదులో స్మారక కేంద్రం తో పాటు ట్యాంక్ బండ్ పై నిలువెత్తు విగ్రహం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నేతలు గౌర బక్కయ్య, రేగు సిద్ధులు జన్నె సిద్దులు, ఎమ్మ శ్రీను, కోరే వెంకటయ్య ,పోసుగొండ మధు, రావుల ఉపేందర్ వివిధ సంఘాల నేతలు నెమిల కేదారి గౌడ్, రేగు శ్రీశైలం, కొజ్జిగ వీరయ్య ఏమ్మ బాలరాజు, కొలనుపాక బాలయ్య, కర్రె కిష్టయ్య బైకని బిక్షపతి, బచ్చని నర్సింలు దయ్యాల రవి, బండి స్వామి కనకయ్య, జూకంటి సిద్దులు నారపాక కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com